# పూజాసుమం

"ఆగు!"

ఊహించని పిడుగుపాటుకు ఉలిక్కిపడి తలెత్తింది అంజన. తండ్రి తుపాకి తనకేసి గురిపెట్టి ఉన్నాడు. ఆ ముఖంలోని ఆగ్రహావేశాల మెరుపులు చూచి మరొకసారి ఫెళ్ళుమనబోయే ఉరుముకు అంజన సిద్ధపడుతూండగానే –

"ఎక్కడినుండి వస్తున్నావ్?" అని భయంకరంగా ప్రశ్నించాడు జగన్నాధరావు.

తన ప్రాణాలకు ఎదురుగా హత్యాయుధం లేకుంటే చెప్పగలిగిఉండేదేమో అంజన– 'పార్క్‌నుండి' అని! కాని ఆమెనుండి మాట రాలేదు. నిర్విణ్ణురాలై నిలబడిపోయింది. ఎన్నడూ తండ్రిముందు భయమెరుగనిది– ఆమెలో విచిత్రమైన కంపనం ఉత్పన్నమైంది.

"మాట్లాడవేం?" జవాబు పొందని కసి కూడా కలిపి రెట్టించాడు జగన్నాధరావు.

"అమ్మతో చెప్పే వెళ్ళానుకదా!" గొణిగినట్లుగా అంది అంజన. ఆ హాలుకు మరో గుమ్మంలో నిలబడి జరుగుతూన్న కాండను ఆయోమయపడి చూస్తూన్న తల్లి వంక దీనంగా చూస్తూ. భర్త ప్రవర్తనలోని ఈ విపరీతధోరణికి కారణ మేమిటో ఆమెకుమాత్రం ఏంతెలుసు? గంటముందే కోర్టునుండి వచ్చాడు ఆయన. కారునుండి దిగుతూ డోర్ దభేలున మూసి గబగబా గదిలోకి వచ్చి కోర్టుదుస్తులైనా మార్చుకోకుండా చిరాగ్గా పచార్లు చేస్తూంటే, ఏదైనా కేసు విషయంలో కలిగిన అపజయం ఏమో అనుకొంది! ఆ సమయంలో ఆయనను పలకరించడానికి ఎవరికీ గుండె లుండవు! కాని, ఇదేమిటి? అమ్మాయిమీద ఈ అకారణ ఆగ్రహ మేమిటి?

"ఏమని చెప్పావు?"

"..........."

"చెప్పదూ?" గద్దించాడు.

"పార్క్‌కు వెడుతున్నానని," బెదురుతూనే చెప్పింది.



పోల్కంపల్లి శాంతాదేవి

"ఏంపనిమీద ?''

కంగారు అణచిపెట్టుకొని, కొంచెం ధైర్యం తెచ్చుకొంటూ కల్పించుకొంది తల్లి. "అదేమిటండీ ?పార్కులకు అందరూ ఎందుకు వెల్తారు ? ఆదివారం. ఉదయం నుండి ఇంట్లో ఉండీ ఉండీ, కాస్త రిలీఫ్‌గా వెళ్ళిఉంటుంది.''

"అందుకే వెళ్ళిందేమో అడుగు నీ ముద్దులకూతుర్ని !'' హేళన ధ్వనింపజేస్తూ కరుగ్గా నవ్వాడు భర్త.

చోద్యంగా ముక్కుమీద వేలు ఉంచుకొంది ఆమె. ''అదేమిటి వింతగా మాట్లాడుతున్నారు ? అది ఇవ్వాళ కొత్తగా పార్కుకు వెళ్ళినట్లు రభస చేస్తున్నారు ? అదిఎవడినో కలుసుకోవడానికి వెళ్ళినట్లు గంతులు వేస్తున్నా రేమిటి ?''

"అందుకేనే గంతులు ?''

విసుగ్గా కుమార్తెవంక తిరిగి, ''అలా కళ్ళప్పగించి చూస్తున్నా వేం ? ఆయన ధోరణి చూస్తున్నావుకదా, అంజూ ? మన ఇంటా వంటా ఉన్నాయా అలాంటిబుద్ధులు? ఆయనకు తగిన సమాధానం చెప్పూ !'' అందామె.

అంజన కళ్ళు దించుకొంది. పెదవి కదల్చలేదు.

''చెప్పు సమాధానం ! కృష్ణతో ఎన్నాళ్ళ నుండి సాగుతుం దీ సంబంధం ? కాదు – ప్రేమానుబంధం ?'' వ్యంగ్యంగా, కటువుగా గద్దించాడు జగన్నాధరావు.

బెదిరిపోయిన అంజన బేలగా తల్లిని చూసుకొంది. ''రక్షించు, అమ్మా!'' అన్నట్లు.

నిజానిజాలు తెలియనంతవరకూ కుమార్తెను వెనుకేసుకు వచ్చిన అంజన తల్లి ముఖం వివర్ణమైంది. 'అయితే ఏదో ఆయన కంటపడి వుంటుంది !' అసహ్యంతో కూతుర్ని విదిలించేసి భర్త సరసకు వెళ్ళి వచ్చింది. 'తల్లిప్రేమ ప్రక్కకు ఉండనీ. ఇలాంటి విషయాలలో అలుసు పనికిరాదు. ఆడపిల్ల చెడిపోతుంది !' అనుకొంది ఆమె.

'కృష్ణ ! ఆ దిక్కుమాలిన దరిద్రుడినా ఇది ప్రేమించడం ? పిల్లకు సంగీతంలో మంచి అభిరుచి ఉంది; కృష్ణ సంగీతంలో ఘటికుడు – ఇంటిముందరివాడు – చిన్నప్పటి నుండి కంటిఎదుట పెరిగిన బుద్ధిమంతుడు– పర్వాలేదని అమ్మాయికి సంగీతం చెప్పడానికి నియమించారు తాము !

'కాస్త కన్ను ముక్కు చక్కనుంటే ఉండనీ. వయసుకాడైతే కానీ. స్వరము సుస్వరం అయితే అవనీ. మ రేముందని ? బి. ఏ. తప్పినవాడు, చిల్లిగవ్వ ఆస్తి లేనివాడు, రేపో మాపో పడిపోతున్న పూరికొంప. ఆ విధవతల్లి తోడు తప్పితే మరో దిక్కులేదు. ఆ దౌర్భాగ్యపు ముఖాన్నా ఈ సిరిపుత్రి ప్రేమించడం ? ఛీ ఛీ ! ఇది ఇంత వెర్రిపిల్ల అయిందేమిటి ? వా డేదో వలపన్ని దీన్ని వశపర్చుకొనిఉంటాడు !'

తల్లీ తండ్రీ ఏకంకావడం చూచి అంజన మరింత దిగజారిపోవడానికి బదులు మొండి ధైర్యం తెచ్చుకొంది. 'రహస్యం బయట పడింది. ఈ సమయంలో నేను భయపడితే లాభంలేదు. వీళ్ళంతా ఒకజట్టు అయితే మాత్రం న న్నేం చేయగలరు ?'

తండ్రి క్రూరమైన చూపులతో అంజనను గుచ్చిచూస్తూ; అన్నాడు: "కృష్ణ నీకు సంగీతపాఠాలే నేర్పుతున్నా డనుకొన్నాను. ప్రేమపాఠాలుకూడా నేర్పు తున్నా డని యివ్వాళ తెలిసింది.'' ఆయన భార్యవంక తిరిగి, "తలనొప్పిగా ఉంటే కోర్టునుండి తిన్నగా పార్కుకు వెళ్ళాను. అక్కడ చెట్లమధ్య కృష్ణ ఒళ్ళో యిది ! తలనొప్పి ఎక్కడ పారిపోయిందో గాని, తల తిరిగిపోయింది. ఎవరి కళ్ళలోపడినా ఎంతఅప్రతిష్ఠ ? లాయర్ జగన్నాధరావు కూతురు ! ఆ బికారిగాడితో ! ఛీ, ఛీ ! వంశానికి ఎంత మచ్చ ! అప్పుడు నా చేతిలో యిలాంటి ఆయుధమే ఉండాల్సింది. అప్పుడే, అక్కడే ఇద్దర్నీ ఒకేదెబ్బకు సఫా చేసివుందును!'' అన్నాడు.

అంజన చటుక్కున తలెత్తి నిర్లక్ష్యంగా "మించిపోయింది ఏముంది ? ఆపని ఇప్పుడు కానివ్వండి నాన్నా !'' అంది.

"ఉహూం ? సరే." గంభీరంగామూలిగి, నౌకర్ని కేకేశాడుజగన్నాధరావు."గోవిందూ! బాబుగారు పిలుస్తున్నారు రమ్మని చెప్పి చప్పున కృష్ణను పిలుచుకురా !"

అంతవరకూ కిటికీ ప్రక్కనుండి తొంగి తొంగి చూస్తున్నాడు గోవిందు. కృష్ణను పిలిచి యజమాని చేయబోయే పనేమిటో – అది ఎంతమాత్రం అంగీకారం కాదు అతడికి. ఎందుకంటే, అంజనను ఎత్తి పెంచిన ఆఇంటి వృద్ధనౌకరు అతడు. 'మా అంజనమ్మ మనసిచ్చిన కృష్ణయ్యను చంపేస్తే ఆయమ్మ ఏమౌతుంది? ఆతల్లి బ్రతుకు చీకటికాదూ ?' అనుకొన్నాడు జాలిగా. 'అమ్మాయి సుఖశాంతులు ఆశించేవారైతే ఆ అబ్బాయికే యిచ్చిచేస్తే సరిపోతుందిగా ? ప్రేమించినవాడి సన్నిధిలో కోటి సిరులు అనుభవిస్తుంది ఆడపిల్ల. మరో సంపద, అంతస్తు, అర్హతలకోసం ఈ తల్లి దండ్రులు ప్రాకులాడుతున్నారు గాని ఆ ఆలోచనే ఆపిల్ల జీవితంలో నిప్పులు గుమ్మరిస్తుందని తెలియదు !'

"నిలబడ్డావు ? వెళ్ళు త్వరగా !"

"అలాగే, బాబూ !" వెళ్తూ వెళ్తూ అంజన కళ్ళలోకి చూశాడు గోవిందు. తన చిట్టితల్లి కళ్ళలో 'కృష్ణను పిలుచుకువచ్చి చంపిస్తావా, తాతా ?' అన్నభావం చదువుకొని 'పిచ్చమ్మా ! నిన్ను ఈ చేతులమీద ఎత్తిపెంచానే ! నీకంతద్రోహం చేయగలనా తల్లీ ?' అన్నట్లు చూచి వెళ్ళిపోయాడు గోవిందు.

మౌనంగా ఏమిటో ఆలోచిస్తూ గంభీరంగా పచార్లు చేయసాగాడు జగన్నాధరావు.

గోవిందు కొద్ది నిమిషాలతరువాత వచ్చి "బజారుకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రం బయటికి వెళ్ళాడటండీ. 'ఇంకా రాలేదు. వచ్చాక చెప్పి పంపిస్తాను' అని చెప్పిందండీ తల్లి," అని అన్నాడు. కళ్ళనిండా కృతజ్ఞత నింపి చూచిం దా వృద్ధుడికేసి అంజన.

నౌకరుమాట జగన్నాధరావు నమ్మినా నమ్మకపోయినా అంజనకు అది శుద్ధ అబద్ధమని తెలుసు. తను ఈ ఇంట్లోకి వచ్చినప్పుడే, అతడూ వాళ్ళింట్లోకి వెళ్లాడు!

"ఎక్కడికి పోతాడులే, ఈచేతిలో పిట్ట! నిర్దాక్షిణ్యంగా మెడ విరిచివేయనూ? దుర్మార్గుడు! పైసా టికాణాలేని బికారివెధవ నాబిడ్డను ప్రేమించడమా? ఎన్ని గుండెలు? నా రెండంతస్తుల భవంతిముందు వాడి పూరికొంప సూర్యునిముందు దివిటీలా వెల వెల పోతుంటుందే! ఈ ఇంటి కూతురు ఆఇంటి కోడలు అవుతుందని ఎలా ఆశించాడు? 'మీ అమ్మా నాన్నా ఒప్పుకోరు; మనం రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం అంజూ!' అని తీయని కబుర్లు చెబుతాడా? అదుష్టుని దురాశకు ప్రాయశ్చిత్తం — మృత్యువు!''

తండ్రి రాల్చిన పిడుగుకు అంజన ఎంత మాత్రం చలించలేదు. "అవును. చేసుకొంటాం. అందుకు మీ అంగీకారంకోసం వచ్చినప్పుడు యిలా చిందులు వేయండి. ఇప్పుడేం లాభంలేదు. కృష్ణ శరీరంలో ఉన్నది మీకూతురిఆత్మ. కృష్ణను హత్యచేస్తే నేను బ్రతికి ఉంటానని భ్రమపడకండి.'' అన్నది తిరస్కార గాంభీర్యాలు మేళవించి.

''అబ్బో! అంత ఘాటెక్కిపోయిందేం పేమా?" హేళన చేశాడు తండ్రి "వాడూ, నువ్వూ ఒకటి ఎలా అవుతారో చూస్తాను. నీకళ్ళముందేపెట్టి వాణ్ణి చిత్రవధ చేస్తాను;'' కసిగా, దృఢంగా అన్నాడు.

అంతకంటే దృఢంగా "మీ రేవిధంగానూ మమ్మల్ని వేరుచేయలేరు, మహా మీరు చేయగలిగితే ఈ శరీరాల్ని నాశనం చేస్తారు. ఇం కేం చేస్తారు? మా పవిత్ర ప్రేమహృదయాలను మీరేం చెయ్యగలరు?" అంది అంజన.

తల్లి ఛీత్కారంచేస్తూ "ఛీ! సిగ్గుమాలిన దానా! ప్రేమపాఠాలు వల్లిస్తున్నావా మా ముందు? ఏంచూచి ప్రేమిస్తున్నావే వాణ్ణి?" అంది.




"స్త్రీ పురుషుడినుండి ఏమాసించి ప్రేమించాలో ఆవిషయంలో నే నేం పొరపడలేదమ్మా. కృష్ణ ప్రేమాభిమానాలే నాకు ఎనలేని సంపద. నేను కోరినదానికంటే ఎక్కువే అతడినుండి లభిస్తుంది సంపద.''

"కథల్లోని కబుర్లు చాలించు. జీవితానికి ప్రేమలూ, ప్రణయాలేకాదు; మరెన్నో అవసరా లున్నాయి. ఇప్పుడు నీకంటికి ప్రేమకంటే విలువైనది లేకపోవచ్చు. దీన్నే నమ్మి నువ్వా దరిద్రుడిని పెళ్ళాడావంటే ఆతర్వాతిజీవితంలో కలిగే అవసరాలు, ఆకర్షణలు నువ్వు వంచింపబడ్డావని తెలుపుతాయి. మా జీవనజ్యోతి, జీవితాశ నువ్వొక్కదానివి! నిన్ను మా కంటిపాపలా పెంచుకొన్నది నీ గొంతు కోయాలనికాదు. మేము చెప్పేది వింటే చెడిపోతావని అనుకోవద్దు. మేం ఏం చేసినా నీ క్షేమంకోరే నువు కోరే ఆ సంపద, అంతస్తు, అర్హతలు చూసి మేము నిర్ణయించే వరునినుండి నువ్వు పొందలేవని ఎందుకు అనుకోవాలి?''

"ఈ గుణసంపదలు మరొక పురుషుడి నుండి లభించవని కాదమ్మా. కాని, మనసు ఒకసారి ఒకరికి అంకితమయ్యాక మరొక పురుషుణ్ణి చేపట్టి ప్రేమించే దెలాగ? అదెలా సాధ్యం?''

''మనసు అంటే రాయా ఎలాచెక్కితే అలా ఉండిపోవడానికి? కాలానుగుణంగా, పరిస్థితుల ఒత్తిడివల్ల మార్చబడే మైనపు ముద్ద. ఒక మనసుకు ఒకేభావం, ఒకే ఆలోచనా, ఒకే ఆశయం స్థిరంకావు. కాం ప్రభావంలో వాటిలో మార్పు తప్పకుండ సంభవం. మరొక పురుషుడితో నీ వివాహమైతే అతడిని ప్రేమించి, గతాన్ని విస్మరించి, భావిలో సుఖించగలవు! నామా విశ్వసించు!''

''నువ్వు ఎన్నైనా చెప్పు అమ్మా కృష్ణకు దూరమై అతడిని విస్మరించి బ్రతకడం అసాధ్యం. మీరు నా క్షేమం కో వారైతే నాకు స్వేచ్ఛ ప్రసాదించండి నా ఇష్టప్రకారం కృష్ణను పెళ్ళాడి తర్వాత వచ్చే కష్టసుఖాలకు పూర్తి బాధ్య నేనే వహిస్తాను. మీ నెత్తి నేం రాళ్ళు గుమ్మ వేయనుగా?''

ఇంత సేపూ మౌనంగా తల్లికూతు వాదప్రతివాదాలు వింటూన్న జగన్నాధరా కూతురు ఒకే పట్టుమీద నిలవడం చూ ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చాడ "నువ్వు కృష్ణను పెళ్ళాడ్డం కలలోనివా మా మాట వినక నువ్వు బ్రతికిపోలేవ తర్వాత నీ కృష్ణను బ్రతకనీయన చెప్పు! మా మాట వింటావా, కృష్ణ పెళ్ళాడతానంటావా? మా మాట విన కూతురు మా కనవసరం. కళంకచరిత మేం భరించలేం. ఇప్పుడే నీ రక్తం నే మీద చిమ్ముతుంది,'' అన్నాడు. తిరి తుపాకీ గురిపెడుతూ.

ఒక్క క్షణం తెగింపు కలిగింది అం నలో. కాని, వివేకం అడ్డగించింది. తన

చస్తుంది. కృష్ణా చస్తాడు. చచ్చి సాధించే దేముంది? వీళ్ళ మాటను వింటానన్నంత మాత్రాన వినీతిరాలన్న సత్యవ్రత మేం తనకులేదు. ఇప్పుడు ఊఁ అంటే సరి. తర్వాత ఎలాగో కృష్ణతో పారిపోయి వీళ్ళ పెద్దరికంనుండి తప్పించుకోవచ్చు.

"కనిపెంచిన మీకే నామీద ఇంత పగెందుకు నాన్నా! చదువు చెప్పించారు. స్వేచ్ఛ యిచ్చారు. నాకేది మంచో నిర్ణయించుకోగల పరిజ్ఞానం, వయసు కలిగాయి. ఈనాటికి నన్ను హద్దుల్లో పెట్టడానికీ, అరచేతిలో ఉంచుకోడానికీ ప్రయత్నిస్తున్నారు. ఇది నాకెంత బాధావహమో చూడండి!"

"స్వేచ్ఛయిచ్చింది నువ్విలా అడ్డమైన వాణ్ణి ప్రేమించి చెడిపోడానికి కాదు. లోకంలోని మంచిచెడ్డలు గుర్తించగల అనుభవం కలుగుతుందని. కృష్ణను పెళ్ళిచేసుకోడానికి నీకు బాగుందేమో కాని నువ్వు దుఃఖపడడానికి మరోదారితొక్కనవసరంలేదు. అందుకే మేం నీకు అడ్డుతగిలేది. మా హితోపదేశం కాస్త అర్థంచేసుకో."

రాత్రి అందరూ పడుకొన్నది చూసి నెమ్మదిగా అడుగులువేస్తూ మేడమీద అంజనగదిలోకి వచ్చాడు గోవిందు.

నిద్రపట్టక మంచంమీద దొర్లుతున్న అంజన లేచి, ఆత్రంగా, "గోవిందుతాతా, నిజం చెప్పు! నువ్వు వెళ్ళినప్పుడు కృష్ణ ఇంట్లోలేడూ? ఏంచెప్పావ్ అతడికి?" అంది.

తిరిగి గదివెలుపలికి ఒకసారి తొంగి చూసి ఎవరూ లేరని నిర్ధారించుకొని వచ్చి గుసగుసగా, "ఇంట్లోనే ఉన్నాడు తల్లీ! 'బాబుగారికి మీ సంగతి తెలిసిపోయింది. ఆయన కంటబడితే బ్రతకవు, ఎక్కడికైనా పారిపో' అని తొందరచేసి దొడ్డిగుమ్మంలోనుండి అతణ్ణి పంపేసి, బాబుగారితో లేడని వచ్చి చెప్పానమ్మా!" చెప్పాడు గోవిందు.

"మంచిపని చేశావు గోవిందుతాతా!"

"ఏమో తల్లీ! మీ రిద్దరూ ఒకటి కావడమేమోగాని కృష్ణయ్య ప్రాణాలకు ముప్పు తప్పేనట్లుంది. కృష్ణయ్య ఎప్పుడు ఇంటికి వస్తే అప్పుడు పట్టుకోమని రహస్యంగా మన రాజులను వాళ్ళింటికి కాపలాపెట్టారు బాబుగారు. నే నిప్పుడిప్పుడే వాళ్ళింటికి వెళ్ళవచ్చాగా? కృష్ణయ్య ఇంకా రాలేదు. ఆ తల్లేమో గోడుగోడున ఏడుస్తూంది, తన కొడుకును ఏ క్షణంలో మట్టుపెడతారోనని. ఆ తల్లి శోకం చూస్తే గుండె తరుక్కుపోతుంది తల్లీ!"

ఒక నిట్టూర్పు విడిచింది అంజన. "నువ్వో కాస్త కనిపెట్టిఉండు గోవిందుతాతా! కృష్ణ ఎప్పుడు వస్తే అప్పుడు నాకు తెలియచెయ్యి!"

"అతడితో వెళ్ళిపోతావా అమ్మా?" జాలిగా ప్రశ్నించాడు వృద్ధుడు.

"అంతకంటే గత్యంతర మేముంది?"

"వెళ్ళు తల్లీ! వెళ్ళు. ఎక్కడో ఒక చోట సుఖంగా ఉంటే చాలు."

## 2

అంజన కాలేజీకి వెళ్ళడానికి పుస్తకాలు పట్టుకొని మేడ దిగింది.

హాలులోనే ఆపివేశాడు తండ్రి. "కాలేజీకి వెళ్ళక్కర్లేదిక. వచ్చినచదువు చాలు."

"నాన్నా!" కంగారుతో, దుఃఖంతో అంది అంజన. "ఈ నెలరోజులకోసం ఈ రెండుసంవత్సరాల చదువంతా వృథా అయిపోవలసిందేనా, నాన్నా?"

"ఏం నువ్వీ బి. ఏ. పూర్తి చేయకపోతే నేను తెచ్చే పెళ్ళికొడుకు నిన్ను పెళ్ళిచేసుకోనంటే అప్పుడు చూద్దాంలే!" వెటకారంగా అన్నాడు జగన్నాధరావు.

తిరిగి నీరసంగా మెట్లెక్కుతూ కసిగా అనుకొంది అంజన: 'తెస్తావు, తెస్తావు పెళ్ళికొడుకును! కృష్ణతో గుట్టుచప్పుడు కాకుండా నే వెళ్ళిపోతే ఆ తెచ్చిన పెండ్లికొడుకును నువ్వే చేసుకోవాలి' అని.

కృష్ణ వచ్చాడన్న కబురుకోసం దినమొక యుగంలా ఎదురుచూస్తోంది అంజన. గోవిందు తెచ్చే సమాచారంవల్ల ఏరోజూ అతడు ఇంటికి రావడం లేదని తెలిసింది. కృష్ణతల్లికికూడా అతడు ఏమైందీ, ఎటు పోయిందీ తెలియదు! అసలు ఊళ్ళోనైనా ఉన్నాడా అని తెలుసుకోడానికి కృష్ణ తల్లి నడిగి, అత డుంటాడనిపించే ప్రదేశాలూ, స్నేహితుల ఇళ్లూ తిరిగివచ్చాడు గోవిందు. ఎక్కడా అతడిజాడ తెలియలేదు.

కృష్ణ అంతులేకపోవడం, తండ్రి అత్యంత పట్టుదలతో చేస్తున్న వరాన్వేషణా అంజనలో తీవ్రమైన అలజడి పుట్టించింది. 'నా ఆశలన్నీ కృష్ణమీద నిలుపుకొని కూర్చుంటే అసలా వ్యక్తే అంతులేకపోతే నే నేం చెయ్యాలి? భగవాన్! నాన్న విసురుతున్న వలను తప్పించుకొని ఎక్కడికి వెళ్ళను?'

ఒకనాటి సుప్రభాతాన గోవిందు పిడుగులాంటి వార్తలు తెచ్చాడు రెండు. కృష్ణ అర్ధరాత్రి ఎప్పుడో వచ్చి తల్లిని తీసుకొని ఇంటికి తాళంపెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఈ రోజు అచ్యుతనగర్‌నుండి ఎవరో పెళ్ళిచూపులకు వస్తున్నారు!

వింటూనే కుప్పకూలిపోయి వెక్కివెక్కి ఏడవసాగింది అంజన. 'కృష్ణా, నువ్వింత పిరికివాడ వనుకోలేదు. 'నువ్వు లేక నేను లేను. అంజూ!' అన్న నువ్వేనా మా నాన్న భయానికి నన్నొదిలేసి పారిపోయావు? సునాయాసంగా లభిస్తే నన్ను పెళ్ళి చేసుకొందువు గాని, నన్ను పొందడంకోసం కొంచెం శ్రమపడలేకపోయావు!' కృష్ణ ప్రవర్తనపై ఒక తిరస్కారభావం కలిగింది అంజనలో.

మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా పెళ్ళిచూపులవారు వచ్చారన్న కబురు తెచ్చాడు పైకి గోవిందు. కిటికీనుండి, రోడ్డుకు అవతల మూసివున్న కృష్ణ ఇంటి తలుపులూ, దానికి వేసిన తాళం చూస్తూ నిశ్శబ్దంగా కూర్చునిఉంది అంజన. తన ఆశలకు, ఆనందాలకు ఆ విధంగానే తలుపులు తాళం పడిపోయాయి. ఇక తను చేయగలిగేది ఏముంది?

సాయంత్రం తల్లి మేడమీదకి వచ్చి, "వాళ్ళు చూస్తామంటున్నారు. కాస్త జడా



ఆదీ వేసుకొని, పెట్టెలో చీర తీసుకొని కట్టుకో" అంటూ, కూతురుజడ విప్పబోయింది, దువ్వి జడవేద్దామని. అంజన విసురుగా విదిలించేసి "నేను రాను. ఆ అలంకార మేదో నువ్వే చేసుకొని నా బదులు నువ్వే పెళ్ళికూర్చో," అంది పెంకెగా.

భర్త ప్రవేశించడం చూచి అందుకొందామె: "చూశారా దీని తలతిరుగుడు ? ఆ పెళ్ళికొడుకు ముందు నేను వెళ్ళి కూర్చోవాలట. హవ్వ! బొత్తిగా భయం భక్తీ లేకుండా పోయాయి. నోటికి ఎంతొస్తే అంతేనా ?"

"అంజనా !" కటువుగా, గంభీరంగా సంబోధించాడు జగన్నాధరావు. "మంకుపట్టు పనికిరాదు. ఇక ఈ గారాబం కట్టిపెట్టు. ఒక్కపిల్లవన్న మురిపానికి పోయి నెత్తి కెక్కించుకొన్నాం. ఇక సాగదు ఆ ఆట. బుద్ధిగా చెప్పినట్టు నడుచుకో. లేదా – చిన్నప్పుడు కొట్టలేదుగాని ఇప్పుడు కొట్టాల్సివస్తుంది మరి !"

పైకి ఏమనలేకపోయినా లోలోన మండిపోయింది అంజన.

"ఈ పెళ్ళిచూపులు సక్రమంగా జరిగిపోవలసిందే. ఇది చెడిపోడానికి నీ చేష్టలు కారణమయ్యాయని తెలిస్తే నువ్విక బ్రతకవు !" హెచ్చరించి వెళ్ళబోయినవాడల్లా ఆగి, భార్యతో "దేవకన్యలా అలంకరించక్కర్లేదులే. పిల్లవాడు విదేశాలనుండి దిగినవాడైనా అతినిరాడంబరప్రియు డన్నట్లున్నాడు. కాస్త బొట్టు, జుట్టు చక్కదిద్ది తీసుకువచ్చేసెయ్యి," అని చెప్పాడు.

తనకు కాబోయే ఆ వరుడు, విదేశాల నుండి దిగిన ఆ నిరాడంబర సుందరుడు ఎలా ఉంటాడో, ఏమిటో తెలుసుకోవాలని ఎంతమాత్రం కుతూహలం లేదు అంజనలో. పైగా కృష్ణకూ, తనకూ మధ్య ప్రవేశిస్తున్న ఓభూతంలా ఆమె అతడిపై జుగుప్సా ద్వేషాలు పెంచుకొంటూంది.

అంజన తల్లివెనుక వచ్చి హాలులో తివాచీమీద కూర్చొంది. తను సూటిగా తలెత్తి చూడకపోయినా కంటికొనలనుండి గమనించింది, ముగ్గురువ్యక్తులు సోఫాలలో ఆశీనులై ఉండడం. తను కూర్చొన్న తివాచీమీదనే మరొక స్త్రీ కూర్చొనిఉంది. బహుశః పెళ్ళికొడుకు తల్లేమో !

"పేరేమిటమ్మా ?" చిరునవ్వుతో ప్రశ్నించిందామె అంజన నుద్దేశించి.

వంచిన తలెత్తకుండా, ఉలుకూ పలుకూ లేకుండా కూర్చొన్న కూతురి ప్రవర్తనకు

తల్లి మనసులో విసుక్కొంటూ. "ఆంజనేయస్వామిని కొలిచి పొందాము దీన్ని. అందుకని అంజనాదేవి అని పెట్టాం.'' అని చెప్పింది.

"బి. ఏ. చదువుతుం దన్నారుగదా? సంగీత మేమైనా చెప్పించారా?'' సోఫాల నుండి వచ్చిం దీసారి ప్రశ్న.

సంగీతం అన్న మాట విన్నేప్పటికి అంజన తల్లిదండ్రుల ముఖం నల్లబడింది.

"అఁ అఁ, మూడేళ్ళనుండీ చెప్పిస్తున్నామండీ, సంగీతం,'' అని సమాధాన మిచ్చాడు జగన్నాధరావు.

ఇక తను కూర్చోవలసిన అవసరం లేదనిపించి వెళ్ళిపోడానికి లేచి రెండడుగులు వేసింది అంజన. "చూడండీ!...మృదు మధురంగా, సౌమ్యమర్యాదలతో పలికిన ఆ కంఠం తన నుద్దేశిస్తున్నట్లే టక్కున ఆగిపోయింది.

"చూడండీ, ఒక్క మాట. వివాహానికి ముందు వధూవరుల పరస్పర అంగీకారం తెలుసుకోవడం వారి వైవాహిక జీవితం సుఖప్రదం కాగల అవకాశం ఎక్కువగా ఉంటుంది కదా? మా అమ్మా నాన్నా అభీష్టప్రకారం నేను ఈ పెళ్ళిచూపులకు వచ్చాను. అమ్మాయి నాకు నచ్చినట్లే; నేను ఆ అమ్మాయికి నచ్చాలికదా? ఆ అమ్మాయి కూడా ఈ దేశినదీ, చదువుకొన్నదీ. ఈ విషయములో ఆమె అభిప్రాయం, ఇష్టంకూడా తెలుపడం బాగుంటుందేమో?''

నెమ్మదిగా, గంభీరంగా మాట్లాడుతున్న ఆ వ్యక్తిపాదాలనుమాత్రం చూస్తూ నిలబడివున్న అంజన, అత డిచ్చిన ఈ అవకాశం నిరర్థకపరుచకుండా, ఒక్కసైగతో తన అయిష్టాన్ని తెలియపరిచి ఉండేది, తండ్రి వేయికళ్ళతో తనను చూస్తున్నాడని తెలియకుంటే!

జగన్నాధరావు బలవంతంగా నవ్వుతెచ్చి పెట్టుకొని, "అవును మరి. వధూవరులలో ఒక్కరికి ఇష్టం లేకపోయినా ఇక ందరు ఎంతగా సుముఖులైనా లాభం లేదు,'' అని. కూతురితో, "చెప్పమ్మా! ఇతడిని చేసుకోవడం నీకు ఇష్టమేనా?'' అని కేవలం లాంఛనార్థం ప్రశ్నించాడు.

ఎవరో రెండుచేతులా నొక్కి బలవంతముగా ఊపుతున్నట్లు తలాడించి, ఇక తను పరాయిపురుషుడికి మాట అయిపోయా నన్న భావం హృదయంలో ఆటంబాంబులా ప్రేలగా అక్కడ నిల్చోలేక పరిగెత్తింది అంజన.

అచ్యుతనగరం సంబంధంతో అంజన వివాహం నిశ్చయమైంది.

రాత్రి పడుకోబోయేముందు గోవిందు అంజన గదిలోకి వచ్చి, "ఆ పిరికివాడు పోతే పోయాడులే అమ్మా! అతడివెంట నువ్వు పట్టుకుపోయినా నిన్నేం సుఖపెట్టగలిగేవాడు ఆ పాటలమనిషి? మీ అమ్మా, అయ్యా ఏంచేసినా నీ మంచికే చేస్తారు. రెండురోజుల ఈ తనువు ఎవరికి అయితే ఏంలే అనుకొంటే ఇంక దుఃఖమే ఉండదు.

"ఇవాళ వచ్చిన బాబుగార్ని చూశావా అమ్మా? పీలగా గాలికి లేచిపోయేట్లుండే ఆ కృష్ణయ్య ఎక్కడ! బంగారంలా బలంగా ఉండే ఈయ నెక్కడ? నువ్వేమైనా చెప్పు అంజనమ్మా! నీచక్కదనానికి తగిన కుర్రాడు ఈయనే. గొప్ప ఇంటివాడు, గొప్ప చదువు; మనసుకూడా గొప్పదే. ఈయన తండ్రికూడా బాబుగారిలాగా ప్లీడరీ చేసి ప్రస్తుతం స్వగ్రామంలో భూములవీ చూసుకొంటున్నాడట. మీ అత్తమ్మ ఉందే- రూపంలోనూ, గుణంలోనూ పార్వతీదేవిలా ముచ్చటనిపించింది. కాస్త నీ మనసు కృష్ణయ్యమీదినుండి తీసేసుకొన్నావంటే నీ అంత అదృష్టవంతురాలు లేదు తల్లీ!'' అన్నాడు.

'అదెలా తీసేసుకోగలను? మూడునాళ్ళ ఈ తనువు ఎవరికైతే నేమన్న వైరాగ్యం ఈ వయసులో ఎలా తెచ్చుకోను? నాన్న శాసనం ప్రకారం పెళ్ళిచూపులకు రాతిబొమ్మలా వెళ్ళి తలూపి వచ్చినట్లు జీవితాంతం ఆ వ్యక్తితో ప్రాణంలేని బొమ్మలా ఎలా కలిసి జీవించేది? ఊహుఁ, నేనూ మనిషినే. ఒకరి నిర్దయాత్మకమైన చర్యకు నా ఆశలు సజీవంగా దహనం కావడం నేను సహించను. దీనికి ప్రతీకారం చేసితీరుతాను,' అనుకొంది అంజన.

పెళ్ళికొడుకును గురించి మరేదో ప్రశంసగా చెప్పబోయాడు గోవిందు.

తన కృష్ణను తేలికపరచి తన జీవితానందాన్ని కొల్లగొట్టబోయే ఆ వ్యక్తిని గొప్ప చేసి చెప్పడం సహించలేకపోయింది అంజన. "అపు, గోవిందుతాతా! నేను వినలేను.'' అని కసురుకొంది. "ఇక నువ్వెళ్ళి పడుకోరాదూ?''

'ఈ పిచ్చమ్మ మనసు ఆ కృష్ణయ్యమీద అలా నిలిచిపోయింది పాపం!' జాలిగా నిట్టూరుస్తూ నిష్క్రమించాడు గోవిందు.

## 3

"ఓం గౌరియేనమః'' తమలపాకుల్లో మూడు పసుపుముద్దలు గౌరిదేవిగా పెట్టి, అంజనకు దేవీమంత్రం ఉపదేశించాడు, పెళ్ళికార్యం జరిపించడానికి వచ్చిన పురోహితుడు. "ఓం గౌరియేనమః అని పఠిస్తూండమ్మా-సౌభాగ్యాన్నీ, సంతతినీ, అష్టభాగ్యాల్నీ ఇస్తుంది మాత!''

అంజన నిర్లిప్తంగా కూర్చొని ఉన్నది. 'సౌభాగ్యం...భర్త...సంతానం...హుఁ! అవేవీ తన కక్కర్లేదు: తన కృష్ణ తనకు కాకుండా పోవడము తన సర్వస్వం దోచి వేయబడినట్లే. బలవంతంగా జరుపబడుతున్న ఈ పెళ్ళి పెళ్ళికాదు. తన హృదయంమీద అధికారం పొందలేని ఆ పురుషుడు తన భర్తకాదు. ఆతడి శుభం కోరి తను ఏ దేవినీ ధ్యానించక్కర్లేదు.'

అంజనకు కొద్ది దూరంలో తెల్లవారానికి పసుపు పూసి అయిదుగురు ముత్తైదువులు అయిదు పోగులతో మాంగల్యాలను గుచ్చుతున్నారు!

అంజనలో ఈ వివాహబంధానికి లొంగాలన్న ఊహ ఉండిఉంటే తన మెడలో పడబోయే ఆ పసుపుతాడు తాచుపాములా కన్పట్టే

దేమోగాని ఈ వివాహబంధంపట్ల భయ గౌరవాలు పక్కకు నెట్టివేసిం దామె. తల్లి దండ్రులు తను కోరినవానిని కాదని మరొ కణ్ణి చేస్తున్నారని, నీతి ధర్మాలంటేనే ఒక విధమైన కసీ, ద్వేషం పెంపొందించుకొని వక్రమైన ఆలోచనలకు లొంగిపోయింది.


'అమ్మా నాన్నా, తాము తెచ్చిన ఈ మొగుణ్ణి ప్రేమించి సక్రమంగా కాపురం చేస్తా ననుకొన్నారేమో! వారి ఊహ తల క్రిందులు చేసి వారు జీవితాంతం పశ్చాత్తాప పడేలా చేస్తాను. పాలరాతిబొమ్మ పెళ్ళాంగా దొరికిందని ఈ వరుడు బారిష్టరు మహా శయుడు పొంగిపోతున్నాడేమో! నా అంద చందాలు అతనిని అనుభవించనీకుండా, మనసులేని మనిషిని కట్టుకొన్నాడని తెలి సేలా చేస్తాను. నాకు లేని సుఖం, శాంతీ అతడూ పొందకుండా చేస్తాను!' క్రూర మైన ప్రతిజ్ఞ పట్టింది మనసులో.

తిరిగి పురోహితుడు జగన్నాధరావు దంపతులతో ప్రవేశించాడు. అంజన నుదుట బాసికం కట్టి మెడలో ఉత్తరీయం వేసి పందిట్లోకి తీసుకుపోయారు.

పెళ్ళికొడుక్కి ఎదురుగా పీటలమీద అంజనకు చెరోప్రక్క కూర్చున్నారు జగన్నాధరావుదంపతులు. జీలకర్ర బెల్లం వధూవరుల కిచ్చారు — ఎవరు ముందుగా పెడితే వాళ్ళ చేతిలో మరొకరు ఉంటారని చెప్పి. అంజనలో ఆ ఉత్సాహం ఏం లేదు. పెళ్ళికొడుకు తల్లి గబుక్కున కొడుకుచేత వధువు తలమీద జీలకర్ర బెల్లం పెట్టించింది.

అంజన ఉదాసీనంగా జీలకర్ర బెల్లం అతడి నెత్తిమీద పెట్టబోయి కావాలనే క్రింద పడేసింది. పెళ్ళికొడుకు చెల్లెలు ఫక్కున నవ్వింది. "అన్నయ్యా, నీ మాటకు ఎదురు లేదిక: వదిన నీ చెప్పుచేతుల్లో ఉంటుంది సుమా!"

బాసికం చాటున వరుడు హసించాడేమో గాని అంజన పళ్లు కొరుక్కొంది. 'ఆఁ ఆఁ, చెప్పుచేతుల్లో ఉంటానో, మీ అన్నయ్యను




తాడు కట్టి చేదబావిలో దించుతానో నీ కేం తెలుసు?'

పెళ్ళికొడుకు అత్యంత ఉత్సాహంతో అంజనకు తలంబ్రాలు పోస్తుంటే ఆమె మాత్రం తన అనాసక్తినీ, అయిష్టాన్నీ స్పష్టంగా కనుబరుచసాగింది.

''నువ్వూ గబగబా తీసుకొని పోయవే!'' అంజనను కంగారుపెట్టి ఆమెచే తలంబ్రాలు పోయించసాగింది తల్లి. మంగళవాయిద్యాల ఘోష, పెళ్ళికొడుకు తలంబ్రాలు పోయ డంలో చూపుతున్న ఉత్సాహం, చుట్టూ ఉన్నవారి కుతూహలపూర్ణమైన చూపులు, అంజనలో వారింపబడని చైతన్యం తెచ్చి పెట్టాయి. తనూ ఉత్సాహంగా పోసింది కాని తర్వాత తన ప్రవర్తనకు పశ్చాత్తాప పడింది. 'తన కీపెళ్ళి ఇష్టమేనని అనుకోరూ, త నీవిధంగా ఉత్సాహం చూపెడితే! వాళ్ళలా అసత్యాన్ని నమ్మడం తన కెంత అన్యా యము! ఇకముందు తను నిగ్రహంతో ఉండాలి!'

పురోహితుడు నూతన దంపతులను పూజాగృహంలోని దైవసన్నిధికి కొనిపో తుంటే ద్వారందగ్గర అడ్డగించారు పడుచు పిల్లలు — 'పేరుచెప్పం' డంటూ.

వరుడు అట్టే అడిగించుకోకుండా మృ వుగా చెప్పాడు "అంజనాదేవి."

"చెప్పమ్మా, వదినా."

"............"

"లాభంలేదు; సిగ్గు తర్వాత. పే చెప్పు!"

ఇక వాళ్ళు వదలరని తెలుసు అంజనక విసుగ్గా చెప్పింది: "నీలకంఠం."

పడుచు వాళ్ళ పకపకలతో ప్రతిధ్వని చింది ఆ ప్రదేశమంతా.

"నీలకంఠమో శ్రీకంఠమో ఆ ము పేరు ఏకాంతంలో పిలుచుకో వదినా ఇక్కడమాత్రం మార్చడానికి వీల్లేదు!

నిజంగా తనకు వరునిపేరు సరి జ్ఞాపకంలేదు. ''నాకు జ్ఞాపకంలేదు. అం ముద్దుగా పిలుచుకోవలసిన అవసరం నా లేదు.'' పెడసరంగా అంది అంజన.

వధువు సిగ్గు దొంతర్లమధ్య తనపే వినిపించీ వినిపించనట్లు చెప్పితే ఎ ఉంటుందో చూడాలని ఆసక్తిగా ఆమెవం చూస్తున్న పెళ్ళికొడుకు ఆమె ఒక పి పేరో, కుక్కపేరో చెప్పినంత తేలికగ విరసంగా చెప్పినప్పుడే ముఖం చిన్నబుచ్ కున్నాడు. ఈసారి ఈ పెడసరపు సమాధా

నికి ఎండదెబ్బకు కమిలిపోయిన లేత పుష్పంలా నల్లబడిపోయిం దతడిముఖం.

ఎవరో గబగబా వెళ్ళి పెళ్ళిపత్రిక తెచ్చి యిచ్చారు అంజనకు. "ఇప్పుడు చెప్పు!"

"నీలకాంతవర్మ." ఎంత విసుగూ, అయిష్టం చూపవచ్చునో అంత వ్యక్తపరిచిం దామె.

రాత్రి ఊట్నీకి వధూవరులను పందిట్లో కూర్చోబెట్టారు. పెళ్ళికొడుకు పాదాలకు పసుపుపూసి, పారాణిపెట్టడం, పూలదండ వేయడం, పన్నీరు చల్లడం మొదలైన వేడుకలన్నీ అంజనతో చేయించడం బ్రహ్మప్రయత్నమైంది ముత్తైదువులకు. ససేమిరా, అతడి పాదాలు ముట్టుకోనంటుం దామె. తల్లి బెదిరించింది. "నువ్విలా మూర్ఖపుపట్టు పడితే మీ నాన్నగారిని పిలుస్తాను చూడు!"

"పిలు, పిలూ. గన్ తీసుకొని పరిగెత్తుకు రమ్మని మరీ చెప్పు!"

"ఛీ, ఛీ! పచ్చని పందిట్లో ఇవేం అశుభపుమాటలు?" అంజన అత్తగారు నొచ్చుకొంది. పసుపుముద్ద కోడలిచేతి కందిస్తూ, "చూడమ్మా, అంజనా! నువ్వెంత చదువుకొన్నా, ఈ లాంఛన మర్యాదలు నీకు ఎంత అర్థంలేనివిగా కనిపించినా వైవాహిక బంధాన్ని స్వీకరించినప్పుడు ఈ లాంఛన వేడుకలు పాటించవలసిందేనమ్మా. వేడుకలు, ముచ్చట్లు యిప్పుడుకాక మరెప్పుడు? కాస్త పెద్దవారి మాట విను, అంజనా!" అని ప్రేమపూర్వకంగానే మందలించింది కోడల్ని.

"పోనీలే అమ్మా! ఆమె కిష్టంలేనిపని మీరు పట్టుబట్టి చేయించడం దేనికి?" అంజన ప్రవర్తనకు లోలోన చాలా బాధ పడుతున్నాడు పెళ్ళికొడుకు నీలకాంత్.

తల్లి నవ్వింది. "ఇష్టం లేకపోవడమేమిటి, కాంత్? ఆపిల్ల సిగ్గువల్ల అలా అంటుంది కాని!" అది సిగ్గుకాదని ఆమెకు తెలిసినా బరువైన ఆ వాతావరణాన్ని తేలిక పరుద్దామని సరససంభాషణలోకి దిగింది.

ఆ సౌమ్యమూర్తిని నొప్పించే సాహసం అంజనలో లేకపోయింది. ఆమె చెప్పిందల్లా కిక్కురుమనకుండా చేస్తూ పోయింది.

"ఇక నీవంతు, అబ్బాయ్!"

"నా దేమిటి?"

"పెళ్ళాంతో అన్నీ నువ్వు చేయించుకోవడమేనా? నువ్వూ కాస్త పెళ్ళానికి అలంకారం..." కిలకిలమంది చెల్లెలు.

అన్నీ చెప్పి, అతడితో చేయించారు. సిగ్గుపడుతూ సిగ్గుపడుతూనే చేశాడు నీలకాంత్, అప్పుడప్పుడూ తన వధువు ముఖపద్మాన్ని వీక్షిస్తూ. వధువుకు పసుపుకుంకం యిచ్చి, మెడకూ చేతులకూ గంధం పూసి, అత్తరు పూసి, పన్నీరు చల్లి, పూలచెండు యిచ్చి, మాల వేశాడు మెళ్ళో. అత డివన్నీ ఎంతో శ్రద్ధానురాగాలతో చేస్తూంటే అంజన నిర్లిప్తంగా మౌనిలా కూర్చుంది. ఆమె ప్రవర్తన చూసి లోలోన ఎంతో భయపడిపోసాగింది తల్లి. ఈ బలవంతపు పెళ్ళి సంగతి ఎక్కడ బయటపడిపోతుందోనని!

మరింత రమ్యంగా, ఉత్సాహంగా సాగవలసివుంది పూబంతులాట. వరుని చేతిలోని పూలచెండును అందుకోవాలి వధువు. అతడు పైపైకి పట్టుకొంటున్నాడుగాని అందుకోడానికి అంజనమాత్రం ప్రయత్నించడం లేదు.

"మా అన్నయ్య అంత వెర్రివాడేం కాదమ్మా వదినా! తమరు కష్టపడకుండా కూర్చొంటే 'పాపం' అని ఏం అందివ్వడు. చటుక్కున కొంచెం ప్రయత్నించూ!"

ఆవిడను గుర్రుమని చూసి ఉక్రోషంతో గబుక్కున చెయ్యెత్తింది. అతడు అందించినట్లే అందించి చటుక్కున పైకెగుర వేశాడు.

అంజన ముఖం ఎర్రబడింది. తనేం ప్రయత్నించనట్లే ఉండి మెరపులా అంది పుచ్చుకుని గర్వంగా చూసింది.

"అంత తొందరగా యిచ్చేశావేం అన్నయ్యా? మరికాస్త కష్టపడితే మీ ఆవిడ కందిపోతుందనా? ఎంత అపురూపమబ్బా!" ఉడికించింది చెల్లెలు.

ఈసారి అంజన వంతు – నిరుత్సాహంగా నడిచింది. అతడిని ఆడించాలని, ఉడికించాలని ఆమెకు లేదు; పూలచెండును నిర్లక్ష్యంగా అతడిమీదికి విసిరేసింది.

"అమ్మో! పతిభక్తి చూడండి! అయ్యగారు కొంచెం కష్టపడడంకూడా ఓర్వలేదీ సతి!"

వధూవరులలోని అపరిచితభావం పోగొట్టి ఇరుహృదయాలలో అనురాగం పెంచి సన్నిహితపరిచే ఎవరి హాసపరిహాసాలూ, ఏ లాంఛన వేడుకలూ అంజనను కదిలించలేకపోయాయి! ఆమెలోని పూర్వపు భావాలు మార్చి అతడిమీద ఎటువంటి ఆసక్తినీ, అభిప్రాయాన్నీ కలిగించలేకపోయాయి.

తర్వాత తమలపాకు చిలకలతోటి లాంఛనప్రాయంగా ఆట సాగింది.. అయితే నీలకాంత్‌లో నీరసం వచ్చేసింది, తన వధువు వైఖరి చూసి. ఆమెకులేనిఉత్సాహం త నెంతవరకు తెచ్చుకోగలడు?

అంజన ప్రవర్తన అందరిలోని ఉత్సాహానందాల్నీ తుడిచిపెట్టి నీరస నిరుత్సాహాలతో ముగింపజేసింది.

## 4

"అంజనా! ఒక్కక్షణం వివేకంతో ఆలోచించు. నీకు జరిగిన ఈ అన్యాయంలో నే నెంతవరకు బాధ్యుణ్ణి? ఏ అపరాధానికి నన్ను వంచితుణ్ణి చేశావ్?

"అమ్మా నాన్నా ఇష్టపడిన కన్యను వివాహం చేసుకొన్నాను. ఆమెనే మన స్ఫూర్తిగా ప్రేమించాను. ఇ దేమైనా నా నేరమా?"

ఆ కంఠంలోని వ్యథాదైన్యతలకు ఒక్కక్షణం చలించిన అంజన అప్రయత్నంగా అతడివంక చూపులు త్రిప్పింది. విషాదమేఘావృతమైన అతడి వదనం మబ్బులు కమ్మిన చందమామలా కాంతివిహీనమైపోయింది. 'ఓహ్! ఏ మా బలయవ్వన సౌందర్యసంపద? ఇతడినేనా నేను తృణ

ప్రాయంగా తృణీకరించింది ?' పశ్చాత్తాప భావ మొకటి ఆమె హృదయంలో లీలగా మెదిలినా కృష్ణమీది గాఢానురక్తి వెంటనే రూపుమాపింది దాన్ని. కృష్ణతోడి తన ప్రణయానుబంధం తెల్పితే అతడు తనను అసహ్యించుకొంటాడనీ, బలవంతంగా తనను అతడికి కట్టబెట్టినందుకు తన తల్లి తండ్రులపై అతడు ఆగ్రహిస్తాడనీ, అతడి హృదయం ద్వేషాసూయలకు లోనవుతుం దనీ ఏమేమో ఊహించింది తను. కాని, అలాంటి ఛాయ లేవీ అతడి ముఖంలో లేవు. తనకు ప్రాప్తించిన దుఃఖానికి ఒకరిని నిరసించే స్వభావం కానట్లుం దతడిది; తనలో తను బాధపడడం తప్పితే.

అతడు చెప్పినట్లు ఒక్క క్షణం వివేకంతో ఆలోచించింది అంజన. 'అవును. ఏ నేరానికి అతడిని బాధిస్తున్నట్లు ? ఎవరి మీది కసి ఎవరిమీద తీర్చుకొంటున్నాను ? కాని...కాని...కృష్ణను విస్మరించి యితడిని ప్రేమించే దెలాగ ? మా పవిత్ర ప్రేమ కళంకపరచి ఇతడికి లొంగిపోనా ? ఉహుఁ, అది అసంభవం. మరి ? ఇతడినుండి విముక్తి పొందడమే నాకు కావలసింది! ఆ తర్వాత కృష్ణా, నేనూ...' స్వార్థం ఆమె వివేకాన్ని అంత మొందించింది.

"ఒక ప్రార్థన, అంజనా! కొద్దికాలం వ్యవధి యిస్తాను. నీ మనసు యిటు మలిపి నా జీవితభాగస్వామిని కాలేవా ?''

"అసంభవం!'' నిష్కర్షగా చెప్పింది.

ఇంకా చావని ఆశ కొట్టుకులాడుతుండగా పేలవంగా నవ్వుతూ, "పోనీ, నాకు కొంచెం అవకాశ మిస్తే నిన్ను మార్చగలనేమో!'' అన్నాడు నీలకాంత్.

ఆవేశరోషాలతో అంది: "క్షమించండి. నా ప్రేమ అంత దుర్బలమైందీ, చంచలమైందీ కాదు. ఏవిధంగానూ నన్ను మీ వశవర్తిని చేసుకోలేరు.''

"ఏమో! మనిషి మనసు, అంజనా! మారదని ఖచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. కొన్ని ప్రయత్నాలవల్ల మారవచ్చు. ఒకసారి నా అదృష్టాన్ని పరీక్షించుకొనే అవకాశ మివ్వు!''



అత డంత మెత్తమెత్తగా మాట్లాడుతూంటే అంజన మరొకసారి అతడి మృదు హృదయాన్ని నిర్దయగా గాయపరచింది.

"అది కేవలం వెర్రిభ్రమ మాత్రమే. మీ తలక్రిందులు తపస్సు చేసినా కృష్ణకు అర చిన ఈ హృదయంలో మీకు అణుమా స్థానం దొరకదు.''

అక్కడికీ సహనంతో అన్నాడు

కాంత్: "నువ్వున్న స్థితిలో నీకలా అనిపించవచ్చుగాని, మనిషి ప్రయత్నానికి అడ్డమైనది ఈ ప్రపంచంలో లేదు అంజనా! సింహంలోని క్రూరత్వాన్నీ, ఏనుగలోని బలాన్నీ, పాములోని విషాన్నీ, ఒక్కో పరిస్థితిలో మనిషిలోని దుష్టత్వాన్నీ అదుపులోకి తెచ్చుకొని మచ్చిక చేసుకోగలడు మానవుడు. మనిషిని మనిషి మార్చడం విడ్డూరం, అసంభవం ఎలా అవుతుంది."

ఎగతాళిగా నవ్వింది అంజన. "మీ ఆశ మీకలా అనిపింపజేస్తుంది కాని, మీకంత సులభంగా మచ్చిక కావడానికి నే నేం జంతువును కాదే? మనసున్న మనిషిని!"

హఠాత్తుగా నీలకాంత్‌లో మార్పు వచ్చింది. శాంతగాంభీర్యాలతో శోభించిన అతడి ముఖభంగిమలో కటువుదనం గోచరించసాగింది.

"ఇది నా జీవితంలో శోభనంనాటి తొలి రాత్రి. ఈ రాత్రి మధురస్మృతిగా నిలుపుకొనే హక్కు నాకున్నది. నా ఎదుటున్నది— అగ్నిసాక్షిగా పెళ్ళాడిన నా భార్య. ఆమెను నాదాన్ని చేసుకునేహక్కు నాకున్నది. ఇందుకు ఏ ధర్మశాస్త్రానికీ, నీతిశాస్త్రానికీ సంజాయిషీ ఇచ్చుకోవలసిన అవసరంలేదు నాకు. ఏమంటావ్?"

బెదిరిపోయింది అంజన. 'ఈ రాత్రి ఇతడి తృష్ణకు నేను ఆహుతి అవుతానా?'

పైకిమాత్రం బింకంగా, దృఢంగా అంది: "మలిరాత్రి మీభార్యకు తలకొరివి పెట్టిన మరొకస్మృతికూడా దాని తర్వాత పదిలపరుచుకోవచ్చు."

చాలా సేపు మెదలకుండా కూర్చున్నాడు నీలకాంత్. "అందుకేనా, అంజనా, నిన్ను నేను వివాహం చేసుకొంది?" రుద్ధకంఠంతో అన్నాడు. అశ్రువులు ఏ ప్రయత్నానికీ నిగ్రహింపబడడం లేదు. ఎవరూ ఆశించనిది నే నేం ఆశించలేదు. సామాన్యమైన కోరిక. దానికే నేను వంచితుణ్ణి కావాలా?"

నిర్దయ ప్రతిఫలించే శిలా ప్రతిమవలె కూర్చుంది అంజన.

మరికొంతసేపు మిన్నకుండి, ఒక నిశ్చయానికి వచ్చినవాడివలె, "నాకు కర్తవ్యం నిర్దేశించు అంజనా. నీ మాటకు కట్టుబడతాను నేను," అన్నాడు నీలకాంత్.

హఠాత్తుగా అతడిలో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపడింది అంజన. అతడు హృదయపూర్వకంగానే ఆమాటలు అంటున్నాడని నమ్మాక, "మీకు నన్నేలుపకోడం ఇష్టంలేదని చెప్పి విడాకు లిచ్చేయండి. మీవల్ల ఇంతకంటే ఎక్కువ కోరను. మీవైపునుండి ఈ వివాహ విచ్ఛేదం జరిగిందంటే మా నాన్నకు నన్ను బాధించే అవకాశం ఉండదు కదా?" అంది ఆశ ప్రతిఫలించే నేత్రాలతో చూస్తూ.

"సరే, ఏకారణం చెప్పి డైవోర్సు చేయమంటావు?"

"మీరే ఆలోచించండి. చేయాలనుకుంటే నెపమే దొక్కకపోతుందా?"

"మీ అమ్మాయి శీలం గురించి నాకు అనుమానంగా ఉందని చెప్పమంటావా?" ఎంతోకష్టంగా అతడీమాటలు అన్నా ఆమెలోకలిగే మార్పుకోసం పరీక్షగా చూడసాగాడు.

ఒక్కసారిగా లజ్జాక్రోధాలతో అంజన ముఖం ఎర్రబడింది. ఆవేశంగా. "ఛీ ఛీ, నా ప్రేమ ఎన్నడూ నైతికపరిధిని అతిక్రమించలేదు. కృష్ణను నేను ఎన్నోసార్లు కలుసుకొన్నది నిజం. కాని, నా స్త్రీత్వం విషయంలో నే నెన్నడూ అజాగ్రత్త పడలేదు. శీలం విషయంలో నేను పవిత్రను. నన్ను శంకించవద్దు," అన్నది.

నీలకాంత్ నిర్లిప్తంగా నవ్వాడు. "నెపమెంచడానికి నిజా నిజాలతో పనేమిటి అంజనా!"

బాధా సంకోచాలతో, "అహఁ, హఁ, నేను భరించలేను అంతటి నీచమైన నిందారోపణను," అందామె.

"ఊఁ, ఆతర్వాత నీ సంగతి?"

"మీకు సంబంధం తెగాక, నాగతి ఎలా ఉంటుందో, నా అదృష్టం ఎలా పరిణమిస్తుందో చెప్పలేనుకూడా," అంది అంజన. కృష్ణను కలుసుకోవాలన్న తన కోరికను అతడు వింటే ఇంతవరకూ అతడు చూపిన సహృదయత కోల్పోయి ఈర్ష్యాద్వేషాలకు ఎక్కడ లోనవుతాడోనని సందేహించిందామె.

"ఎక్కడ ఉంటావు?"

"భర్త వదిలేసింది ఎక్కడ ఉంటుంది? పుట్టింట్లో." ఇంత తొందరగా అతడినుండి విముక్తి పొందిన తన అదృష్టానికి కలుగుతున్న ఆనందం ఎంత అణచిపెడదామన్నా పైకి 'వ్యక్తమౌతూనేఉంది.

"నువ్వు అపార్థం చేసుకోనంటే ఒక మాట చెబుతాను;" ప్రశాంత గాంభీర్యాలతో అన్నాడు. "చూడు, అంజనా! పాలధారతో మీనాన్న నిన్ను నాకు దత్తం చేశాడు. ఆక్షణంలో నీ మంచిచెడ్డలు, కష్టసుఖాలు నావి అయ్యాయి. వేదోక్తంగా నీ మెడలో వేసిన మూడుముడుల బంధంతోపాటు తెంచుకోరాని పవిత్ర మధురబంధం ఒకటి పడిపోయింది మనసులో. బాహ్యంగా నేను నీకు విడాకు లిచ్చేసినా ఈబంధం తెగదు; తెంచుకోలేను. నీతో ఎటువంటి సంబంధం దూరమవదు ... ...

"నానుండి విడిపోయి నువ్వు కోరేదేమిటో నేను గ్రహించలేననుకోకు. కేవలం నానుండి దూరమై పుట్టిల్లు చేరిపోవడమే నీకు శాంతి సంతోషాలు కలుగచేస్తుం దనుకోను. నువ్వలా పుట్టింట్లో ఉండిపోవడం నలుగురూ చూడడానికే బాగుండదు; నాకూ బాగుండదు. తిరిగి కృష్ణను కలుసుకోవడమే నీ వాంఛైతే నిస్సందేహంగా చెప్పు. మీ ఇద్దరినీ ఒకటి చేయడానికి నా శాయశక్తులా, హృదయపూర్వకంగా ప్రయత్నిస్తాను."

అతడంతకంతకు మెట్టు మెట్టు ఎక్కి సహృదయతా శిఖరంపై మహోన్నత వ్యక్తిగా నిలబడుతూంటే అంజన ఆశ్చర్యపోతున్నది. అతడి మంచితనాన్ని తన స్వార్థానికి ఉపయోగించుకోవడం సిగ్గనిపిస్తుంది. కాని, కృష్ణమీది ప్రలోభం ఆమె

మనసును అంత తొందరగా నీలకాంత్ వైపు మరలనీయడం లేదు.

"మీరే స్వార్థభావంతో నాయందింత సానుభూతి సహృదయతను చూపగలుగు తున్నారు ?"


దెబ్బతిన్న పావురంలా అతడిమనసు రెక్కలు అల్లార్చడం స్పష్టంగా అతడి నేత్రాలలో ప్రతిఫలించింది. "న న్నింత తప్పుగా అర్థం చేసుకొంటావని అనుకో లేదు, అంజనా ! నీమీద నాకిప్పు డెటువంటి ప్రలోభమూలేదు. తనను ప్రేమించని స్త్రీని ఆకర్షించడానికి పురుషుడు చేసే ఏ ప్రయత్న మైనా వెర్రివేషమే అవుతుంది. నాలో లేని మంచిని ప్రదర్శించి నిన్ను మభ్యపెడుతున్నా నని, నీమనసును పొందడానికి వలవేస్తున్నా నని అనుకోవద్దు. నే నలా నాటకాలు, బూట కాలువేసే మనిషినికాదు. మనసుకు తోచింది చేస్తూపోతాను.

"కాని, ఒక్కటి గుర్తుంచుకో. నువ్వు నన్ను ప్రేమించినా, లేకపోయినా ని న్నను భవించేందుకు ధర్మబద్ధమైన హక్కు నాకు ఉన్నది. కాని, బలాత్కారంగా ఒకవస్తువు ననుభవించేందుకు – ధర్మం, న్యాయం తన వైపు ఉండనీ – హృదయమున్న మానవుడు చేయలేని పని అది. 'నాది' అయినంత మాత్రాన తావిలేని విరిని అనుభవించేందుకు మనసొప్పదు. నువ్వు ఎవరిని ప్రేమిస్తు న్నావో, ఎవరు నిన్ను ప్రేమిస్తున్నారో వారికే నువ్వు కావచ్చు. నేను ఈర్ష్యపడను, అసూయపడను. నీమీద నా కేమైనా ప్రేమ ఉన్నదీఅంటే అందుకు ఋజువుగా నీ సుఖమే కోరుతాను." నీలకాంత్ కంఠం ఇంచుక వణికింది.

రెప్పవాల్చకుండా అతడినే చూస్తున్నది అంజన.

"ఐతే, కృష్ణ ఎక్కడున్నాడో నీ కేమీ తెలియదా అంజనా ?"

"ఉహూం, తెలియదు. తెలిస్తే పునర్వి వాహం చేసుకొనే దౌర్భాగ్యం నాకు పట్టేది కాదు."




కొద్దిసేపు ఆలోచించి అన్నాడు నీలకాంత్: "సరే ఆ విషయంలో నువ్వేం బెంగపడకు. నేను ఎలాగైనా అతడి ఆచూకీ తీస్తాను. కాని, నీ కతడిపై విశ్వాస ముందా ?"

"విశ్వాసమంటే ?"

"అతడిప్రేమ నిష్కళంక మైందీ, ప్రగాఢమైందేనా ?"

"ఆఁ, అందులో ఎంతమాత్రం సందే హములేదు. కృష్ణ నన్ను హృదయపూర్వ కంగా ప్రేమిస్తున్నాడు."

"మరీ అంత పిచ్చిగా కాక యదార్థ దృష్టితో చూడు అంజనా. శోభనంనాటి రాత్రి తన భర్తతో గడిపిన నిన్ను కన్య గానే నమ్మగల డంటావా అతడు ?"

కొరడాచురకవలె తగిలిం దా మాట. 'నిజమే ! ఈ యదార్థవిషయం తనదృష్టి లోకే రాలేదు !'

"వివాహిత అయిన నిన్ను స్వీకరించ గలసహృదయత అతనిలో ఉందంటావా?"

"ఏమో, చెప్పలేను;" బేలగా చూసిం దతడికేసి అంజన. మళ్ళీ అంది ! "కృష్ణ నన్ను అన్యాయం చేయడనే నా నమ్మకం."

"సరే, ఆ విషయంలోనూ నువ్వు నిశ్చింతగా ఉండు. నిన్నూ, కృష్ణనూ ఒకటి చేస్తానన్నాను కదూ ! అతడిని ఒప్పించే భారం నాది. నా సర్వస్వం ధార బోసి అయినా మీ వివాహం జరిపిస్తాను."

కృతజ్ఞతగా చూసిం దతడికేసి అంజన.

"మరి నా కోరిక ఒకటి మన్నించా నువ్వు."

"చెప్పండి."

"నేను కృష్ణను కలుసుకొని మాట్లా వరకు నువ్వు అమ్మదగ్గ రుండడానికి ఒప కోవాలి. ఈలోగా మనమధ్య విషయా ఎవరికీ తెలియనివ్వనని మాటివ్వాలి నువ ఏ సందర్భంలోనూ కూడా."

"అలాగే."

కొద్దినిమిషాలు నిశ్శబ్దంగా గడిచాక నీ కాంత్ తనలో తను అనుకొంటున్నట్లు "వైవాహిక జీవితంపై ఎన్నెన్ని కల కన్నాను ? చూసేవాళ్ళకు చూడముచ్చటగ చిలకా గోరింకల్లా ఆలూమగలం కాపు చేసుకోవాలనీ ఎన్ని సుందరసౌధాలు నిర్మి చాను ? భార్యను ఎంతగానో ప్రేమించాల దేవతలా ఆరాధించాలనీ...ఓహో...!

"ఉహూం, అవన్నీ ఇప్పు డెందుకు ఇవన్నీ నీ ముందు వాగి నీ మనసు కలచ భావ్యం కాదు నాకు. సంతోషంగా కృష్ణ పెళ్ళాడు అంజనా! నువ్వతడితో స ముగా కాపురం చేసుకోవాలనీ, నీ జీవి పిల్లా పాపల్తో నిండుగా కలకల లాడా హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను అన్నాడు గాద్గదికంగా. కాస్సేపటికి వ సును సంబాళించుకొని లేస్తూ, "ను పడుకో, నేను అవతల పడుకొంటాను అని, పందిరిమంచంలోనుండి తలగడ తీ

కొని అనేవతల బయల్లోకి వెళ్ళి గచ్చుల మీద బోర్లా పడుకొన్నాడు.

## 5

ఆషాఢమాసంలో అత్తాకోడళ్ళు ఒక గడప దాటకూడదని అంజనను పుట్టింటికి తీసుకువచ్చారు. మేడమీద తన గదిలో ఒంటరిగా కూర్చొని కృష్ణ ఇంటికేసి చూస్తూనే గడిపేది రోజంతా. ఊడ్పూ, చల్లుడూ లేక పాడుబడిన ముంగిలీ, తెరిచీ మూసేవారు లేక బూజుపట్టి పాడు కొట్టుకు లాడుతూన్న ఆ ఇంటి మూసినతలుపులూ-కృష్ణకోసం అంజన సాగిస్తూన్న నిరీక్షణలో రోజురోజుకూ నిరాశా నిస్పృహలు నింపుతున్నాయి.

కృష్ణకు తండ్రిలేడు. ఉన్న ఒక్క దిక్కూ తల్లిమాత్రమే. బి. ఏ. తప్పిన నిరుద్యోగి. సర్వతీ కటాక్షంవల్ల సంగీతములో కాస్త ప్రతిభ సంపాదించగలిగాడు. అదే అతని జీవనాధారమైంది. అటువంటి నిరుపేదను ప్రేమించి హృదయపూర్వకముగా అతడికి భార్య కాదలచిన తనను, తన తండ్రిభయానికి తృణప్రాయంగా త్యజించి పారిపోయిన అతడి పిరికితనాన్ని అసహ్యించుకోసాగింది అంజన. ఇన్నాళ్ళూ ఉజ్వలంగా ప్రకాశించిన ఆమె ప్రేమమయ హృదయంలో విరక్తితో కూడిన నీలినీడ లాక్రమించడంతో పాటు — తనను పొంద గల హక్కు కలిగిఉండీ, తనసుఖం కోరి, తనకృష్ణతో తనను ఒకటి చేయడంకోసం ఆత్మత్యాగంచేస్తున్న నీలకాంత్‌పై శ్రద్ధాభక్తులకు, ఆమెకు తెలియకుండానే ఆమె హృదయములో, అంకురార్పణ జరిగింది.

వివాహాత్పూర్వం తన ఊహ లెలా ఉండేవి? తనభర్త తనను బలాత్కారంగా అనుభవించడానికైనా సిద్ధపడతాడని, అతని ప్రతిఘటించడానికి ఎంతటి కాఠిన్యతకైనా పూని, తనకృష్ణను కల్సుకోడానికి అటువంటి తప్పుత్రోవలు త్రొక్కడానికైనా సిద్ధపడాలనుకొంది; కాని...

ఆ నవనీతహృదయుని ఎదుర్కొనడానికి తనకు కొమ్ము లెందుకు? ఆ సహృదయశీలునికి తను చేయగలిగే ప్రతీకారము ఏమున్నది? అతడి మంచిమనసే తనకు మంత్రం వేసినట్లుంది. ఎంతటి ఉదాత్త హృదయుడు కాకపోతే తనలోని దుష్టచింతననూ, అహంభావుకతనూ తొలగించి అతడిముందు తన మనసు ఇంతగా వినమ్రమయ్యేలా చేయగలడు?

'ఇంతటి అమూల్య రత్నాన్నైనా తను ఒక గాజుపెంకు వ్యామోహంలో పడి మూర్ఖంగా పారవేసుకొన్నది?'

శ్రావణపట్టీ పెట్టి తిరిగి అంజనను అత్తవారింటికి తీసుకువచ్చారు.

నీలకాంత్ పట్నంలో ప్రాక్టీసు చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఉన్న ఒక్క చెల్లెలూ అత్తవారింట్లో ఉంది. పల్లెలో ఉంటున్నది అతడి తల్లిదండ్రులు మాత్రమే.

అంజన వెళ్ళిన రెండురోజుల తర్వాత మామగారు పెళ్ళికొడుకును తీసుకువచ్చారు.

వస్తూనే మేడమీది తన గదిలోకి వెళ్ళిపోయాడు నీలకాంత్. సాయంత్రం వరకు అంజనకు అతడి దర్శనం కాలేదు. సాయంత్రం కొడుక్కోసం అత్తగారు ఏదో మిఠాయి తయారు చేస్తుంటే, ఆవిడ చేతికింద ఆదుకొంటూ వంటగదిలోనే ఉండిపోయింది అంజన.

అత్తగారు అంజనవంక వాత్సల్యంగా చూస్తూ, "ఇక నువ్వెళ్ళమ్మా; కాస్త పనీ నేను చేసుకోగలనులే. ముఖమూ అదీ కడుక్కొని వెళ్ళు. అబ్బాయి పైన ఒక్కడూ..." అంది.

"ఉహుఁ." అంజన తల తిప్పేసుకుంది. తన శ్రేయోభిలాషిని చూడాలని లోలోన కాంక్షగానే ఉంది! ఏదో లజ్జ, జంకు ఆమె యిష్టాన్ని వ్యక్తపరచనీయడం లేదు.

అత్తగారు మహాలక్ష్మి నవ్వింది ముసిముసిగా. "బాగుంది అంజనా! ఇక్కడ నాకు నువ్వు పని చేస్తూ కూర్చున్నావంటే, అమ్మ తనకోసం చేసుకుందా కోడల్ని, నాకోసమా అనుకోడూ అబ్బాయి? మగడి దగ్గరికి వెళ్ళడానికి ఇంత సిగ్గయితే ఎట్లానే పిల్లా?" అని గడ్డం పుణికి, "వెళ్ళమ్మా! వాడికి అమ్మమీద కోపం రాగలదు," అంది.

భుజాలనిండా కొంగు కప్పుకొని గడప దగ్గరికి వచ్చి ఆగిపోయిన అంజనను చూసి, కుర్చీలో పేపరు చదువుకొంటూన్న నీలకాంత్ స్నిగ్ధహాసంతో స్నేహపూర్వకంగా ఆహ్వానించాడు. "రా, రా అంజనా! బాగున్నావా?"

"ఊఁ" అతడికి కొద్దిదూరంలో కొచ్చి ఆగిపోయింది.


నీలకాంత్ గుమ్మంవంక ఒకసారి చూసి తగ్గుస్వరంతో, "అంజనా, నా రాకను అపార్థం చేసుకోవుకదా? నా కసలు వచ్చే ఉద్దేశ్యం లేదు. కోడల్ని తీసుకువచ్చాం రమ్మంటూ నాన్న వచ్చి పిలిస్తే రాలేనని ఎన్ని సాకులు చెప్పినా వీల్లేదంటూ తీసుకు వచ్చాడు — రెండో శుక్రవారం కోడలికి లక్ష్మీవ్రతం పట్టిస్తున్నాం, నువ్వుకూడా ఉండాలంటూ; దేవీకార్యం — అందులో నీకు అభ్యంతర ముండదనే అనుకొంటున్నాను.

"కృష్ణజాడ తేలేవరకు మనం మామూలుగా నడుచుకోవాలనుకొన్నాం కదా? మరి పెద్దవారి మనసులు నొప్పించలేక రాక తప్పిందికాదు. ఏమైనా నీ కిది కష్టమే కలిగించి ఉండొచ్చు. కాని, కొన్నాళ్ళు ఓర్చుకోక తప్పదు నువ్వు," అని, తన రాకకు ఎంతో నొచ్చుకుంటూ సంజాయిషీ ఇచ్చుకొన్నాడు.

'ఇతడి రాక తనకు ఆనందదాయకంగానే ఉందని ఎలా వ్యక్తపరచగలదు?'

"తన కొడుకు వచ్చాడన్న సంబరంలో నా కిష్టమైనవి చేయాలని అమ్మ వంట ఇంట్లో మహా తంటాపడుతూంటుంది. నువ్వు కాస్త సాయం వెళ్ళు అంజనా!"

"అత్తయ్యే నన్ను పైకి పంపించింది, మీ రొక్కరూ ఉన్నారని..." కొద్దిగా సిగ్గుపడుతూ చెప్పింది.




"చొచ్చొచ్చొ! నీ కిటువంటి ఇబ్బంది కలుగుతుందనే నేను రావడానికి భయపడ్డాను. అమ్మ నా భయాన్ని పదిరెట్లు పెంచేట్లుంది." పేలవంగా నవ్వాడు.

శ్రావణ వరలక్ష్మి వ్రతమప్పుడు పట్టుబట్టలు కట్టుకొని పచ్చని శరీరాలతో మెరిసిపోతూ పీటలమీద కూర్చొన్న కొడుకునూ కోడల్నీ సంతృప్తిగా చూసుకొంది మహలక్ష్మి. పెళ్ళిపందిట్లో సరిగ్గా చూసుకుందో లేదో_మరి ఇప్పుడు ఒకరి ప్రక్క నొకరిని తీరికగా చూసుకొంటూ రతీమన్మధుల్లా వున్నా రనుకొంది.

మహలక్ష్మి భర్తకూడా వాళ్ళనే చూస్తున్నాడు. కొడుకు అందచందాలను చూసుకొని ఆయ నెంతో గర్వపడుతుంటాడు. "మన అబ్బాయి ప్రక్కన ఆ అమ్మాయి చంద్రుని చెంత నక్షత్రంలా మెరిసిపోతూంది కదూ? ఈ అందాల బరిణ అదృష్టవశాత్తూ మన గృహలక్ష్మి అయిందను కొంటున్నాను."

వాళ్ళ మాటలు చిన్నగా చెవిలో పడుతూ ఉంటే మనసులో బాధగా సణుక్కొన్నాడు నీలకాంత్: 'అదృష్టానికి కాదు; దురదృష్టానికని మీ కిప్పు డెలా తెలుసు? మీ ఈ ఆనందమంతా ఒకనాడు విషాదమయమై పోతుందని మీ కెలా తెలుసు? ఆనాడు మీ ప్రియపుత్రుని జీవితం బండలవడం చూసి మీ గుండెలు భరించగలవా? ఓహ్!'

అప్రయత్నంగా అప్పుడప్పుడూ నీలకాంత్ శరీరం అంజనకు తగుల్తూంది. దేవికి అక్షంతలూ, పూలూ ఒకే పళ్ళెంనుండి తీసుకొని వేస్తున్నప్పుడూ, హారతి యిద్దరూ పట్టుకొని యిస్తున్నప్పుడూ చేయీ చేయీ కలుస్తూంది. పెళ్ళిలో అంజన అతడి ప్రక్కన వికారరహితంగా శిలలా కూర్చొందేమోగాని ఇప్పు డామె మనసు స్వాధీనం తప్పుతూంది. ఏదో పులకింత! అనిర్వచనీయమైన హాయి! తీయని అనుభూతి!

నీలకాంత్ ఆ సౌందర్యప్రతిమ చెంత నిర్వికార నిశ్చలతలతో కూర్చొన్నాడు. ఆ స్పర్శానుభూతినుండి అత డొకనాడు వంచితు డయ్యాడు. తిరిగి తగుల్కొనే అవివేకి కాదతడు.

అప్పటికి కృష్ణనీడ అంజనలో పూర్తిగా తొలగిపోయినట్లే. దేవిముందు ప్రణమిల్లి మనసారా వేడుకొంది అంజన: కష్టమైనా, సుఖమైన ఈపురుషునితోడి సాహచర్యాన్నే జన్మ జన్మాలకు తనకు ప్రసాదించమని. దేవి హస్తం అభయ మిచ్చిందో, అడ్డంగా ఊపిందో ఆమెకు మాత్రం తెలియదు!

రాత్రి అంజన పడుకోబోయేముందు మహలక్ష్మి అడిగింది: "అబ్బాయి పడుకొన్నాడా?"

"ఏమో!"

నౌకరు చెప్పాడు: "తూర్పు గదివైపు పక్క వేయమంటే వేసివచ్చానమ్మా! పడుకోడానికి ఇప్పుడే వెళ్ళాడు చినబాబు."

"ఊఁ." మహలక్ష్మి చెప్పింది కోడలితో: "ఈపాలు పట్టుకెళ్ళి అబ్బాయి కివ్వమ్మా!"

కొడుకు వచ్చిననాటినుండీ ఆమె పరీక్షగానే కనిపెడుతూంది_ఆ నూతనదంపతులు వేరుగదుల్లో పడుకోవడం; పగటిపూటకూడా వాళ్ళిద్దరూ ముభావంగానే మసలుకోవడం! అబ్బాయిదగ్గరికి వెళ్ళడానికి అమ్మాయి సిగ్గుపడుతున్నట్లుందని అనుకొందామె. 'ఈపిల్లల మధ్య అపరిచితభావం పోగొట్టి అనురాగం చిగురింపజేయడానికి పెద్దదాన్ని నేనిక రంగంలోకి దిగక తప్పదు' అని నిశ్చయించుకొన్న ఆమె కోడలిచేత పాలగ్లాసు యిచ్చి కొడుకుచెంతకు పంపడానికి ఉపాయం ఎత్తింది!

గతుక్కుమంది అంజన. "వారు పడుకున్నారేమో?" అనిమాత్రం అంది.

"ఇప్పుడే వెళ్ళాడని చెప్పాడుకదా నౌకరు? అప్పుడే నిద్రపోయాడా? వెళ్ళు."

తప్పింది కాదిక. అడుగులో అడుగు వేస్తూ నీలకాంత్ పడుకున్నచోటికి వెళ్ళింది అంజన.

జాబిల్లినుండి విరుస్తూన్న వెండి వెన్నెలలో, విచ్చుకొన్న మాలనుండి వెలువడుతున్న ఘుమ ఘుమ వాసనలు మిళితమైన గాలి మత్తుగా వస్తూంటే తెల్లని బెడ్‌షీట్ పరిచిన మెత్తని పరుపుపై పడుకొనిఉన్నాడు నీలకాంత్, అక్కడక్కడా తెలిమబ్బులు తేలియాడుతున్న జ్యోత్స్నాకాశంలోకి చూస్తూ.

అంజన పాలగ్లాసు పట్టుకొని దూరంగా నిలబడిపోయింది నిశ్శబ్దంగా. అయితే, అతడిని చేరడానికి సిగ్గు అడ్డుపెట్టిందని కాదు. భర్తకు పాలగ్లాసు అందించి, ప్రతిగా అతడి పరిష్వంగంలో పరవశించే మధురానుభవంనుండి తనకు తాను ఒకనాడు దూర

మైంది. అలాంటి సన్నివేశానికి అనుకూలమైన ఈపరిస్థితిలో, స్వర్గసుఖం ముందున్నా పొందలేని తన దౌర్భాగ్యానికి విషాద పరితాపాలతో నిండిపోయిం దామె హృదయం.

గాజుల గలగలలు విని చటుక్కున తలతిప్పి చూశాడు నీలకాంత్. "ఓ, నువ్వా అంజనా? ఏమిటి?"

"అత్తయ్య పాలు యిచ్చిరమ్మంది."

నవ్వుతూ పలకరించిన నీలకాంత్ ముఖం చటుక్కున నల్లబడిపోయింది. "అమ్మ మనసంగతి అనుమానిస్తూన్నట్లుంది. లాభం లేదిక అంజనా!" అని, ఎంతో కష్టంగా, జాలిగా అడిగాడు: "నీకు నామీద నమ్మకం లేదా అంజనా? అయితే ఈరాత్రి ఇక్కడే పడుకోవూ?"

"ఇక్కడా?" మనసు మర్మంలో మధురానందం!

"ఊఁ, ఈరాత్రి మననుండి అమ్మ ఏమీ ఆశిస్తోందో—అదేమో అసంభవమేగాని, అది ఇప్పుడప్పుడే ఆమెకు తెలియడం బాగుండదు. అలా తెలిసిన మరుక్షణంనుండీ నువ్విక్కడ ఉండడానికి వీలుండదని నిశ్చయంగా చెప్పగలను. మనకున్న సంబంధం కూడా ఇక అంతటితోసరి. నిన్నిక నీ కిష్టమైనస్థానంలోకి ఎలా చేర్చగలను?"

నీలకాంత్‌కు పాలగ్లాసు అందిస్తూన్న అంజన మనసులో మెరుపులా ఒకదృశ్యం కదిలింది. ఒక నూతన వధువు క్షీరపాత్ర అందిస్తూంటే భర్త చేయిపట్టి లాగాడు. అతడి చేతుల్లోపడిన ఆమె, దోసిట్లో ముఖం దాచుకుని సిగ్గుతెరలమధ్య పరవశించింది.

నీలకాంత్ ఆమె చేతినుండి పాలు అందుకొని త్రాగేసి నెమ్మదిగా గ్లాసు క్రింద పెట్టేస్తుంటే ఒకనిట్టూర్పు నిశ్శబ్దంగా విడిచింది అంజన.

అతడికి కొద్దిదూరంలో కొంగు పరుచుకొని పడుకోబోయింది అంజన.

"అహఁ హఁ. వట్టి నేలమీద పడుకోకు. ఈ బెడ్‌షీట్, దుప్పటీ తీసుకో. అది క్రింద వేసుకొని, దుప్పటిమడత చుట్టి తలక్రింద పెట్టుకో," పరుపుపైనుండి వాటిని తీసిస్తూ మృదువుగా చెప్పాడు నీలకాంత్.

అంజన బెడ్‌షీట్ పరచి దుప్పటి మడత చుట్టి తలవైపు పెట్టుకొని పక్కమీద పొందికగా కూర్చొంది.

చాలసేపు నీలకాంత్ మాట్లాడలేదు. ఆలోచనల మధ్యనుండి అడిగాడు! "అక్కడ నీ కేమైనా కృష్ణసంగతి తెలిసిందా అంజనా?"

"ఉహూఁ." ఒకనాడు ఎవరి తలపైతే హాయిగా వలపుతీపి ఎదలో నింపేదో, అతడి ప్రసంగ మిప్పుడు విషప్రాయంగా, ఎదలో ముల్లు గుచ్చినట్లుగా ఉంది!

"అక్కడ మీ వీధిలోనే నా డియరెస్ట్ ఫ్రెండ్ ఒకడున్నాడు తెలుసా? మోహన్—అతడికి వ్రాశాను, కృష్ణ ఇంటిసంగతులేమైనా తెలిస్తే వ్రాయమని. 'హఠాత్తుగా తల్లిని తీసుకొని తీర్థయాత్రలకు వెళ్ళాడని తెలిసింది. ఎక్కువ సంగతులు తెలియ' వంటూ వ్రాశా డతడు. ఈ నెలాపదిహేను రోజుల్లో నేనే కాస్త వీలుచూసుకొని అక్కడికి వెళ్ళిరావా లనుకొంటున్నాను."

"ఛీ ఛీ! ఆపిరికివాడి ప్రసంగం ఎత్తకండి నాదగ్గర," విరసనగా, కోపంగా అంది అంజన. "అతడికి నాప్రేమలో అణువంత ఉన్నా న న్నిలా, నా గతికి న న్నొదిలేసి పారిపోయేవాడు కాదు. నిజమైన ప్రేమ ఉన్నచోట ధైర్యమూ, మొండి తెగింపూ తప్పకుండా ఉంటాయి. అతడికి అవి ఉంటే నేను మీభార్యను అయ్యేదాన్నా?"

"ప్రణయ కోపమా?" నిర్మలహృదయం ప్రతిఫలించే చిలిపినవ్వు నవ్వాడు నీలకాంత్. "మా చెల్లి సుధ వట్టి పెంకె, పెంకుసూ స్వభావము—నీ వలెనే. మన కలవారిళ్ళలో పెరిగే ఆడపిల్లలు, అందులో ఒక ర్తే అయితే అమ్మా నాన్నా గారాబంలో ఎంత దుడుకు, తీవ్రప్రవృత్తి అయినా అలవడుతుంది. ఆశించింది వెంటనే పొందలేకపోతే శాశ్వతంగా విసర్జించే నిష్ఠుర తిరస్కారాలు ఎంత బలీయంగానైనా ఉంటాయి ఆమెలో. తర్వాత బాధ ఏలానూ తప్పదు. చిన్నప్పటి నుండి నాతో పెరిగిన సుధను ఎంత బాగా అర్థం చేసుకొన్నానో నిన్నూ అంత బాగా అర్థంచేసుకోగలను.

"నువ్వు కొంచెం నెమ్మదిగా కృష్ణ పరిస్థితి నర్థం చేసుకోవాలి. నువ్వు చెప్పిన తెగింపు అతడిలో ఉండిఉంటే ఈపరికి మీ నాన్న ఆగ్రహానికి బలి అయ్యేవాడు; నీకూ—అటు తల్లికీ కాకుండా. ఆశలన్నీ కొడుకు మీదే పెట్టుకొని బ్రతుకుతున్న ఆ తల్లి గతి ఏమయ్యేది చెప్పు? నువ్వు లేని జీవితమైనా అతడు తన తల్లికోసం కోరి ఉండవచ్చు. అందులో స్వార్థమూ, త్యాగమూ ఉంది!"

ఆ తర్వాత మరింక మాట్లాడలేదు నీలకాంత్. వెంటనే నిద్రపోయాడో లేదోగాని కదలక మెదలక నిశ్చలంగా పడుకొన్నాడు.

అంజన స్థితి వర్ణనాతీతం. అత డావిధంగా నిర్వికారంగా శయనించడం ఆమె కెంతమాత్రం సంతోషంగా లేదు. అతడు తనకు జరిగిన అన్యాయానికి పరితాపాన్ని వెళ్ళబోసుకోవాలనీ, తన మనఃపరివర్తన వెల్లడించి అతడి వేదన సంతోషంగా తొలగించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాలనీ మనసులో తహతహలాడింది కాని, అలాంటి పరిస్థితి నతడు అతినిగ్రహంతో రానీయలేదు!

వికారమో, విరహమో తెలియని ఒక వ్యథతో ఆమె కంటికి నిద్రను దూరంచేసుకొంది ఆరాత్రికి.

## 6

"అదేం మాట, నీలూ' కోడల్ని నా దగ్గ రెందుకు ఉంచుతా' నంటున్నావు? ఇన్నాళ్లు గడిపిన వంటరిజీవితం చాల్లేదా?"

"అది కాదమ్మా. నాన్నా, నువ్వూ—మీరిద్దరే ఇక్కడ ఉంటే ఆమె తోడుగా ఉంటుందని..."

"కోడలు రాకముందు మాత్రం నిన్ను చదువులకు పై దేశాలకు పంపి ఈ పల్లెలో మే మిద్దరమే ఉండలేమా! కాలూ చెయ్యి పడిపోయిననాజు ఎలానూ తప్పదు పిల్లలకు మా సేవాశుశ్రూష! ఇప్పటినుండీ దేనికి?"

తల్లి వాదనముందు తలొంచక తప్పలేదు నీలకాంత్‌కు. గొంతులో వెలక్కాయ పడినట్లుంది. అంజనను తనతో పంపాలన్న ఆమె పట్టుదలలోని ఆంతర్య మేమిటో నీలకాంత్ గ్రహించక పోలేదు. తమ మధ్య పరస్పరం అభిమానానురాగాలు లోపించాయని ఆమె గుర్తించడంవల్లా, తామిద్దరు దూరదూరంగా ఉంటే యిలాగే అతకని మనసులతో బ్రతుకులు సాగుతాయేమోనన్న భయంతో టీ భార్యను వెంటబెట్టుకు పొమ్మని పోరుతుంది ఆమె. ఇద్దరూ ఒకచోట ఉండడంవల్ల ఒకరి నొకరు తెలుసుకొని సౌఖ్యవంతమైన సంసారం సాగించగలరని ఆమె ఉద్దేశ్యం.

ఆమె ఆలోచన ఎలా పరిణమించినా అంజన తనతో రావడానికే ఇష్టపడుతుందా? "నాతో రావడానికి అంజన యిష్టపడుతుందేమో అడుగు అమ్మా! ఆమె వస్తే అలాగే తీసుకువెళ్తాను.''

"నువ్వంతా విచిత్రంగా మాట్లాడతావేం నీలూ? ఆపిల్లకుమాత్రం మగణ్ణి విడిచి ఈ ముసలాళ్ళని కనిపెట్టుకు ఉండాలని ఉంటుందా?'' ఈ నూతన దంపతులు దూర దూరంగా ఎడపెడ మొగాలుగా ఎందుకు మసలుతున్నారో ఆత్యాశ్చర్యంగా ఉంది మహాలక్ష్మికి. విద్యా సౌందర్యాలలో ఎవరిని ఎవరు దెప్పుకోటానికీ అవకాశం లేదు. వారిది ఆదర్శవంతమైన అనురాగదాంపత్యమౌతుందనుకొన్న తన నమ్మకం దెబ్బతినడానికి లోపం ఎక్కడ ఉందో తెలియడం లేదు. కోడలు తమలాగే గొప్పింటినుండి వచ్చిందే అయినా వినయ సౌశీల్యాలు మూర్తీభవించినట్లు నడుచుకొంటూంది. తప్పు తన కొడుకుదగ్గరుందా? వాడు మరే ప్రలోభానికైనా లోబడి ఈ పిల్లను దూర దూరంగా ఉంచుతున్నాడా? అబ్బే! వాడి మనసు నాకంటే ఎక్కువగా మరెవరికి తెలుసు? కలలోకూడా భార్యకు ద్రోహం తలపెట్టే స్వభావం కాదు అతడిది. మరి, ఎందు కిలా అయింది?

నౌకరుతో అత్తగారు పంపిన కబురు అందుకొని, మేడమీదినుండి దిగివచ్చింది అంజన.

"అబ్బాయి రేపు వెళ్తున్నాడటమ్మా! నీ బట్ట లవీ సర్దుకొని తయారుకా."


"అల్లాగే అత్తయ్యా!" అంజన తలూగించి, తిరిగి తన గదికి వెళ్ళిపోయింది.

నీలకాంత్ ఆశ్చర్యానికి అంతులేక పోయింది. 'ఆమెకు తనమీద అంత నమ్మకమెలా కలిగింది?' అంజన తనమీద ఉంచిన విశ్వాసానికీ, ఆమె తనతో వస్తూన్నందుకూ నీలకాంత్‌కు సంతోషంగా ఉన్నా, మరొక వైపునుండి భయం చుట్టుముట్టింది అతడిని. ఈ సాన్నిహిత్యంవల్ల తన నిగ్రహం సడలిపోయి ప్రతిజ్ఞాభంగం జరగదుకదా? ఆమె ఆకర్షణనుండి తప్పించుకొని ఆమెను సురక్షితంగా కృష్ణకు అప్పగించగలనా?

సాయంత్రం ముఖం కడుక్కోవడానికి నీలకాంత్ బాత్‌రూంలోకి వెడుతూంటే అంజన పెరట్లోనుండి వస్తూ ఎదురైంది.

నీలకాంత్ ఒక క్షణం ఆగి, "అమ్మ ఏమనుకొంటుందో నని నాతో రావడానికి ఒప్పుకొన్నావా అంజనా?'' అనడిగాడు.

"ఏంకాదు. ఆమె ఏమనుకోకపోయినా నాకు మీతో రావడానికి ఏ మభ్యంతరముంది?''




"మరి...మరి...ఏమైనా జరిగితే?''

అంజన ముఖం పక్కకుపెట్టి, అతడి కంటికొసలనుండి చూస్తూ, పెదవులమీద సన్నవి నవ్వుతో, "ఏం జరుగుతుంది?'' అని అంది.

అది అమాయకతో, అభినయమో నీలకాంత్ కెలా తెలుసు?

"భగవంతుడు నీ నమ్మకాన్ని రక్షించుగాక!'' అంటూ కదిలాడు.

* * *

నౌకరు చేతికి తాళా లిచ్చి కారునుండి క్రిందికి దిగాడు నీలకాంత్.

"దిగు, అంజనా!''

అంజన దిగి నౌకరునుండి తాళా లందుకొని, తలుపులు తెరిచి లోనికి కుడిపాదం పెడుతూంటే – తొలిసారిగా తను అత్తవారింట్లో అడుగు పెడుతున్నప్పుడు ఘు... దువు లంతా "కుడికాలు ముందుంచు,'' అ... చెబుతూఉంటేకూడా తను కసికొద్దీ ఎడ... పాదం వేయడం గుర్తొచ్చి మనస్సు కలు... మంది.

ఆ ఇంటిలో అడుగుపెడుతూ ఆమె మ... స్ఫూర్తిగా ఆ ఇంటి యిల్లాలుగా భావిం... కొంది కాని ఆ గృహస్వామికి జీవిత భా... స్వామిని కాగలదో లేదో ఎవరు చెప్పగల...

ఆమె మాత్రం ఈ గృహాన్ని విడిచి వెళ్ళ గలనని అనుకోలేదు. తప్పనిసరిగా ఆ పరిస్థితే వస్తే ఈ తనువునైనా వదులుతుంది కాని ఈ ఇంటిని మాత్రం వదలదు! ఈ నిశ్చయంవల్లే నీలకాంత్ ఆమెను ప్రస్తుతానికి తీసుకువచ్చినా ఆమె ఆ విధంగా భావించు కోగలిగింది.

గృహప్రవేశం చేసిన మరుక్షణంనుండే తన గృహిణీత్వంతో ఆ బ్రహ్మచారి గృహాన్ని నిండుగా కలకలలాడించింది అంజన. సాయంకాలం నౌకరుతో బజారుకు వెళ్ళి ఇంటిని అందంగా, నీటుగా తీర్చిదిద్ద డానికి అవసరమైన వస్తువులన్నీ తెచ్చింది.

ఇంటిముందు ఆగిన కారునుండి దిగిన అంజన లోనికి చకచకా నడిచి వస్తూంటే, వెనుక నౌకరు వస్తువుల పాకింగులు తెస్తూండగా చూసి ఆశ్చర్యపోయాడు నీలకాంత్, అవన్నీ ఏమిటా అని. మరురోజు సాయంత్రం అతడు కోర్టునుండి వచ్చి ఇంటి అలంకరణ చూసినప్పుడు తెలిసింది.

కొత్తగా వేసిన చక్కని లతలున్న కర్టెన్ తొలగించి తనగదిలో అడుగుపెట్టిన నీలకాంత్ ఎదురుగా గోడమీద సుజాత ఆరాధిస్తూన్న సిద్ధార్థుని స్థానంలో బిందె చంకనుంచుకొని యమునాతీరంలో, వేణు గానలోలుని, తన ప్రణయమూర్తిని వెదకి కొంటున్న రాధనుచూచి కొద్దిగా కనుబొమలు ముడివేశాడు. 'ఈ కృష్ణప్రేమిక ఈ ప్రణయ సన్నివేశం ఇక్కడెందుకుంచింది? కృష్ణతోటి తన విరహం అనుక్షణమూ నాకు గుర్తు చేసేందుకా?'

దుస్తులు మార్చి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ముఖం కడుక్కొని టవల్‌తో తుడుచు కొంటూ వచ్చాడు నీలకాంత్. వంటమనిషికి బదులుగా అంజన తెచ్చింది టీ.

"సిద్ధార్థుని చిత్రం ఏది?"

"తీసి పెట్టెలో పడేశాను."

"పడేశావా? ఎందుకు?"

"ఈవయసువాళ్ళ గదులలో ఆ చిత్రా లెందుకు?"

"వయసు ఏదైనా బ్రహ్మచారి గదికి శోభనిచ్చేది అదే. నాకోసం విరహం చెందుతున్న రాధ లెవరూ లేరు కూడా. అందులో, నాకు చాలా ఆప్తురాలైన ఒక స్నేహితురాలు తన చిత్రరచన ప్రావీణ్యత నంతా ఒలికించి, ఎంతో శ్రద్ధగా వేసి నా బర్త్‌డేకు ప్రజంట్ చేసిన చిత్రమది. అది పెట్టె అడుగున పడవేయడమా! ఉహూఁ. ఈ గదిలో నీ ఇష్టమొచ్చిన మార్పు చేసుకో గాని అదిమాత్రం తెచ్చిపెట్టు."

'ఇతడికి ఆడవాళ్ళు స్నేహితులుకూడా ఉన్నారా? అందులో అంతదగ్గరగా వచ్చిన స్త్రీ!' మనసులోని ఉత్సాహానందాలు తుడిచి పెట్టుకుపోయి మలిన విచారభావాలేవో ఆవరించుకొన్నాయామెను. "ఆమె ఎవరు?" స్వరం ఎంతో సహజంగా ఉంచి అడిగింది.

"లాయర్ పవన. మంచి చిత్రకారిణి. నా కెవరైనా స్నేహితులున్నారూ అంటే ముందుగా ఆమెనే చెప్పుకోవాలి."

"అలాగా!" ఆ తక్షణమే వెళ్ళి సిద్ధార్థుని చిత్రం తెచ్చిపెట్టి రాధచిత్రం తీసికెళ్ళి తనగదిలో పెట్టుకొంది అంజన.

ఇంతకు ముందు నీలకాంత్ స్వయంగా చేసుకొనేవాడు తనపనులు—నౌకర్లు అశ్రద్ధతో తికమక చేస్తుంటారని. ఇప్పుడతని అవస రాలను అతిశ్రద్ధాసక్తులతో చేసిపెట్టే ఒక సేవిక ఆ ఇంటిలో ప్రవేశించింది. అతడికి సంబంధిన ఏ ఒక్కపనీ నౌకర్లకు అప్పగిం చేది కాదు అంజన. అన్నీ ఆమే చేసేది.

అది గమనించిన నీలకాంత్ ఒకవిధంగా సంతోషాన్నీ, ఒకవిధంగా విచారాన్నీ పొందేవాడు. మొదటే ఆమె వియోగం దుర్భరం. ఒక శయ్యావిషయంలో తప్ప అన్నింటా ఆమె ఈ విధంగా కలిసిమెలిసి తన జీవితంతో పెనవేసుకుపోతే, రోజు రోజుకూ దృఢమయ్యే ఈ అనుబంధం త్రెంచుకోలేని బలహీనుడౌతాడేమో!

అంజన ప్రవర్తన అతడకి ఇంచుక ఆశ్చర్యం గొల్పుతున్నదికూడా. పెళ్ళిలో అంజన కనబరచిన అహంకార తృణీకా రాలు ఇప్పుడేమయ్యాయి? తన హృద యంలో యించుక స్థానంకూడా యివ్వలే నని నిర్మోహమాటంగా చెప్పిందే! ఇప్పు డింత శ్రద్ధాభక్తులు ఎలా చూపగలుగు తూంది? తను కృష్ణతో కలుపుతానని మాటిచ్చినందుకా, తన కృతజ్ఞతను ఈ రూపంలో వెల్లడించుకొంటున్నది? అంతే అయితే తను కృష్ణను వెదకటంకోసం గట్టి ప్రయత్నమే చేయాలి. ఆమెకోరిక తీర్చిననాడే తను నిశ్చింతు డౌతాడు. ఆలస్య మయ్యేకొద్దీ తన నిగ్రహం ఏమౌతుందో తెలియదు! అంజనను ఎంత తొందరగా తనదగ్గరనుండి పంపించేయగలిగితే అంత క్షేమం!

అంజన గదిలోకి వచ్చి టేబిల్‌మీది కవరు మార్చి, తను అందంగా పుష్పలతలూ, సీతాకోకచిలుకలూ కుట్టిన క్లాత్ వేస్తుంటే నీలకాంత్ దగ్గిరికి వచ్చి పరికించాడు. కవరు మధ్య 'అంజనా – నీలకాంత్' అని కుట్టబడి వుంది.

"నీ పేరుతో నాపేరు ఎందుకు కలిపావు అంజనా?" బాధగా ప్రశ్నించాడు నీలకాంత్.

"తప్పా?"

"ఆ అర్హత నాకు లేదంటున్నాను. అందుకు అర్హుడు ఒక అజ్ఞాతవాసి మాత్రమే!"

'అతడికీ, మీకూ పోలి కెక్కడ? అర్హానర్హతల్ని నిర్ణయించడంలో నేను చేసిన పొరపాటుకు నన్నే విధంగానూ శిక్షిం చకు!' అని మనసులో అనుకున్నా, పైకి ఏమనలేదు అంజన.

తిరిగి అన్నాడు నీలకాంత్: "నిన్ను మరచిపోలేని స్మృతులు నా జీవితంలో నిలిపిపోయేట్లున్నావు అంజనా!"

"మరచిపోతారా? మీరు నన్ను మరచి పోతారా? నేనది భరించగలనా?" దుఃఖా వేశం ముంచుకొచ్చి అంజన అక్కడనుండి గబగబా వెళ్ళిపోతుంటే, నీలకాంత్ ఆశ్చర్య విభ్రమాలతో చూడసాగాడు.

వారంరోజుల తర్వాత ఒకరోజు అంజన

దగ్గరుండి వడ్డిస్తూంటే నీలకాంత్ భోజనం చేస్తున్నాడు. "నేను రేపు మా ఊరికి వెళ్తున్నాను అంజనా!" అన్నాడు.

"ఎందుకు?"

"అదే—కృష్ణసంగతి తెలుసుకోడానికి."

"ఊరివాళ్ళకే తెలియనప్పుడు మీరెలా తెలుసుకోగలరు?"

"అప్పుడే ఎలా చెప్పగలను! ప్లాన్ ప్రకారం పని జరిగించడానికి డిటెక్టివ్‌ను కాదుగా? అక్కడికి వెళ్ళాక పరిస్థితి ఏలా ఉంటుందో?"

"మీరేం వెళ్ళనక్కర్లేదు." అప్రసన్న స్వరంతో, ఖచ్చితంగా అంది అంజన.

"ఎందుకు?" ఆశ్చర్యంతో కళ్ళెత్తాడు నీలకాంత్. తను కృష్ణకోసం వెళ్తున్నాడంటే అంజన ముఖం ఆనందంతో విప్పారుతుందనుకొన్నాడు. కాని, అదేమిటి? ముఖమలా చేసుకొంది!


"ఆ పిరికివాడిని వెతికి పట్టుకోవడం శుద్ధ తెలివితక్కువ."

"ఓ! నీకింకా కృష్ణమీద కోపం పోనట్లుంది!" జాలిగా నిట్టూర్చి తిరిగి అన్నాడు: "అలా అన్నావుగాని అది నాకు సుఖశాంతుల నిస్తుందా అంజనా? కృష్ణను మరువగలవా? దేనికీ పంతాలూ, రోషాలూ? తర్వాత దుఃఖపడడానికి కాదూ? నన్ను వెళ్ళనీ."

మరింక మాట్లాడలేదు అంజన. మరురోజు నీలకాంత్ వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళినప్పటినుండీ అంజన పడకగది దాటి రాలేదు. కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ ఉండిపోయింది. అతడి ప్రయత్నాన్ని అడ్డుపెట్టే శక్తి ఆమెకు లేదు. ఏనాడో నాడు నిర్దయాత్మక హృదయంతో గీసిన గీటు, అతడే పరిస్థితిలోనూ దాటివచ్చేట్లు లేదు. తనే ఆ గీటును తుడిచిపెట్టి అతడిని సమీపించలేకపోతూంది. సిగ్గూ, అభిమానం ఆమెను చుట్టివేస్తున్నాయి.

## 7

నీలకాంత్‌వాళ్ళ పక్కవాటాలో ఇంజనీరు మధుసూదనరావు ఉంటున్నాడు. అతడి భార్య కమలప్రియ. వారికి వివాహం జరిగింది ఈ శ్రావణంలోనే.



అంజన అక్కడికి వచ్చిన తొలిరోజే కమలప్రియతో పరిచయం ఏర్పడింది. ఈ వారం పదిరోజుల్లో మంచి స్నేహం కలిసింది యిద్దరికీ.

"అంజనా! ఏంచేస్తున్నావు?" అంటూ వచ్చింది కమలప్రియ.

అంజన దిండులోనుండి ముఖం పైకెత్తి "రా, కమలా!" అంది.

కమల కూర్చొని "ఉదయం మీ వారు ఏ ఊరికో వెళ్తున్నట్లున్నారు?... అదేమిటి? ఏడిచావా? ఆ కళ్ళేమిటి? ఆ ఎరుపేమిటి? ఒక్కపూట దొరగారి వియోగానికే అంతగా దివాళా తీశావేం?" అంది ఆశ్చర్యంగా.

"ఫీ, పో," కమలప్రియ మాటలు మధురంగా వినిపించినా పైకి తెచ్చిపెట్టుకొన్న కోపంతో కసురుకొని ముఖం దిండు దూర్చేసింది తిరిగి.

కమలప్రియ కూర్చొన్న కుర్చీను చటుక్కున లేచివచ్చి అంజన ముఖం ల్లోకి తీసుకొంది. "నిజం చెప్పు. అం లేనందుకేకదూ ఏడిచావు? ఎప్పుడొ దేమిటి?"

"రాత్రికే రావచ్చు."

"ఓస్! అంతలోకే ఇంతదిగులేమిట ఫక్కున నవ్వి తిరిగి అనునయంగా అం "అవునులే, నాకూ అలాగే ఉంటు ఆయన బయటికి వెళ్ళాడంటే. అదేమి వా రెప్పుడూ మనచూపుల నీడల్లో కట్టుకు ఉండా లనిపిస్తుంది; కాని మగవా మన కొంగులు పట్టుకు కూర్చుంటే పని ఎలా అవుతాయి మరి?"

సిగ్గుపడింది అంజన. "అదికాదు.

"ఏదికాదు? అదంతే. ఆమాత్రం

సుకోలేనని దబాయించబోకు చిట్టితల్లీ!''
అంజన చెంపమీద చనువుగా ఒకదెబ్బ వేసి నవ్వింది కమలప్రియ.

భర్తతోటి కొన్ని గంటల వియోగానికే కొన్ని యుగాలుగా తపించిపోయే కమలప్రియ తన భర్త ప్రణయలీలలూ, దాంపత్య రహస్యాలూ తన్మయతతో చెప్పుకుపోతూంటే శ్రద్ధాకౌతూహలాల్తో వింటూంది అంజన.

ఈ నూతన గృహిణీమణులకు చెప్పుకోడానికి భర్తల కబుర్లు తప్ప వేరే రుచించవేమో! మరి అంజనకు చెప్పుకోడానికి ఏమున్నాయి? స్నేహితురాలి అనుభవాలు విని తరుణజీవనసౌఖ్యానికి ఆనందిస్తూనే మరోవంక అలాంటి అనుభవాలకు దూరమైన తన జీవన దౌర్భాగ్యానికి పరితాపం పొందుతూ ఉంటుంది.

నీలకాంత్ ప్రయత్నపూర్వకంగానే తనకు చాలాదూరంగా ఉంటున్నాడు. విధిగా తనతో మాట్లాడే రెండు మాటలూ స్నేహసరళత్వాలు వ్యక్తపరుస్తాయే గాని ఎటువంటి వికారానికీ, మర్మానికీ, కాపట్యానికీ తావుండదు. శోభనంనాటి రాత్రి తనకు కృష్ణమీదున్న ప్రేమ ఎంత ప్రగాఢమైనదో నొక్కిచెప్పిందికదూ? అది కలలోకూడ మరిచిపోనట్లుంది. అతడు-తన్నర్థం చేసుకోడానికి తనిచ్చే అవకాశాలుకూడా జారవిడచుకొంటున్నాడు. తనున్నది స్వర్గసమానమైన పతిదేవుల సన్నిధి, తను అనుభవిస్తున్నది మాత్రం నరకయాతన. ఈ స్థితి ఏనాటికైనా మారుతుందా?

అంజన ఆలోచనల్ని చెదరగొడుతూ కమలప్రియ తన కళ్యాణగాథ వినిపిస్తూంది; 'ఈ సంబంధం మా తల్లిదండ్రులకు ఎంతమాత్రం ఇష్టంలేదు. మా నాన్న పిల్లా డెలావున్నా, బాగా చదువుకొన్నవాడు చాల్లే'దని ముందుకు తూగినా, మా అమ్మ తీవ్రంగా అడ్డుపెట్టింది. 'ఆ కోతిమొగానికా నా బంగారు బొమ్మ నిచ్చే' దంటూ. నా ఇష్టంమీదే ఈయనతో వివాహం జరిగింది. నిండుజాబిల్లి నీలిమేఘానికి వెండి అంచు వేస్తున్నట్లు ఆయన హృదయనైర్మల్యం ఆ ముఖానికి ఒక వింతవర్చస్సు నిస్తూంటే ఆ నల్లని ముఖంలోని మసూచికంగుంటలు కానీ, ఆ మోటు పెదవులుకానీ నాకు కనిపించలేదు.

"నిజంగా వైవాహిక జీవితంలో స్త్రీ సుఖించేందుకు ముఖ్యంగా ఏది కారణము ఔతుంది అంజనా? పురుషుడి సౌందర్యమా? అది కారణంగా వంచింపబడని స్త్రీ ఎవరు. స్త్రీ హృదయం పరితృప్తిపొందేది తన పురుషుని పవిత్ర ప్రేమలో; అదే లేనినాడు ఇక ఎన్ని ఉన్నా ఆమె జీవితం దుఃఖభాజనమే.

"ఆయనలో లేని సౌందర్యం నాలో చూచుకొని నన్నధికంగా ప్రేమిస్తుంటారాయన. నాకు అదే కావాలి. ఆయన ప్రణయసామ్రాజ్యంలో నాకు లోటేమీ కనిపించడంలేదు. ఈడూజోడూ కలువలేదని, నే నాయనకు కాకిముక్కుకు దొండపండులా గుంటానని లోకులు నవ్వితే నవ్వనీ; నేను మాత్రం ఫక్కుమని నవ్వుతాను."

కమలప్రియభర్తను ఒకటి రెండుసార్లు చూచింది అంజన. ఆ నూతన దంపతుల అందచందాలలోని వ్యత్యాసానికి జాలిపడింది తను. తల్లిదండ్రులు బలవంతపెట్టి ఇతడితో వివాహం చేశారేమో! నారీ ధర్మానికి కట్టుబడి విద్యావతీ, సౌందర్యవతీ అయిన కమల విధిగా ఆ నల్లపెరుమాళ్ళను ప్రేమిస్తుందేమో అనుకొంది కాని, తన హృదయ సౌశీల్యంతో అపూర్వమైన అదృష్టాన్నే ఆమె వరించిందని తను ఊహించలేకపోయింది.

కమలప్రియలోని అపూర్వమైన స్త్రీ హృదయానికి లోలోన జోహారు లర్పించింది అంజన. వివాహత్పూర్వమే మనసు పరాధీనం చేసి తను చేసిన భర్తృద్రోహాని కామె పాపభీతితో కృంగిపోతూంది.

ప్రక్కవాటాముందు జీపునుండి దిగుతున్న భర్తను చూసి కమలప్రియ లేస్తూ, "ఆయన వచ్చారు పద! కాస్త ముఖమదీ కడుక్కొని తల దువ్వుకో-పోదాం మా ఇంటికి."

"నే నెందుకు? ఉహూఁ, నేను రాను."

"లాభం లేదు; నిన్నిక్కడ ఏడుస్తూ కూర్చోనిస్తానా? లే, నువ్వు కబుర్లు చెబుతూ ఉంటే నేను పనిచేసుకొంటాను."

కమలప్రియ బలవంతము చేసి ఈడ్చుకుపోయింది అంజనను. పెరటివైపు నుండి తీసుకుపోయి, వంటింట్లో పీటవాల్చి కూర్చోబెట్టి "ఊఁ, ఏమైనాచెప్పు కబుర్లు" అంటూ, టీ పెట్టడానికి స్టౌ వెలిగించింది కమలప్రియ.

"ఏమున్నాయి కబుర్లు, చెప్పడానికి?" నవ్వడానికి ప్రయత్నించింది అంజన.

"అయితే, అన్నీ నువ్వే దాచుకో అమ్మాయ్! నేను మాత్రం తిక్కకోతిలా సిగ్గువిడిచి వాగుతాను. నువ్వు మాత్రం ఒక్కటికూడా చెప్పకు."

"ఏం చెప్పను?"

"మీ ఆయన సంగతులు చెప్పు!"

అంజన ముఖం పక్కకు తిప్పుకొని, "నాకు తెలియవు," అంది క్షీణస్వరంతో.

"తెలియవూ?" కోపగించుకొంది కమలప్రియ. అంతలోనే నవ్వేస్తూ "పోన్లే! అంతసిగ్గు అయ్యవారిదగ్గర రాణిస్తుంది. నా దగ్గరకాదు!" అని పరిహాసపు విసురొకటి విసిరి కప్పులో టీ కలిపి పక్కగదిలో వున్న భర్తకు తీసుకుపోయింది కమలప్రియ.

"ఎక్కడికెళ్ళావిందాక?"

"అంజనవాళ్ళింటికి."

"............"

''అబ్బా! ఇదేం పని? అవతల ఆవిణ్ణి కూర్చోబెట్టాను. ఆవిడ చూస్తే ఏమనుకొంటుంది. ఈ చెంప?"

భర్త నవ్వేసి, "ఏమనుకొంటుంది? మొగుడు ముద్దెట్టుకొన్నా డనుకొంటుంది," అన్నాడు.

కమలప్రియ కాళీకప్పు తీసుకొని గాటు

పడిన బుగ్గను పైటతో తుడుచుకొంటూ, "ఛఛ! ఈ మగాళ్ళకు జాలిలేదు. బుగ్గ డబుల్‌రొట్టెలా కొరికిపెట్టాశాడు." అని, నవ్వుతూ సిగ్గుమాధుర్యం ఒలకబోస్తూ వస్తూంటే, అంజన తత్తరపాటుతో లేచి, "నే వెడుతున్నాను" అంది.

"అరే; కూర్చో. టీ తీసుకొని వెడుదువు గాని."

"ఉహుఁ." కమలప్రియ విస్తుపోతూండగా గబగబా వెళ్ళిపోయింది అంజన.

* * *

రాత్రి పదింటి తర్వాత కారు ఇంటి ముందు ఆగింది. అతడు ఇంట్లోకి వస్తూనే వరండాలో కూర్చున్న నౌకరును అడిగాడు: "రాఘవా, భోజనంచేసి పడుకొందా ?"

"లేదు బాబుగారూ! ఇందాక, తలనొస్తున్నదని మందు పూసుకొని కణతలు రాసుకొంటున్నారండీ."

నౌకరు సమాధానం విని బూట్లుకూడా విప్పకుండా ఆత్రంగా అంజన గదిలోకి దారి తీశాడు నీలకాంత్. "తలనొప్పి తగ్గిందా, అంజనా ?"

ఇదే ప్రథమం, భర్త తన గదిలోకి రావడము. అతడి హఠాత్ ఆగమనానికి అంజన ఉలికిపాటుతో లేచినిలబడి, "ఊఁ, తగ్గింది" అంది.

"కూర్చో కూర్చో. శుభవార్త చెప్పాలి మరి." ఉత్సాహానందాలతో కిటికీ దగ్గరున్న కుర్చీ అంజన మంచం దగ్గరికి లాక్కొని కూర్చొన్నాడు నీలకాంత్.

పిడుగేదో పడబోతున్నట్లు భయవిహ్వలతతో బిగుసుకుపోయింది అంజన. వివర్ణ వదనాన్ని అవనతం చేసి నిలబడిందలాగే.

"ఉఁఉఁ, కాస్త కళ్ళెత్తిచూడు మరి. నీ కళ్ళలో మెరిసే ఆనందపు వెలుగులను చూచి నాకళ్ళు కాస్త తృప్తిపడతాయి."

అంజన తలెత్తి కన్నీటి తెరలనుండి చూసిం దతడిని జాలి జాలిగా.



"బలే! సంగతేదో చెప్పకుండానే ఆనందంతో కన్నీరు నింపుతున్నావు?" తృప్తిగా నవ్వాడు నీలకాంత్. "వెళ్ళి మోహన్ ఇంట్లోనే దిగాను. వాళ్ళింటి నౌకరును పట్టుకొని చాటుగా ఓ పది రూపాయలనోటు చేతిలో పెట్టి కృష్ణవాళ్ళింటి పక్క పక్క ఇళ్ళలో అతడి సంగతులేమైనా తెలిస్తే తెల్పుకురమ్మని పంపించాను. వాళ్ళింటిపక్కన ఓ శేట్ ఉన్నాడటకదూ? పరబ్రహ్మం అని! ఆయనకు వారం రోజుల క్రింద ఓ ఉత్తరం వ్రాశాడట కృష్ణ శ్రీశైలంనుండి. తమఇల్లు అమివేస్తున్నామనీ, పరబ్రహ్మం తీసుకునేపక్షంలో ఫలానా ఖరీదుకు యివ్వదలుచుకొన్నాననీ వ్రాశాట్ట, ఈయన సరేనంటూ వ్రాస్తే, తొమ్మిదో తారీకునాడు తాను వస్తున్నానని, రెండు మూడు గంటల్లో ఇల్లు విక్రయానికి సంబంధించిన వ్రాతకోతలన్నీ పూర్తి కాలవానీ, అందుకు ఏర్పాట్లు చేయమని తిరిగి వ్రాశాడట కృష్ణ. అత డొచ్చే తేదీ నోటుచేసుకొని వచ్చాను. ఆరోజు వెళ్ళి కృష్ణను కలుసుకోవాలనుకొంటున్నాను."

ఉదాసీనంగా మారిపోయిన అంజన వదనం చూసి చిన్నబుచ్చుకున్నాడు నీలకాంత్. "నేను కృష్ణను కలుసుకొన్నప్పటికీ నాప్రయత్నం విఫల మౌతుందని భయపడుతున్నావా అంజనా? నేను చెప్పానుకదా? నీ సుఖం కోసం నా సర్వస్వం ధారపోస్తాను. నువ్వు ధైర్యంగా ఉండు మరి!"

అంజన నిర్లిప్తంగా తలెత్తి, "బట్టలు మార్చి కాళ్ళు కడుక్కురండి, వడ్డిస్తున్నా." నని మెల్లగా వెళ్ళిపోయిం దక్కడినుండి.

అంజన అంతర్యంలో ఉన్న దేమిటో బోధపడక ఉస్సురుమన్నాడు నీలకాంత్.

## 8

మరునాడు మధ్యాహ్నం మూడుగంటలకు ఇంటిముందాగిన కారునుండి దిగి లోనికి వస్తున్న జగన్నాధరావును చూసి ఆశ్చర్య పోయింది అంజన.

"బాగున్నావా అమ్మా!"

"ఊం. అనుకోకుండా వచ్చావేం నాన్నా?"

"అవునమ్మా." ఆయన సోఫాలో కూర్చొంటూ "గ్లాసుతో మంచినీళ్లు తెచ్చివ్వు తల్లీ," అన్నాడు.

మంచినీళ్ళు తండ్రికి అందించి నిలబడింది అంజన.

"అల్లుడు లేడూ? కోర్టుకు వెళ్ళాడను కొంటాను."

"అవును."

ఖాళీగ్లాస్ తిరిగి యిచ్చివేస్తూ, గొంతు తగ్గించి, "అల్లుడు నిన్ను ప్రేమగా చూచు కొంటున్నాడా అమ్మా?" అనడిగాడు జగన్నాధరావు.

"ఎందుకలా అడుగుతున్నావు నాన్నా?" నవ్వడానికి ప్రయత్నిస్తూ, "ఎక్కువ చెప్ప డానికి ఏముంది? ఆయన దేవుడు!" అంది నిండుగా.

"మరి మరి..." కాస్సేపు సందేహించి అడిగా డాయన: "కృష్ణసంగతి అతడి కెలా తెలిసింది అంజనా? నిన్ను అక్కడికి వచ్చాడనీ, కృష్ణను గురించి వాకబు చేశాడనీ, తెలిసింది. ఆసంగతి వింటూనే నాగుండె లదిరిపోయా యనుకో. ఆదౌర్భాగ్యుడి సహ వాసం అక్కడితో వదిలింది; నిక్షేపంలాంటి సంబంధం చేశాం; పిల్ల చల్లగా సంసారం చేసుకుంటూంది అనుకొని నిశ్చింతగా ఉన్నాం నేనూ, మీఅమ్మా. ఈసంగతి మీ అమ్మ చెవిని వేసినప్పటినుండీ ఏడుస్తూ కూర్చుం దది — ఇదేమిటా అని."

"అది నీ కెలా తెలిసింది నాన్నా?"

"మోహన్ వాళ్ళ నౌకరు మన గోవిం దుతో చెప్పాడట. వాడి చేతిలో ఓ పది రూపాయలుకూడా పెట్టాడట, కృష్ణ సంగతి తెలుసుకురమ్మని."

"అలాగా?"

"నీకు తెలియదా అంజనా! అత దక్క డికి రావడం?"

"ఉహూం."

"ఇదేనో నీ కాపురం కూ ల్చేట్టుంది తల్లీ! ఊళ్ళో పిల్ల నిచ్చిన మామ ఇల్లు పెట్టుకునీ అతడు పరాయిఇళ్ళల్లో దిగడం, కృష్ణ సంగతి కావలసిరావడం — ఏ దుష్టుడో అతడి చెవిలో ఊదినట్లున్నాడు. లేకపోతే ఎలా తెలుస్తుం దిది?

"నీ పూర్వజీవితానికి ఒకమచ్చ కృష్ణ. తెలిసీతెలియని నీ జీవితాన ఒకనాటి తప్పుకు ప్రత్యక్షసాక్ష్యం వాడు. వాడిని నామరూపా లతో నాశనం చేస్తేగాని నాకు శాంతి ఉండదు. కాని వాడి జాడ తేలడంలేదు. మరొక అనుమానంకూడా ఉంది నాకు. ఆ కృష్ణగాడే ఇలా అంటూ ఓ ఆకాశ రామన్న ఉత్తరం మీ ఆయనకు వ్రాసి పడేశాడేమోనని. నువ్వు తనకు దక్కలే దన్న దుగ్ధతో వాడు ఏమైనా చేయవచ్చు మరి."

ఒకమాటలో తండ్రి ఊహలన్నీ తప్పని తేల్చివేయవచ్చు అంజన. స్వార్థపూరిత మయిన ఆమె స్త్రీ హృదయంలో కృష్ణ నిర్దోషిత్వం నిరూపించే ఊహకు స్థానం లేకపోయింది. కృష్ణమీద తండ్రి కున్న ద్వేషాగ్రహాలను తన అభీష్టసిద్ధికి ఎలా ఉపయోగించుకోనా అని చూస్తున్నది ఆమె. ఒకనాడు ఎవరికైతే తన సర్వస్వం అర్పిం చుకోడానికి సిద్ధపడిందో, అతడే ఈనాడు తన సర్వస్వం కొల్లగొట్టడానికి కారణ మయ్యేట్లున్నాడు. తన సుఖానికి అడ్డు తొలగాలంటే అతడి సర్వనాశనం జర గాల్సిందే.

నిష్ఠురరోషాల్ని అభినయిస్తూ, "అప్ప టికి మీ కసి, పగ చల్లారుతాయా నాన్నా? అత డెక్కడో బ్రతికి ఉండడంకూడా మీ కిష్టంలేదా? ఇద్దరినీ విడదీసి నన్నీయనకి కట్టబెట్టారు. అతడిని దేశాలు పట్టించారు. ఇంకా శాంతిపడలేదా మీ మనసు? అతడి చావునుకూడా కోరుతున్నారా?" అంది అంజన.

కూతురికి ఇంకా కృష్ణమీద ప్రేమ నశించలేదని తెలిసేసరికి కుప్పకూలి పోయాడు జగన్నాధరావు.

"కృష్ణ చచ్చేవరకు మీ కంటికి నిద్రలు రానట్లున్నాయి పాపం! అతనిజాడ తేల లేదని ఎందుకు బాధపడుతారు? తొమ్మిదో తేదీని మన వీధిలోని పరబ్రహ్మంగారింటికి వస్తున్నాడట. ఇంక చూసుకోండి," అనేసీ, అక్కడినుండి చరచరా వెళ్ళిపో యింది అంజన.

తండ్రి విభ్రాంతితో చాలాసేపు రాయిలా కూర్చుండిపోయాడలాగే. 'ఆ సంగతి దీని కెలా తెలిసింది? కొంపదీసి వీళ్ళిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తు న్నాయా యేం? ఉపేక్షించవలసింది కాదిది. ఇది వాడితో కలసి ఏదో కుట్రపన్ని ఇరు కుటుంబాలను సంఘంముందు నవ్వులపాలు చేయకముందే ఆ కృష్ణగాణ్ణి మట్టబెట్టాలి.' ముఖం కందగడ్డలా చేసుకొని ఉద్రిక్తుడై చివాలున లేచివెళ్ళి కారులో కూలబడి స్టార్టు చేశాడు జగన్నాధరావు.

## 9

సాయంత్రం సమయంలో తోటపనివాడు పూలమొక్కలకు నీళ్ళు పోస్తూంటే నిశ్శబ్దంగా చూస్తూ ఇంటిముందు కుర్చీల్లో కూర్చునిఉన్నారు నీలకాంత్, అంజనా. నీలకాంత్‌తో సంభాషణ సాగించాలని అంజన తహతహ లాడినా, నీలకాంత్ సాగనివ్వ డామె కోరికను. చాలా నిర్లి ప్తంగా సంభాషణ త్రెంచివేసి నిశ్శబ్దంగా కూర్చోవడమో, లేచిపోవడమో చేస్తుం టాడు.

క్లబ్బుకు వెళ్ళడానికి మధు పక్క ఇంట్లోనుండి బయటికి వచ్చాడు. "ఏమి టీ మధ్య క్లబ్బు దర్శనం చేయడంలేదు?"

"అవసరంలేదు," అన్నాడు నీలకాంత్.

"ఓహో!" మధు భావగర్వితంగా నవ్వుతూ ఓ కుర్చీలో కూర్చుని, "ఇల్లాలును తెచ్చుకున్న తొలిరోజులు కదూ?" అన్నాడు.

నీలకాంత్ ముఖం పక్కకు తిప్పుకొన్నాడు.


కిటికీలోనుంచి తొంగిచూస్తున్న కమల పెదవులు సన్నగా నవ్వడం కనిపించింది అంజనకు.

"ఏమిటంత ఇదిగా నిశ్శబ్దాన్ని సేవిస్తున్నారు దంపతులు?" ఉషారుగా పలకరించాడు.

"ఏముంది? ఏంలేదు." నవ్వడానికి ప్రయత్నించాడు నీలకాంత్.

సరిగ్గా వాళ్లు కూర్చొన్న గేటుకు ఎదురుగా రోడ్డు కివతల ఒక చిన్న ఇంటి గుమ్మం కనబడుతూంది. ఆ ఇంట్లో, జబ్బుపల్లో, మరెందువల్లో ఉక్కిరిబిక్కిరైన ఒక స్త్రీని ఒక పురుషుడు నిర్దాక్షిణ్యంగా బాది వెళ్ళిపోతున్న దృశ్యం చూసి, "అయ్యో ఎవరువాళ్ళు? ఎందుకలా కొట్టి వెడుతున్నాడతడు?" అని జాలిగా, బాధగా అడిగింది అంజన.

"ప్రేమకోసమై వలలో పడిన, పాపం, పసిది!" హాస్యంగా నిట్టూర్చి తిరిగి చెప్ప సాగాడు మధు. "ఎక్కడో బాగా కలవారి బిడ్డేనట. గుమాస్తాగారి అబ్బాయిని ప్రేమించి అతడితో లేచివచ్చేసి రిజిస్టర్ మారేజీ చేసుకుంది. అతను స్కూలు ఫైనల్ పాస్ అయాడేమోగాని ఉద్యోగం సద్యోగం ఏంలేదు. వెంట తెచ్చుకున్న నగలు, డబ్బు హారతికర్పూరమైపోయాయి. జీవితాలు గడవడం దుర్భరమవడంతో ఆ ప్రేమఘాటు తగ్గి ఈ రూపంగా పరిణమించింది. 'పుట్టింట్లో పువ్వులా పెరిగానే — నిన్ను నమ్ముకొని వచ్చిన నాకీ దుస్థితి ఏమిటి?' అంటూ సాధింపులూ, దెప్పులూ. 'మరి ఎవరు రమ్మన్నారు? నీ తలిదండ్రుల చేతిలో వుండి వాళ్ళు తెచ్చిన సాటిఅయిన సంబంధాన్నే చేసుకొని సుఖపడవలసింది.'




అని అతడి రోషపూరితమైన మాటలూ, తన్నులూ. ప్రేమే సర్వస్వమని గోతిలో పడతారేగాని తర్వాత మరికొన్ని జీవితావసరాలూ, ఆకర్షణా ఆ ప్రేమను బలిగొంటాయని తెలియదీ ప్రేమజీవులకు. అందుకే అలా అనుభవిస్తారు."

నీలకాంత్ నెమ్మదిగా అన్నాడు: "ఆమె ఆ విధంగా తెగించి వచ్చి ప్రేమించినవాణ్ణి పెళ్ళి చేసుకోకపోయినా అన్నివిధాలా తగినవాడని తలిదండ్రులు తెచ్చి చేసే సంబంధం వల్ల ఆమె సుఖపడేదా? ఏ ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా, అందచందాలు కలిగివున్న భర్తను పొందిన స్త్రీ ప్రతిచోటా సుఖపడుతుందంటావా? కురూపినీ, బికారినీ కట్టుకొన్న స్త్రీ విధిగా దుఃఖపడి తీరుతుందా? ఆ అభిప్రాయం కొన్నిచోట్ల తారుమారు అవుతుంది సుమీ!

"ఆమె ప్రేమించి, స్వతంత్రించి పెళ్లాడినందుకు ఈ ఇబ్బందులు పడుతుందనుకొంటున్నాం; సంసారం జరుగనప్పుడు వాళ్ళు కొట్టుకోనీ, తిట్టుకోనీ మరోసారి వాళ్ళు ప్రేమగా ఉండరని చెప్పడానికి వీల్లేదు. మానవ జీవితంలో సంభవించే కష్టసుఖాలకు ఒకే సిద్ధాంతాన్ని చేయలేము. ఎవరు, ఎప్పుడు, ఎందువల్ల ఏ సంఘటనకు గురి అవుతారో ఒక నిర్ణయం ప్రకార చెప్పలేం."

"పోనీండి. ఆ చర్చలో దిగామంటే ఇ తేలం. కాని, ఒక్కటి చెప్పగలను. స్త్రీ అటువంటి స్వాతంత్ర్యం ఉండడం అన దాయకం," అని లేచాడు మధు. "వస్తాను"

ప్రేమ మైకంలో పడి ఆ యువతి తెచ కొన్న దౌర్భాగ్య జీవితాన్ని తలుచుకొ టూంటే అంజన మేను రోమాంచితం కాస గింది భయవిభ్రమాలతో. ఒకనాడు తన అదేపని చేయదలచింది కదూ? ప్రే పర్వతంలాగ ఎదుట నిలబడగా వెను జీవితంలో ఉండే కష్టనిష్ఠూరాలేవీ త కగుపడలేదు. అదొక ఆవేశం. 'ప్రేమకోస అగ్నిలోకి దూకమన్నా దూకుతాను' అన్న వంటి ఉన్మత్తావేశం తగ్గాక తెలుస్తుంది త పొందిన దుర్గతి.

ఒకవేళ కృష్ణనే తను పెళ్ళాడివుంటే ఈ యువతికి పట్టిన గతే తనకూ ప దనడంలో సందేహంలేదు. తల్లిని పోషిం డానికే కటకట పడేవాడు కృష్ణ. మేడ నివశించి, కారుల్లో తిరిగి, పూవుల్లో శ నించిన జీవితం తనది! అతడిని పెళ్ళా

తను పొందే దారిద్ర్యంకూడా తమ ప్రేమలనిలాగే తుడిచిపెట్టేసి బ్రతుకులు దుర్భరం చేసేవేమో! అని ఆలోచిస్తుంటే అలాంటి పరవస్థనుండి బలవంతాన తప్పించిన తల్లిదండ్రులకు మనసారా కృతజ్ఞతలు చెప్పుకొంది అంజన.

* * *

"రేపు తొమ్మిది. ఉదయము టిఫిన్ చేసుకొని ఇక్కడినుండి బయల్దేరుదా మనుకొంటున్నాను." ఒకనాటి సాయంసమయంలో తను పేపరు చూస్తుండగా అక్కడికి వచ్చి కూర్చున్న అంజనతో అన్నాడు నీలకాంత్.

కళ్ళు ఒక విధంగా చిట్లించి కణతలు నొక్కుకుంటూ కూర్చుంది అంజన.

రాత్రి భోజనా లయ్యాయి. ఏదో పుస్తకం చదువుకొంటూ పడకగదిలో పడుకొని వున్నాడు నీలకాంత్. నౌకరు కంగారు కంగారుగా వచ్చి, "అమ్మగారికి చలెత్తుకొస్తున్నాది బాబూ! వణికి పోతూంది. చలిజ్వర మేమో!" అన్నాడు.

నీలకాంత్ పుస్తకం పక్కమీద పడేసి, చటుక్కున లేచి అంజన గదిలోకి వెళ్ళాడు. 'ఉహుఁహుఁ,' అని చలితో వణికిపోతూ ఎగిరిఎగిరి పడుతూంది అంజన, నిండా దుప్పటి బిగించికూడా.

"ఏమిటి అంజనా! ఇందాక బాగానే వున్నావే?"

"ఉహుఁహుఁ..." మరింతగా వణికిపోతూ "మరో దుప్పటిలా తెచ్చి కప్పండి. చలి చలి!" అంది అంజన.

"నా పక్కమీది రగ్గు యిలా తీసుకురా రాఘవా!" చెప్పాడు నీలకాంత్.

నీలకాంత్ పడక గదిలోనుండి రగ్గు తీసుకువచ్చి అతడికి అందివ్వబోయాడు రాఘవులు.

"నువ్వే ఇలా కప్పు!"

"నేనా ... బాబూ? నేనా ... మీరు కప్పండి." సంకోచించాడు రాఘవులు.

అంజన పాదాలనుండి మెడవరకు రగ్గు కప్పాడు నీలకాంత్. అంజనకు యింకా స్త ఎక్కువే అయింది చలి. అదేదో వాతం వచ్చినదానిలా పక్కమీద ఎగిరిఎగిరి పడుతూంది. కిటికీలన్నీ మూయించి ఒక తలుపు చక్క మాత్రం తెరిపించాడు నీలకాంత్.

"అది ఒంట్లో పుడుతున్న చలి. పైన ఎన్ని కప్పితే ఏం లాభం బాబూ? కొంచెం ఆ పక్క లిలా అదిమిపట్టి కూర్చోండి!" సలహా యిచ్చాడు రాఘవులు.

"ఆఁ ... నేనా ... నేనా? అబ్బే ..." సణుక్కున్నాడు నీలకాంత్. ఎటూ తోచింది కాదు. గబగబా టెలిఫోన్ ఉన్న గదిలోకి వెళ్ళి డాక్టరుకు ఫోన్ చేసి వచ్చాడు. అంజన అలాగే చలితో వణికిపోతూఉంది.

"ఆ పక్క లిలా అదిమిపట్టి దగ్గరగా కూర్చోండి బాబూ!"

ఇక తప్పలేదు నీలకాంత్కు. ఆమె పక్కమీద కూర్చున్నాడేకాని నాగసర్పంపై కూర్చొన్నంత జంకుగా ఉందతనికి. ఇక ఆమె మీద చేతులు వేయాలంటే — అంజన కేమోగాని, అతని ఒంట్లోనే వణు కెత్తుకొస్తుంది.

"ఎందుకంత కంగారు పడతారు బాబుగారూ? అదేదో చలిజ్వర మే అయుంటుంది. డాక్టరు వచ్చి చూస్తాడు కదా!" రాఘవులు ధైర్యం చెప్పాడు.

డాక్టరు వచ్చాడు. "ఏమిటి, మిసెస్కు?"

"రెండు రగ్గులు కప్పినా చలిచలి అని వణికిపోతూంది చూడండి, డాక్టర్!"

కప్పినవి రెండూ తొలగించి అంజన చేయిపట్టి చూశాడు డాక్టరు. చెమటపట్టి ఒళ్ళంతా చల్లగా వుంది. "చెమటలుకూడా పోస్తున్నట్లున్నాయే!" డాక్టరు నుదురు చిట్లించాడు. బాగ్లోనుండి ఏదో ఇంజక్షను తీసి యిచ్చాడు. "సరే నేను తిరిగి ఉదయం వచ్చి చూస్తాను," అని చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు.

అర్థరాత్రి ఎప్పుడో మెలుకువవచ్చి చూసిన అంజనకు ఆ గదిలోనే కిటికీచెంత ఈజీచెయిర్లో పడుకొనున్న భర్త కనిపించాడు. ఎదమీద పుస్తకం పెట్టుకొని, దానిమీద ఓ చేయి వేసి, మరోచేయి తలమీద పెట్టుకొని విశాలఫాలంపైకి చెదిరిన ఉంగరాలజుట్టు, గాఢనిద్రలో వాలిపోయిన వెడద కన్నులు, ట్యూబ్లైటు కాంతిలో రెట్టింపు అందంతో అగుపడుతోన్న పసిమిఛ్ఛాయ మేను — ముఖం కొంచెం పక్కకు పెట్టి పడుకొన్న నీలకాంత్ను చూస్తుంటే అంజన మనసు జాలితోనూ, మోహంతోనూ నిండిపోయింది. తన పక్కమీది తలగడా తీసుకువచ్చి నెమ్మదిగా అతడి తలక్రింద పెట్టింది, అతడికి నిద్రాభంగం కలుగకుండా. మెల్లగా పుస్తకంమీదినుండి చేయి తొలగించి ఎదమీదనుండి పుస్తకం తీసింది.

'బ్రహ్మచర్యం!'

కొట్టొచ్చినట్లు కనిపించాయి పుస్తకం మీది అక్షరాలు. వారం పదిరోజులక్రింద చూసిం దతడిచేతులో రాజయోగం. ఏవో వేదాంత గ్రంథాలు అతడిగదిలో టేబిల్ మీద కుప్పలు కుప్పలుగా పడివుంటాయి. తెల్లవారుజామునే లేచి, సుచిగా స్నానం చేసి పూజాగది అని ఏర్పాటు చేసుకొన్న గదిలోకి వెళ్ళిపోయి లోపల తలుపులు బిగించుకొంటాడు. తిరిగి ఎనిమిదింటికి అతడు యివతలికి రావడరి. లోపల అతడు ఏం సాధనలు చేసేదీ, ఏం పూజలు చేసేదీ తెలియదు.

పూర్వజన్మ సంస్కారంవల్ల అబ్బిన వేదాంతం; ఆసక్తి కుతూహలాలతో అలవరించుకొనే వేదాంతం మనిషికి సుఖ మివ్వవచ్చు కాని, దుఃఖాలనుండి, ఆవేదనలనుండి తప్పించుకోడానికి వేదాంతాన్ని శరణు కోరితే, అది ఒకపర్వతమంత భారమై మనిషిని పాతాళానికి అణగద్రొక్కుతుంది.

తనొకనాడు అజ్ఞానావేశంతో చేసిన పనికి అతడు పొందుతున్న శిక్షకూ అంజన హృదయం ఆర్ద్రమైంది. కళ్ళనుండి అశ్రువులు జలజల రాలుతుండగా, పుస్తకాన్ని అలాగే పట్టుకొని భర్తపాదాలకడ నిశ్శబ్దంగా కూర్చొంది చాలాసేపు. ఆ వ్యక్తి ఎంతో

ఉన్నతంగానూ. ఆ పాదా లెంతో పవిత్రంగానూ కనిపించాయి. భక్తితో భర్త పాదాలను కన్నుల కద్దుకొంది అంజన. ఎన్ని నాటకాలు ఆడవలసివచ్చినా, ఎవరికి ఎటువంటి ద్రోహం చేయవలసివచ్చినా ఈ ప్రవిమలహృదయుని పవిత్రపాదాల సన్నిధిలోని స్వర్గాన్ని వదులుకోదు తను!

ఉషారేఖలు తూర్పుదిక్కు కిటికీనుండి చొచ్చుకొని వస్తూ గదిలోని విద్యుద్దీప కిరణాలను వెలవెలపోజేస్తూ తెల్లవారిందంటూ మెల్లగా తట్టిలేపాయి నీలకాంత్‌ను. కళ్ళు రెపరెపలాడించి, నిద్రమత్తు విదిలించికొని లేవబోయాడు. పాదాలమీద బరువుగా తోచి క్రిందికి చూసి ఉలికిపడ్డాడు_తన పాదాల మీద చెంపపెట్టి పడుకొన్నది అంజన!

"అంజనా!' విస్మయంగానూ, కలవరంగానూ పిలిచాడు నీలకాంత్.

"ఆఁ;'' మేలుకొని తడబాటుతో లేచి నిల్చుంది అంజన.

స్నానం టిఫిన్ ముగించి గరేజినుండి కారు బయటికి తీయమని డ్రైవరుకు చెప్పి, అంజన గదిలోకి వచ్చాడు నీలకాంత్: ''నేను వెడుతున్నాను! అంజనా''

''ఎక్కడికి?''

"ఎక్కడి కేమిటి? కృష్ణాపూర్‌కు.''

"నన్ను విడిచిపెట్టి మీ రిప్పుడు ఎక్కడికీ వెళ్ళవద్దు.''


"వెళ్ళకపోతే ఎలా అంజనా? మళ్ళీ కృష్ణను చిక్కించుకోవడం ఎలాగ?''

''అతడు చిక్కకపోతే పెద్ద కొంప మునిగేది ఏం లేదులెండి.''

''అలా అంటే ఎలా చెప్పు? ఈ క్షణిక విగ్రహం అనర్థదాయకమని చెప్పానుకదా? నిం వ్వేమన్నా, అతడు లేకపోతే నువ్వు జీవించలేవని తెలుసు నాకు.''

''మీ కెలా తెలుసు? అతడిమీద నేనేం పడిచావడంలేదు.''

''దబాయించకుమరి_ఒకనాడు నీ నోటినుండే విన్నా నా మాట.''




''ఏమైనా మీరు వెళ్ళొద్దు. నాకు ఎలాగో అవుతూంది.''

''నేను వెళ్ళక తప్పదు. రాత్రివరకు తిరిగివస్తాగ? ఈలోగా డాక్టరు వచ్చి చూస్తాడు. ఇప్పుడే ఫోనుకూడా చేశానాయనకు.''

''అహఁ, మీరు వెళ్ళడానికి వీల్లేదు. నేను ఒట్టేస్తున్నాను.''

నీలకాంత్ మంచం దగ్గర స్టూల్‌మీద కూర్చొన్నాడు ఉస్సురంటూ. ''అబ్బా! ఎలా చెప్పు అంజనా, యిలా పట్టుబట్టి కూర్చొంటే? వెళ్ళకపోతే పని చెడిపోతుందే!'' అన్నాడు కొద్దిగా విసుక్కుంటూ. ''ఒంట్లో ఎలా అవుతోంది? చాలా బాధగా ఉందా?'' అడిగాడు తిరిగి లాలనగా.

''ఊఁ, కడుపులో ఏమిటో గుబులుగుబులుగా ఉంది. మీరు నన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళొద్దివాళ. నా దగ్గరే కూర్చోవాలి,'' అన్నది గోముగా, హఠంగా.

''అలాగే కూర్చుంటాలే. మరిక నిశ్చింతగా, ప్రశాంతితో పడుకో;'' అన్నాడే గాని ఈ రోజు కృష్ణను కలుసుకొనే అవకాశం పోగొట్టుకొంటే తిరిగి అతడిని పట్టుకోవడము అసంభవ మౌతుందని భయపడ్డాడు. 'అంజన నా దగ్గరనుండి ఒకనాడు వెళ్ళిపోవలసిందే. ఎన్నాళ్ళని దగ్గరుంచుకోను? ఉంచుకొన్నకొద్దీ ఈ అనుబంధం దృఢమై ఛేదింపరానిదైతే మరిక ఉపాయ ముండదు.'

పదిలోగానే డాక్టరు వచ్చాడు.

''మీరు మరొకసారి సాయంత్రం రావాలి డాక్టర్!'' అన్నాడు నీలకాంత్.

''అలాగే కానీ, పెద్ద భయపడే దేమీ లేదు. మిస్టర్ నీలకాంత్! సుస్తీ రాత్రికల్లా తగ్గిపోతుంది,'' అన్నా డాయన.

డాక్టరువంక గుర్రుమని చూసింది అంజన.

డాక్టరు అటు వెళ్ళిపోతూనే నీలకాంత్ చెల్లెలు సుధ, భర్తతో దిగింది. పుట్టింటికి వెడుతూ రెండురోజులు అన్న వదినల దగ్గర ఉండి వెడదామని వచ్చిం దామె.

భోజనా లయ్యాక అంజన గదిలోకి వచ్చాడు నీలకాంత్. ''సుధ ఉంటుందిగా అంజనా? నేను వెళ్ళనా? ఎలాటి పరిస్థితి ఉన్నా రాత్రివరకు తిరిగి వచ్చేస్తాను,'' అన్నాడు ప్రాధేయపడుతున్నట్లు.

మాట్లాడలేదు అంజన. సుధ దగ్గిరే ఉండడంవల్ల అతడి నేవిధంగానూ అడ్డుపెట్టలేకపోయింది. ''మీ ఇష్టం,'' అని మాత్రం అంది, కొంచెం కోపం, కొంచెం గాంభీర్యం మేళవించిన స్వరంతో.

''నీ అదృష్టం బాగుండి పరిస్థితులు అనుకూలిస్తే నీ కృష్ణను వెంటబెట్టుకొనే వస్తాను సుమీ!'' అని చెప్పి వెళ్ళిపోయాడు నీలకాంత్.

''వెంటబెట్టుకురావూ? కృష్ణ సమాచారము మా నాన్న చెవిలో వేసినప్పుడే అతడి ప్రాణాలు 'మా నాన్న చేతిలోకి వచ్చాయి. ఆయన గుప్పిటనుండి తప్పించుకొని బతికి బయటపడితే కదా నువ్వు వెంటబెట్టుకు వచ్చేది? వెళ్ళు వెళ్ళు!'' కసిగా అనుకొంది అంజన. 'ఆ పిరికిపంద తిరిగి నా దగ్గరికి వచ్చినా, నా గడపలో అడుగు పెట్టనిస్తానా? హుం'

## 10

మధ్యాహ్నం మూడుగంటలకు కృష్ణాపూర్‌లోని మోహన్ ఇల్లు చేరుకున్నాడు నీలకాంత్. వెళ్తూనే ఆలస్యం చేయకుండా మోహన్ నౌకరును పరబ్రహ్మం ఇంటికి పంపించాడు - కృష్ణ వచ్చాడేమో చూసి రమ్మని.

నౌకరు వెళ్ళివచ్చి ''వచ్చాడండీ. కృష్ణా, పరబ్రహ్మంగారూ ఉన్నారు. ఏవో పత్రాలు రాసుకొంటున్నారు, సాక్షుల్ని కూర్చోబెట్టుకొని,'' అని చెప్పాడు.

''నువ్వు కాస్త వెళ్ళి అక్కడే వుండు. అతడిపని అయిపోయి బయటికి వస్తూనే మీ స్నేహితుడు పిలుస్తున్నాడు రమ్మని చెప్పి ఇక్కడికి తీసుకురా,'' అని చెప్పి తిరిగి పంపాడు అతడిని నీలకాంత్.

రెండుగంటల తర్వాత ముఖం చిన్నబుచ్చుకొని వచ్చాడు నౌకరు. ''ఆయన బయటికి వస్తూనే దగ్గరికి వెళ్ళి మీరు చెప్పినట్టు చెప్పి వెంటబెట్టుకు వద్దామని పక్కింటి ముందు కూర్చొన్నానండీ. ఎంతకీ రాకపోతే ఇంట్లోకి వెళ్ళి చూశాను. అప్పటికే ఆయన వెళ్ళిపోయాడు. పరబ్రహ్మంగారిని అడిగితే 'పావుగంట అయింది అతడు వెళ్ళిపోయి. జగన్నాధరావుగారికేమో అతడు కొంత బాకీ ఉన్నాడట. వాళ్ళింటివాళ్ళ కళ్ళలో బడితే డబ్బువసూలు చేయడానికి పట్టుకొంటారు నన్ను-అనిచెప్పి పెరటి గుమ్మంనుండి వెళ్ళిపోయాడు' అని చెప్పారండీ. ఆయన అలా దొంగముఖం పెట్టేది నా కేం తెలుసండీ? లేకుంటే ఎదురగ్గావుండి పట్టుకొచ్చేవాడిని.''

'అరే, భగవాన్! ఇప్పుడెలా పట్టుకోవడం?' అంతులేని విచారంలో మునిగిపోయాడు నీలకాంత్. ''అతడు ఎక్కడికి వెళ్తున్నాడనైనా కనుక్కున్నావా?''

''అడిగానండీ. ఒక స్నేహితుడిని కలుసుకొని రాత్రిబండికి వెళ్తున్నా నని చెప్పాడటండీ.''

వాడినే, కృష్ణ రూపురేఖలూ, అతడు వేసుకొన్న దుస్తులూ అడిగి తెలుసుకొని, కారు తీసుకొని బయల్దేరాడు నీలకాంత్. తిరిగిన రోడ్లే తిరుగుతూ, తనకు కావలసిన ముఖంకోసం ఆశగా వెదుకసాగాడు. రాత్రి అయింది. ఇక మిగిలిన ఆశ స్టేషన్‌లో కనబడతాడేమోనని-రాత్రి పదకొండు గంటలకు ఉంది బండి.

హోటల్లో భోజనం చేసి తొమ్మిది తరువాత తిరిగి బయల్దేరాడు నీలకాంత్, స్టేషన్ వైపు. ఊరికి రెండుమైళ్ళ దూరంలో ఉంది స్టేషన్. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. రోడ్డు కిరుప్రక్కలా చెట్టు పుట్టలతో అడవిలా ఉంది. రోడ్డుమీద ఎలక్ట్రిక్ దీపాలున్నా అట్టే వెలుతురు లేదు.

కారు మెల్లగానడుపుతున్నాడు నీలకాంత్. రోడ్డుకు ఓ ప్రక్క ఓ చెట్టుగుబురుచాటున మూడు నీడలు అగుపడ్డాయి. హఠాత్తుగా చూస్తే దెబ్బలాడుకొంటున్నట్లు కనిపిస్తూంది. నీలకాంత్ కారు ఆపి కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా పరికించాడు. తనది భ్రమేమీ కాదు. ఆ చెట్ల నీడలో ఎవరినో కూనీ చేస్తున్నారు! ముందు వెనకలు ఆలోచించకుండా ఆవేశంగా కారునుండి దిగి ఉరికాడు అక్కడికి. ఓ వ్యక్తిని క్రిందపడేసి ఒకడు గుండెలమీద కూర్చున్నాడు. మరొకడు ఓ పెద్దగుండు ఎత్తి నేలమీద పడివున్న వ్యక్తికేసి వస్తున్నాడు. రెప్పపాటులో ఆ వ్యక్తి వక్షంమీద ఎగ్గిరి తన్నాడు నీలకాంత్. అతడూ, అతడి చేతుల్లోని గుండూ అంత దూరంలో వెళ్ళి పడ్డాయి. ఈ హఠాత్సంఘటనకు హడలిపోయి క్రింద పడివున్నతడి మీద కూర్చొన్నవాడు అతడిని వదిలి పరుగు పుచ్చుకొన్నాడు. నీలకాంత్‌చే తన్నులు తిన్నవాడుకూడా ముందువాణ్ణి అనుసరించాడు.

క్రిందపడివున్నతడు ఒళ్ళు దులుపుకొని లేచాడు. ''ఆ కిరాతకులచేతిలో నా ప్రాణాలీపాటికి పరలోకానికి పయనం కట్టేవి. సమయానికి దేవుడిలా వచ్చి అడ్డుపడ్డారు.''

అతడి చేయిపట్టి కారు లైట్ల వెలుతురులోకి తీసుకువచ్చాడు నీలకాంత్. పాపం ఒళ్ళంతా గాయాలై రక్తాలు కారుతున్నాయి. ''ఎలా జరిగింది యిది?''

''స్టేషన్‌కు వెడుతున్నాను. ఆ ఇద్దరు దుర్మార్గులు వచ్చి ఆ చెట్లచాటుకు ఈడ్చుకుపోయి, నన్ను హత్య చేయడానికి పూనుకున్నారు. త్రాగుడుమత్తులో ఆ వెధవలు కూసినదాన్ని బట్టి తెలిసింది-జగన్నాధరావుగాడు పంపగా వచ్చినవాళ్ళని. వాడి భయానికి వాడి బిడ్డమీద ఆశకూడా వదలుకొని దూరదేశాలకు పారిపోయాను. అయినా పామువగ బట్టాడు. నా అంతం చూడందే వాడికి నిద్ర పట్టనట్లుంది-దుర్మార్గుడు!'' పళ్ళు కొరికాడతడు.

వెదకబోయిన తీగ కాలికి తగిలిందన్న ఆనందంతో, ''మీ పేరు కృష్ణకదూ?'' అన్నాడు నీలకాంత్ ఉత్సాహంగా.

''అరే! మీ కెలా తెలుసు?'' ఆశ్చర్య పట్టలేకపోయా డతడు.

''మీరు నాకు తెలుసు. నేను వస్తున్న మిమ్మల్ని వెదుకుతూనే.'' డోర్‌మీద చేయి వేసి. ''ఎక్కండి. హాస్పిటల్‌కు వెళ్ళి గాయలకు మందు వేయించుకొందురు.'' అన్నాడు

''ఏమిటి? నాకోసమా? నేను మీ కెల తెలుసు?''

''అంజనవల్ల మీరు నాకు తెలుసు!'' అన్నాడు గంభీరంగా.

ఉలిక్కిపడ్డా డతడు. ''మీరు... మీరు.. అంజనభర్తా?''

''అవును. కంగారు దేనికి?''

కారులో ఎక్కబోయినవాడు చటుక్కున వెనుదిరిగి చెట్లు పుట్టల్లోకి పరుగు పుచ్చుకున్నాడు కృష్ణ.

నీలకాంత్ సీటునుండి గభాలున దూకి, అతడి వెనుకపడ్డాడు. 'మిస్టర్! ఇది విను! నీకు మిత్రుణ్ణికాని శత్రువుకాను!''

''మోసం! అంతా మోసం!'' ఆగలేదతడు.

చీకటిలో, తొందరలో అడుగులు వేయడంవల్ల ఓ రేగుకంపలో పడ్డాడు నీలకాంత్. పైజామాకు దానిముళ్ళు గుచ్చుకుపోయి అడుగు ముందుకు వేయనీయలేదతడిని. ముళ్ళకంప విడిపించుకొనేసరికి అయిదు నిమిషాలు ఆలస్యమైంది.

కృష్ణ తప్పించుకొని వెళ్ళిపోయాడు.

ఉస్సురంటూ తిరిగివచ్చి కారులో కూలబడ్డాడు నీలకాంత్. 'అంజన ఎదుటికి ఏ ముఖం పెట్టుకొని వెళ్ళను? కృష్ణను తీసుకువస్తానని చెత్తే బింకంగా పైకి వద్దనిచెప్పినా మనసులో అతడి ఆగమనాన్ని కాంక్షిస్తూ, నిరీక్షిస్తూ ఉండదూ? ఈ సంఘటన అంజన మనసులో అపార్థాన్ని కల్పించదూ? మనసులో ఆమెపై లోభ ముంచుకొని నేనిలా నాటకమాడుతున్నా ననుకొంటే నాకు విముక్తి ఏది?' ఎంతగానో మథనపడ్డాడు.

. పన్నెండు గంటల రాత్రివేళ ఇంటికి వచ్చిన నీలకాంత్ నిశ్శబ్దంగా తన గదిలోకి వెళ్ళిపోయిన సంగతి నౌకరువల్ల తెలి కొన్న అంజనకు పర్వతమేదో ఎవమీ తొలిగిపోయినట్లు తేలికపడింది. నీలకాం కృష్ణను వెంటబెట్టుకు వస్తాడేమో_ఆ పి వాడి ముఖాన్ని చూడడంకన్న గొం పిసుక్కొని చావడం మేలనుకొంది. దురదృ వశాత్తూ అత డొచ్చినా అతడి నేవిధ అవమానించి పంపాలా అని ఆలోచి ఉండిం దామె. నీలకాంత్ ఒంటరిగా రావ ఆమె ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టబడిం



వెళ్ళినపని ఏమైందో తెలుకోవాలన్న తూహలం అంజనకు లేకపోయినా, మరు డు ఉదయం జరిగినసంగతి యావత్తూ వరంగా తెలిపాడు నీలకాంత్; చిక్కిన వకాశం జారవిడుచుకు వచ్చాననన్న వారం వ్యక్తపరుస్తూ.

అంజన కొంచెం కటువుగా "అసలు మ్మ ల్నెవరు వెళ్ళమన్నారు ? వద్దనే ప్పానుకదా ?'' అంది.

ఆమె ఏదో మనసులో పెట్టుకొని నిష్ఠుర ాడుతున్నట్లుగా తోచింది నీలకాంత్‌కు. న్న అపార్థం చేసుకోకు అంజనా. నే నీ షయంలో నిష్కల్మషంగా ప్రయత్నిస్తు న్నను. దైవమే నీ అదృష్టాన్ని చెరుపు ంటే ఇక నన్నేం చేయమంటావ్ ?" నేసి గబగబా వెళ్ళిపోయా డక్కడినుండి.

## 11

''చెల్లాయ్! సుధా! కాస్త సూది పట్టు ని యిలా రా అమ్మా!'' గదిలోనుండి కేశాడు నీలకాంత్.

ఏవైనా ఊడిన గుండీలూ, బొత్తాములూ ్టాలేమోనని ఒకసారే సూదిలో దారం ్కించుకొనే వచ్చింది సుధ. "ఏం చెయ్యా న్నయ్యా ?''

నీలకాంత్ కుడిచెయ్యి చాచి, "బొటన లి చివురులో ముల్లు గుచ్చుకుందమ్మా! ప్పి చెయ్యకుండా తీయి,'' అన్నాడు.

"అరే! ఈ ముల్లెలా గుచ్చుకొన్న న్నయ్యా ?" ఆశ్చర్యపోయింది సుధ.

చటుక్కున ఓ అబద్ధం చెప్పేశాడు నీల ంత్. "గులాబీకొమ్మ ఒకటి ఎండిపోతే చేయబోయాను. పొరపాటున ముల్లు చ్చుకుంది."

అన్నగారి చెయ్యందుకొని సూదిమొనతో ల్లున్నచోట కెలకబోయింది సుధ.

"అబ్బా! మెల్లిగా! నొప్పి పుడుతూంది."

అంజన గదిగుమ్మంలోకి వచ్చి విలబడ చూసి "రా! వదినా, అన్నయ్యకు ముల్లు చ్చుకొన్నది. నే నెంత మెల్లిగా తీసినా బ్బా అంటున్నాడు. నువ్వు తీద్దువుగాని రా; ఎంత సుతారంగా తీస్తావో! పొర పాటున సూది లోపలికి గుచ్చినా పెళ్ళామే కనుక నొప్పి వేయదనుకొంటా!'' అంది సుధ నవ్వుతూ.

అంజన సుధదగ్గరికివచ్చి సూది అందుకో బోంతూ౦టే, చటుక్కున నీలకాంత్ అందు కొని లేస్తూ, "ఎందుకులే! నేనే మెల్లి మెల్లిగా తీసుకొంటాను," అని వెళ్ళిపో యాడు. అంజన ముఖం ముడుచుకొని అక్కడినుండి వెళ్ళిపోయింది.

సుధ తండ్రికి ఉత్తరం వ్రాసింది–తను వచ్చి అన్నదగ్గర ఉన్నాననీ, వచ్చి తీసుకు పొమ్మనీ. ఆయన రావడానికి వారం రోజులు ఆలస్యమైంది.

సుధ ఇక్కడుండడం అంజనకు ఉత్సాహకారణమైనా నీలకాంత్‌కు యిబ్బం టంగా ఉంది. అన్నా వదినల్ని వేళాకోళం చేస్తూ, పరిహాసా లాడుతూ ఉండనిది క్షణం తోచదు సుధకు. ఏమైనా సుధ పసి కట్టేసింది – అన్నా వదినలమధ్య అన్యోన్యత లోపించిందని. అనురాగదాంపత్యంలోని మాధుర్యాన్ని సంపూర్తిగా పొందిన సుధ, అన్న సంసార మిలా రసవిహీనం కావడం చూసి బాధపడింది. తన భర్త ఆఫీసువేళల్లో, గ్రామాంతరం వెళ్ళితే తప్ప ఒక్కక్షణం విడిచి వుండలేడు తనను. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ, కబుర్లు చెబుతూ కొంగుపట్టుకు తిరుగుతాడు. ఈ నూతన దంపతులు దూరదూరంగా ఉండడం, మాట్లాడే రెండుమాటలు పొడి పొడిగా ఉండడం చూసి ముక్కుమీద వేలుంచుకుంది సుధ. ఒకరోజు ఈమాటే అంటే "అంద రికీ నీ కున్న అదృష్టమే వుంటుందా సుధా ?" అంది అంజన, కళ్ళనిండా అశ్రు వులు నింపుకొని, ఎదలోని వేదనాజ్వాల కేమో నన్నట్లు అధరాలు కంపిస్తూండగా.

ఈ మాట వింటూనే సుధ పెదవి కొరుక్కొని, ఏదో గతవిషయం స్ఫుర ణకు వచ్చినట్లుగా "ఛీ ఛీ! అన్నయ్య యిలాంటివా డనుకోలేదు. ఆవిణ్ణి యింకా మరిచిపోలేదన్నమాట. ఆమెను మనసులో నుండి తొలగించి, భార్యను అనురాగంతో ఏలుకోలేనివాడు అమ్మా నాన్నా మాటకు కట్టుబడి వుంటానని చెప్పి మరొక పిల్ల గొంతు కోశా డెందుకు ?" అంది కోపంగా.

గుండెలు టకటకా కొట్టుకొన్నాయి అంజనకు. "నువ్వన్నది ఏమిటి సుధా ? అన్నయ్య ఎవరిని ప్రేమించాడు ?"

ఒక క్షణం సంకోచించి అన్నది సుధ: "నేను చెప్పే విషయం మీ మధ్య యింకా దూరాన్ని పెంచుతుందేమో! అలా కానివ్వ నని మాటివ్వు వదినా! అన్ని విషయాలూ నీకు తెలిసిఉంటే అన్నయ్య మనసు నీ వైపు మరల్చుకోడానికి వీలుంటుందని ఆశిస్తూ – చెప్పకూడనిదే అయినా – బయట పెడుతున్నాను."

"అలాగే చెప్పు!"

"అన్నయ్య లా చదివేప్పుడు, పవన అనే అమ్మాయి ఇతడి క్లాస్‌మేట్. ఇద్దరూ ప్రేమించుకొన్నారు. కులాంతర వివాహ మౌతుందని, అమ్మా నాన్నా యిష్టపడరని ఆమెను వదులుకొన్నాడు."

"అలాగా ? ఆమె ఎక్కడుంటుంది ?"

"ఇక్కడే ఉంటుంది! అయితే ఆమె ఎప్పుడూ రాలేదా ఇక్కడికి ?"

"రాలేదు."

''చెబుతున్నాను విను వదినా. స్త్రీ యుక్తికి లొంగిపోని పురుషు డుండడు. ముఖ్యంగా సౌందర్యవతి అయిన స్త్రీ ఆకర్షణనుండి తప్పించుకోగలవాడు అరుదు. నీ దగ్గర యింత అందం పెట్టుకొని నువ్వీ వియోగం అనుభవించడ మేమిటి వదినా ? అతడు కొంచెం నీవా డయ్యేవరకూ వేషం కట్టరాదూ ?" అని నవ్వింది సుధ. ''అత డిలాంటివాడని నువ్వా బెట్టుకుపోతే మీ కాపురం అతుకుపడే దెలా ? అతడు నీ వశమయ్యేవరకు నీ స్వాభిమానం కొంచెం పక్కకు పెట్టు."

త మిద్దరి అన్యోన్యత లోపించడానికి సుధ ఊహకు తడుతున్న పరిస్థితి వేరు.

తను చేజేతులా చేసుకొన్నది సుధ సలహావల్ల ఎలా సరిదిద్దబడుతుంది? అతడు ఇంకా పవనను ప్రేమిస్తూనే ఉండవచ్చు. అపారమైన అతడి నిర్మలప్రేమ పొందడానికి సర్వాధికారం కలిగిఉండీ, మూర్ఖంగా చేజారవిడచుకొన్న తనకంటే ఆమే అదృష్టవంతురాలు. ఏనాటికైనా తన జీవితంలో ఈ దౌర్భాగ్యపుచాయలు తొలగిపోయి అదృష్టపురేఖలు ప్రసరించగలవా?

* * *

"రాత్రి నన్ను తిట్టుకొంటావేమో వదినా — అన్నయ్య కౌగిలిలో పూవులా నలిగిపోతూ? ఈ సింగారమంతా చేసి..." ఇక మాట్లాడలేకపోయింది సుధ కిలకిలా నవ్వేస్తూ.

చక్కగా కొప్పు మలిచి, దాని చుట్టూ మల్లెమాల చుట్టి, కొప్పుమధ్యలో సిగబిళ్ళ తిప్పి, శిరోజాలంకరణ గావిస్తున్న ఆడబడుచు ప్రతిబింబాన్ని ముందున్న అద్దంలో చూస్తూ, సిగ్గు సిగ్గుగా నవ్వింది అంజన. "నువ్విలా మాట్లాడావంటే నేనసలు మీ అన్నయ్యదగ్గరికే వెళ్ళను చూడు!" బుంగమూతి పెట్టింది.

"వెళ్ళవూ? చ్చొ చ్చొ చ్చో! ఈ రాత్రి ఈ అలంకరణ అంతా నిష్ప్రయోజనమే!" హాస్యంగా నిట్టూర్చింది సుధ. "నువ్వు అన్నయ్యను ఇంత అన్యాయం చేస్తావంటే నే నూరుకొంటానా? రెక్క పుచ్చుకువెళ్ళి అన్నయ్య చేతుల్లో వదిలిరానూ?"

'నిజంగా నువ్వా పని చేయగలిగితే నీ వదినకు ఎంత ఉపకారం చేసినదానవౌతావు సుధా?' అనుకొంది అంజన.

తెల్లని సిల్కుచీర, తెల్లని జాకెట్టులో ధవళవస్త్రధారిణి అయిన దేవకన్యలా మెరిసిపోతూ మెల్లని అడుగులువేస్తూ నీలకాంత్ పడకగదిలో అడుగుపెట్టింది అంజన.

నీలకాంత్ దిండును కౌగలించుకొని బోర్లా పడుకొనిఉన్నాడు మంచంమీద, గోడకు చెంప పెట్టి. మల్లెల పరిమళమూ, గాజుల గలగలలూ మృదువుగా పలుకరించగా తల తిప్పాడిటు నీలకాంత్; మెరుపు కొట్టినట్లుగా ముఖం తిప్పేసుకున్నాడు.

అతడి ముఖభంగిమలు గమనించిన అంజన మనసు చివుక్కు మనగా, ఈ రాత్రి నిరాశ తప్ప దనుకొంది.

చాలా సేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

అంజన ఆశగా నిరీక్షిస్తూవుంది. తిరిగి మరొక్కమారు అతడు తనకేసి చూడగలిగితే, కంటి కొసలనుండి వలపు తూపులకు బాగా పదునుపెట్టి అతని ఎదలోకి సూటిగా గుచ్చాలని.

నీలకాంత్ ముఖ మిటు తిప్పకుండానే నెమ్మదిగా అన్నాడు: "సుధ ఇక్కడుండడంవల్ల నీకు యిబ్బంది కలుగుతూంది కదూ?"

"యిబ్బం దేం వచ్చింది?"

"ఇబ్బంది కాదూ? నిన్నిలా బొమ్మలా అలంకారం చేసి, అన్నయ్య గదిలోకి పంపి, బయట గొళ్ళెం పెట్టి..."


ఒక లజ్జాతరంగం ముఖమండలంలో వ్యాపించగా రక్తిమ దాల్చిన ముఖాన్ని అవనతం చేసింది అంజన.

"మరొకరాత్రి నీకీ చెర తప్పలేదు. ఊఁ, యివి తీసుకొని వేసుకో." ఆ మెరుపుతీగవంక చూస్తే కళ్ళెక్కడ మూసుకుపోతాయో నన్నట్లుగా ముఖం
కుండానే తన పక్కమీది బట్టలు తీసి
వేసి, తిరిగి యధాప్రకారం దిండును
లించుకొని గోడకేసి చూస్తూ పడుకొనా
నిశ్శబ్దంగా.

ఎంతోసేపు నిర్జీవప్రతిమలా నిశ్చల
నిలబడింది అంజన. కాళ్ళు లాగ
మొదలుపెట్టేసరికి భర్త క్రిందవేసిన
లను తలక్రింద ఉండలా చుట్టి పెట్టుక
వట్టి గచ్చునేలమీదే పడుకొంది దగ్గ
ముడుచుకొని. నీలకాంత్ నిర్వికార ప్ర
నలో నిర్లక్ష్య మేదో గోచరించగా, అ
లోని అహంభావుకతా, ఆగ్రహమూ
గొట్టబడ్డాయి. తనింత చనువిచ్చి దగ్గ
రాజూచినా అర్థంచేసుకోలేని అతడి వ
తకు అసహ్యించుకొంది. ఓవంక
నిరాదరణ ఆమెను అంతులేని ఆవేద
ముంచెత్తుతున్నదికూడా.

మరునాడు ఉదయం సుధతో అనా
నీలకాంత్: "నాన్న వచ్చేసరికి య
ఆలస్య మౌతుందేమో! నేను పం
వస్తాను. సర్దుకొనేవి సర్దుకొని తయారుక

అన్నగారి యుక్తిని సుధ అర్థంచే
లేదుకాని, అంజన లోలోన మండిపడి
'సుధవంటి అయినవారు తమ మధ్య ఉ
కాస్త నయం, వా శ్శేమనుకొంటా ర



ర్యాభర్తల మన్న భావం కనబర్చుతాడు. ధ వెళ్ళిపోతే ఈ దూరం యింకా పెరిగి యినట్లే.'

రోజులు నిరుత్సాహంగా దొర్లిపోతు న్నాయి. అంజనా నీలకాంత్‌లమధ్య ఎడ ంకా అధికమౌతూంది. అంజన సన్నిధిలో లా నిర్లిప్తుడుగానూ, గంభీరంగానూ టున్నాడు నీలకాంత్. వచ్చిన కొత్తలో ్నహసరళహృదయంతో ఆమెను పరా ర్శించేవాడు. యిప్పుడామెపట్ల పూర్తిగా ాసక్తుడై పోయాడు. వేదాంత గ్రంథ నంలో ఏం సారం పీల్చుకొంటున్నాడో ి, నిరంతరం నిర్వేద వైరాగ్య గంభీర వాలతో నిండిఉంటుం దా ముఖం.

తీరని కోరికతో జ్వలించిపోతూ అంజన డా అతనిపట్ల విముఖత పెంచుకొం ంది. ఇన్నాళ్ళవలె గృహకృత్యాలలో క్తి చూపడంలేదు. 'ఎవరి యిల్లు? ఎవరి ్న?' అన్న విరక్తితో అంతా పనిమనుష వదిలిపెట్టేసి, ఎప్పుడూ తన గదిలో కొంటుంది, బుర్ర వెర్రి ఆలోచనలతో ుకువరుచుకొంటూ. ఈమె పట్ల మునుపటి నీలకాంత్ శ్రద్ధ చూపడంలేదు గనుక తరుచుగా వస్తులున్నా అడిగేవాళ్ల పోయారు.

రోజురోజుకూ క్రుశించిపోతూ గది వద అంజనను చూసి ఒకసారిమాత్రం న్నాడు నీలకాంత్: "ఆరోగ్యం బాగా ? చెప్పు మరి? డాక్టర్ని తీసుకురానా?"

"అక్కర్లేదు. బాగానే ఉన్నాను." ఖం త్రిప్పుకొంది.

"కోపం వచ్చిందికదూ నామీద? కృష్ణ రం నేను పూర్తిగా వదులుకొన్నా నను అంజనా! అతడు ఎక్కడున్నాసరే, టికైనా వెదకి పట్టుకువచ్చి నీముందు బెడతాను. సరేనా? దిగులు మానేయ్. డి బెంగతో ఆరోగ్య మెందుకు చెడ ుకొంటావు?"

"ముందు మీ రిక్కడినుండి వెళ్ళిపొండి." రంగా తలెత్తి అరిచింది అంజన.

చెంపపెట్టు తిన్నవాడిలా నల్లబడింది నీలకాంత్ ముఖం. నిట్టూరుస్తూ లేచాడు.

అతడు గుమ్మం దాటి వెళ్ళిపోతూంటే తిరిగి అంది అంజన: "కృష్ణను కాదు; మృత్యువును తీసుకురండి నా దగ్గరికి; సంతోషిస్తాను!"

## 12

ఉదయం ముఖం కడుక్కొని టీ తీసుకొంటూంటే నౌకరు చెప్పాడు నీలకాంత్‌తో— "రెండుమూడు రోజులనుండీ అమ్మగారు చాలా సుస్తీగా ఉన్నారండీ. రెండు రోజుల నుండి మెతుకే ముట్టుకోలేదు. ఈరోజేమో పక్క విడవకుండా జ్వరంతో మూల్గుతూన్నారు."

అంజనపట్ల ప్రయత్నపూర్వకంగా తాచేర్పరచుకొన్న ఉదాశీనత ఒక్కసారిగా వదిలించుకొని హడావిడిగా అంజన గదిలోకి వెళ్ళాడు నీలకాంత్.

"అంజనా!"

"........." నీరసమైన మూలుగు సమాధాన మైంది.

ఒంటిమీద చెయ్యేసి ఆత్రంగా చూశాడు. జ్వరంతో పేల్లిపోతూంది. గులాబీరంగు దేహచ్ఛాయ కెంపురంగుగా మారింది. ఎర్రని పలుచని పెదవులు వాడి జ్వరతాపానికి కంపిస్తూంటే నిర్జీవంగా పక్కమీద పడివుంది అంజన.

స్నేహితునివలె ఆదరంతో ఆమెబాధను పోగొట్టవలసిన తనే, ఆమెపట్ల ఉదాశీన, నిర్లక్ష్యతలు ప్రకటించడంవల్లే ఆమె మనోవ్యథ రెట్టింపయి, ఈ పరిస్థితికి కారణమైందా? అయ్యో! కృష్ణకు దూరమైన ఆమెకు తనకంటే కావలసినవా రెవరున్నారిప్పుడు దగ్గర? విపరీతమైన జాలి కలిగింది అంజనమీద నీలకాంత్‌కు.

తక్షణమే బయల్దేరి రావలసిందంటూ డాక్టరుకు ఫోన్ చేసివచ్చి కూర్చున్నాడు నీలకాంత్. "అంజనా; ఎలా ఉంది అంజనా?"

అతడి ఆర్ద్రకంఠం విని జ్యోతుల్లా ఎర్రబడిన కళ్ళను మెల్లగా విచ్చి చూసి, తిరస్కారభావంతో ముఖం త్రిప్పుకొంది.

ఈ జుగుప్సాక్రోధాలు తను కృష్ణను తీసుకురాలేని అసమర్థతమీదే నని భావించి మనను నొచ్చుకున్నాడు నీలకాంత్.

డాక్టరు వచ్చి చూశాడు: "అబ్బా! చాలా బలహీనంగా ఉందే! బాగా మందులు వాడా లీమెకు!" జ్వరాని కేదో ఇంజక్షన్ చేసి, రెండు టాబ్లెట్సేవో యిచ్చి, సాయంత్రము వస్తానని చెప్పి వెళ్ళా డాయన.

ఉదయంనుండి తన పక్క విడవని భర్తను చూసి లోలోన చాలా సంతృప్తి పడింది అంజన. ఈ పరిస్థితిలోనే అతడిని శాశ్వతంగా బంధించే ఉపాయం ఎత్తాలి! జ్వరమైకంలో ఆమె ఆలోచనలు కలలోవలె సాగుతున్నాయి.

అన్నం పెట్టకుండా ఏదయినా ద్రావక పదార్థం యిమ్మని చెప్పాడు డాక్టరు. మధ్యాహ్నం పళ్ళరసం తీస్తూ అంజన గదిలో కూర్చొన్నాడు నీలకాంత్.

"నీలూ! నీలూ!"

గండుకోయిల స్వరాన్ని ధిక్కరించే ఆ పిలుపు వినడంతో, చేస్తున్న పని వదలి, తత్తరపాటుతో లేచి బయటికి వెళ్ళాడు.

"ఓ! పవనా! యిలా వచ్చావేం?"

"అదేమిటి నీలూ? ఈరోజు నీ పుట్టిన రోజుకదూ? ఎందరు స్నేహితుల్ని పిలిచి, ఎంత అట్టహాసంగా జరుపుకొనేవాడివి! ఈరోజు ఏం లేదేం? నీ భార్య ఒక్కతే వుంటే అందరిపెట్టా అనుకున్నావా?" గబగబా మాట్లాడింది పవన.

"నాకు గుర్తుంచేక దూ — ఈరోజు నా పుట్టిన రోజని?"

"ఓహో! భార్య సన్నిధిలో రోజూ పండగలాగే ఉంటే ఈరోజు ప్రత్యేకత గుర్తు రాలేదన్నమాట."

"ఉఁ," బరువుగా మూలిగాడు.

"పెళ్ళికి పిలిచినా రాలేకపోయాను. ఇక్కడికి భార్యను తీసుకువచ్చావుకదా!

పార్టీలాటిది ఏర్పాటుచేసి నీ భార్యను చూపుతావేమో అనుకున్నాను."

"..............."

"పిలువకపోయినా నేనే వచ్చాను. ఇప్పుడయినా చూపుతావా లేవా మా చెల్లెలిని ?"

"ఆమె ఇక్కడ లేదు."

విచిత్రంగా చూసింది పవన. "అబద్ధాలెందుకు నీలూ ?"

"అబద్ధ మెందుకు ? నిజంగా ఆమె లేదు;" నవ్వడానికి ప్రయత్నించాడు.


"నిజం !"

"నిజమే !"

"అమ్మగారికి సుస్తీ చేసి గదిలో పడుకొన్నారని చెప్పాడే నౌకరు ?"

తెల్లబడిపోయింది నీలాకాంత్ ముఖం. తమాషాగా మాట్లాడుతున్నదల్లా సీరియస్‌గా అయిపోయింది పవన. మృదువుగా అంది: "ఆమె నాకంటే అందగత్తె కావచ్చు. కానీ, నేను అసూయపడతాననుకొన్నావా ? ఆమె అదృష్టానికి ఈర్ష్య పడతా ననుకొన్నావా ? నేను అలాంటిదాన్ని కాదే ? నే నెలాంటిదాన్నో అర్థం చేసుకున్నావు కనుకనే నన్ను ప్రేమించగలిగావు నువ్వు ! కన్నవారిని నొప్పించకూడదని వారు నిశ్చయించిన అమ్మాయితో నీ వివాహము జరగడానికి ప్రోత్సాహమిచ్చి నేను దూరం జరిగింది నీ సుఖసంతోషా లాశించే గాని నా సొత్తు మరొకరిదైందని కుమిలిపోడానికీ, చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకోడానికీ కాదు. వివాహబంధంవంటి మరొక బాహ్యబంధం పడకపోయినా ఇరుహృదయాలలోని పవిత్రప్రేమ చెదిరేదికాదు. ఈ ధైర్యంతోనే నువ్వొక ఇంటివాడివీ, నేనొక ఇంటిదాన్నీ కావడానికి నీ వివాహానికిముందు మనమధ్య ఒప్పందం జరిగింది కదూ ? మరెందుకు నీ భార్యను చూపడానికి సంకోచిస్తున్నావు ?"

ఉబికివస్తూన్న కన్నీటిని ఆపుకొంటూ "ఇప్పుడు నన్నేం అడిగినా చెప్పలేను పవనా ! ఆవిడను చూడాలన్న నీ కుతూహలం పరిహాసాస్పదమైన దని ఒకనాడు మాత్రం తెలుస్తుంది నీకు," అన్నాడు.




"విచిత్రంగా మాట్లాడుతున్నావు !" పవన చటుక్కున అతడిని సమీపించి భుజంమీద చెయ్యి వేస్తూ, "యిలా నా కళ్ళలోకి సూటిగా చూడు నీలూ ! నీ చిలిపి కళ్ళలో ఈ విషాదపు గూళ్ళెక్కడివి ? నిన్ను చాలారోజులయి చూడలేదు. యివాళ చూస్తుంటే నువ్వు నువ్వేనా అనిపిస్తోంది ! ఇలా అయిపోయావేం నీలూ ? తమ్ముడు చెప్పాడు – నువ్వు క్లబ్బుకుకూడా రావడం లేదని. ఎప్పుడైనా కనిపించినా మనిషి ఏమిటో పరలోకంలో ఉన్నట్లుంటావని. ఏమిటి కథ ?" అంది కరుణాజనకంగా.

"సంతోషజీవులకు కావాలి ఆ సరదాలూ, సరాగాలూ విషాదహృదయుడు వాటి దరిదాపులకుకూడా వెళ్ళలేడు." బరువుగా నిట్టూర్చాడు నీలకాంత్.

"ఆవిడ అనుకూలంగా లేదా ?" ఆర్తంగా అడిగింది పవన.

"నా ప్రేమ పొందగలిగావని నువ్వు అదృష్టవంతురాలివి. నన్ను పెళ్ళాడగలిగిందని ఆమె అదృష్టవంతురాలు. ఈ యిద్దరి అదృష్టాలూ నన్ను దౌర్భాగ్యుణ్ణి చేసి పెట్టేశాయి. ప్రేమించి, పెళ్ళాడలేక పోయాను ఒకరిని. పెళ్ళాడి పొందలేకపోయాను మరొకరిని !" అతడి ఆవేదనాదగ్ధహృదయంనుండి నిట్టూర్పురూపంలో వెలువడింది ఒక జ్వాల.

"ఆ తెలివితక్కువదాన్ని నా కొకసారి చూపు నీలూ !" ఆవేశపడింది పవన.

"అవసరంలేదు పవనా !" ఖచ్చితంగా అన్నాడు.

"ఎందుకు ?"

"ఇప్పు డేమీ చెప్పను. ఆ రోజు వచ్చిందంటే నేనే వస్తానునీ దగ్గరికి. నా సమస్త బాధల్నీ నీముందు ఉంపుకొని వెడతాను."

"సరే, ఇదే మాటని గుర్తుపెట్టుకో. నే నిక వస్తాను !" నీలకాంత్‌కు ప్రెజెంటు చేద్దామని తెచ్చిన పాకెట్ అలాగే బల్లమీద వదిలేసి వెళ్ళిపోయింది పవన.

"ఎవరు వచ్చారు ?" గదిలోకి వచ్చిన భర్తను ప్రశ్నించింది అంజన.

"నా స్నేహితురాలు – లాయర్ పవన అని చెప్పానే – ఆమే !"

పక్కహాల్లోనే వీళ్ళ సంభాషణసాగింది కనుక, ఇంచుమించు అంతా విన్నది అంజన. "ఒక్క స్నేహమేనా ? మరో

పరిచయంకూడా అవుతున్నదే మీ మాటల్ని బట్టి!'' అంది ఎత్తిపొడుపుగా, వ్యంగ్యంగా.

గతుక్కుమన్నాడు నీలకాంత్.

''లోకంలో కొందరు దౌర్భాగ్యజీవు లున్నారు. తెచ్చిపెట్టుకొన్న అంధత్వంతో కంటిఎదుటున్న అదృష్టాన్నే చూడలేరు!'' స్వగతంగా అన్నట్లుగానే విసిరింది.

''దేన్నిగురించి అంజనా, నువ్వీమాట అంటున్నది?''

ముఖం కసిగా మార్చుకొని మౌనం వహించింది అంజన. ఇతడు తన వశమై వుంటే ఇతడి హృదయంలో పవన స్థానం ఎలా ఉండేదోగాని, యిప్పుడు మాత్రం అతడింకా పవనను ప్రేమిస్తున్నాడనడానికి సందేహం లేదు. లేకపోతే పవన అంత ధైర్యంగా ఆ మాట ఎలా అనగలుగుతుంది? పెళ్ళాం కాకపోతే నేం? ప్రేమనైనా నిలుపుకొన్న ఆమే అదృష్టవంతురాలు తనకంటే.

ఆ స్త్రీ హృదయం ఈర్ష్యావేశనలతో సుళ్ళు తిరిగింది. 'తనను కృష్ణకు అంటగట్టి పవనను పెళ్ళి చేసుకొంటాడేమో తిరిగి! లేకపోతే యింతగా కృష్ణ కృష్ణ అని పలవరించడంలో అర్థంలేదు. ఈ ఎత్తే లేకపోతే నిస్వార్థంగా కృష్ణకోసం అన్వేషణ సాగించలేడు!' నీలకాంత్ ప్రవర్తనను శంకిస్తూ హృదయాన్ని మరింతగా మలినపరుచుకొంది అంజన.

## 13

ఒకనాటి సాయంత్రం భవనశిఖరాలపై, వృక్షాగ్రాలపై కనకాభిషేకం చేస్తున్న సూర్యబింబాన్ని చిన్న కారుమేఘ మొకటి కప్పివేసింది. ఈలవేసి పిలిచినట్లుగా మరి ఎక్కడినుండో నల్లని కారుమేఘాలగుంపులు పరుగు పరుగున వచ్చి ఆకాశమంతా అలుముకొన్నాయి. క్షణాలలో ప్రొద్దు గ్రుంకినట్లయింది. నేలమీద ప్రభంజనుడు కూడా హఠాత్తుగా తన ప్రతాపం చూపసాగాడు. వర్షదేవతను పిలుచుకు రావడానికా అన్నట్లు నేలమీది చెత్తా చెదారాన్ని, ధూళిదూసరాన్ని ఆకాశంలోకి ఎగురగొడుతున్నాడు. భీకరంగా ఈల వేస్తూ పెద్ద పెద్ద వృక్షాలను కసిగా ఊపివేస్తున్నాడు. ఇంటి తలుపులు, కిటికీ రెక్కలు అతడి ఆగడానికి తట్టుకోలేక ధనధనా అంటూ ఆర్తనాదం చేస్తున్నాయి.

పై వరండాలో నిలబడిన అంజన కాలమేఘాచ్ఛాదితమైన ఆకాశంవంక నిర్వికార నిర్నిమేషదృష్టి నిలిపివుంది. సాంధ్య శోభతో విలసిల్లవలసిన ఆ ప్రకృతివలెనే తన తరుణ జీవితంకూడా కాలమేఘాచ్ఛాదితమై పోయిందనుకుంటూ అంతులేని విషాదంలో మైమరిచిన అంజనను, ముందు పలుచగా పెద్ద పెద్ద చినుకులతో ప్రారంభమై కుండపోతగా కురిసిన వర్షం గాలివిసురుకు వాలుగా వచ్చి పడుతూ తడిపివేయసాగింది. ఆదరణలో ఆగిన కారునుండి నీలకాంత్ దిగకముందే నౌకరు చూచి గబ గబా గొడుగు తెచ్చి అందించాడు. సీటులో కూర్చొనే బయటినుండి గొడుగు విప్పుతూ అప్రయత్నంగా పైకి చూశాడు నీలకాంత్. ప్రాణంలేని ప్రతిమలా వర్షపుజాలులో తడుస్తూ నిలబడిన అంజనను చూసి నిశ్చేష్టుడయ్యాడు. జ్వరంతో తీసుకొంటున్న మనిషి వర్షంలో తడిస్తే ఏమైనా వుందీ? కృష్ణ విరహంలోపడి తన ఆరోగ్యాన్నిలా అలక్ష్యం చేసుకొంటే తను రేయింబవళ్ళు నిద్రహారాలకు దూరమై చేసిన సేవకి ఫలిత మేమిటి?

ఒక్క ఊపులో పైకి చేరి ఆమెను సమీపిస్తూ "అంజనా!" అని పిలిచాడు భయాందోళనతో.

"............"

"అంజనా! ఇలా వర్షంలో తడిస్తే జ్వరం ముంచుకురాదూ?" ఖంగారుగా భుజం తట్టాడు.

మగతగా కళ్ళుమూస్తూ తూలింది అంజన. క్రింద పడకముందే పట్టుకొన్నాడు నీలకాంత్. తనను చల్లగా తాకుతూ తడిసిన దుస్తుల్లో స్పష్టమౌతున్న ఆమె అవయవ సౌష్ఠవం, అతడిన్నాళ్ళుగా పెంచుకొంటూన్న నిగ్రహంపై ఒకదెబ్బ వేసి, మోహవివశుణ్ణి చేసివేసింది. వెర్రి ఆవేశంతో ఆమె వక్షాన్ని బలంగా తన గుండెలకు చేర్చుకొన్నాడు. ఎన్నాళ్ళతృష్ణనో తీర్చుకొంటున్నట్లు ఆమె చిన్ని పెదవులను గాఢంగా చుంబించాడు.

అంజన తనూవల్లరి ఒక సుకుమారమైన లతలా నీలకాంత్ బలిష్ఠమైన బాహువుల్లో వ్రేలాడుతూంటే గదివైపుకు సాగాడతడు.

'నా ప్రేమ అంత చంచలమైనదీ, దుర్బలమైనదీ కాదు. ఏవిధంగానూ నన్ను మీ వశవర్తిని చేసుకోలేరు!'

'మీరు తలక్రిందుగా తపస్సు చేసినా కృష్ణకు అర్పించిన ఈ హృదయంలో మీకు అణుమాత్రం స్థానం దొరకదు!' కటు గాంభీర్యాలతో ఒకనాటి అంజన కంఠం నీలకాంత్ హృదయంలో ఉరుమువలె ఫెళ్ళుమనడంతో, అతడి మోహపుతెర మంచువలె విడిపోయింది. ఒక శిరీష కుసుమకోమలిని కాలనాగై కాటందినంతగా బాధా పశ్చాత్తాపాలకు లోనయ్యాడు. ఆమెను చటుక్కున మంచంమీద పడుకోబెట్టి దూరంగా తొలిగాడు. మూర్ఛావస్థలో వున్న ఆమెను దుష్టవాంఛతో తాకినందుకు ఎంతగానో లజ్జితుడయ్యాడు నీలకాంత్.

అంజన ఎంతగా నీలకాంత్‌తో కలిసి పోదామనుకొందో అతడామెనుండి అంతగా వేరైపోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆధ్యాత్మిక పథంలో ఆత్మనిగ్రహం కూడదీసుకోడానికి కేవలం వేదాంత గ్రంథపఠనం వల్ల అట్టే ప్రయోజనం లేదనుకున్నాడేమో, సాధు, సన్యాసుల సాంగత్యంకూడా జీవితంలోకి ఆహ్వానించాడు. బయటికి వెళ్ళాడంటే ఏ సన్యాసినో వెంటబెట్టుకు రావడం తరుచుగా జరుగుతూంది. వారిని ఒకటి రెండు రోజు లుంచుకొని వేదాంతచర్చ జరపడం, మృష్టాన్న భోజనాదులతో సంతృప్తి పరిచి సాగనంపడం చేస్తుంటాడు. అంతకంతకు విపరీత మౌతున్న అతని చర్యలకు అంజన కుమిలిపోని క్షణంలేదు.

ఒక ఆదివారం ఉదయం బయటికి వెళ్ళిన నీలకాంత్ ఓ సన్యాసితో తిరిగి వచ్చాడు.

సన్యాసిగారు తినే భోజనపు వివరాలు అడిగి తెలుసుకొని వంటమనిషితో చెప్పివచ్చాడు. గదిలో తివాసీమీద సన్యాసిని ఆశీనుణ్ణిచేసి వేదాంతచర్చకు కూర్చొన్నాడు. భోజనాల వరకు అనర్గళంగా సాగింది చర్చ. భోజనాలు చేసివచ్చి తిరిగి కూర్చున్నారు

ముఖమంతా ఎలాగో చేసుకొని అంజన గదిలోకి వచ్చాడు రాఘవులు. యజమాని ప్రవర్తన అతడి కెంతమాత్రం నచ్చలేదు. "మాణిక్యంలాంటి పెళ్ళాన్ని పెట్టుకొని బాబుగారికి ఈ వయసులో ఈ వైరాగ్య మేమిటమ్మా? చూస్తూనే ఉన్నావుకదమ్మా! ఒక్క మాటుకూడా మందలించవు. చూస్తూండ గానే నీసంసారాన్ని గంగలో కలిపి సన్యాసుల్లో కలిసిపోయేట్లున్నాడే?" మరీ దగ్గరగా వచ్చి గుసగుసగా, "పైగా తనకింకా పెళ్ళికాలేదని సన్యాసివాడితో చెబుతున్నా డమ్మా!... సాధనలో ఏకాగ్రత కుదురు తుందని చెప్పి. ఓ దమ్ము పీల్చిచూడమంటూ గొట్టంలో గంజాయి దట్టించి బాబుగారికి యిస్తూంటే చూచి నా ఒళ్ళు జలదరించి ఇటు పరిగెత్తుకు వచ్చానమ్మా!" అని చెప్పాడు.

'ఈ భంగుకూడా మరొకటా?' అంజన నెత్తిన పిడుగు పడినట్లయింది. చరచరా గదిదగ్గరికి వెళ్ళి కొద్దిసేపు ఆగింది, గదిలో నుండి మాటలు వినవస్తూంటే.

"... ఇంత చిన్నవయసులో ఈ ఆత్మ జ్ఞానం కలగడం ఆశ్చర్యమే, నీలకాంతం! వివాహం చేసుకొని స్త్రీ మాయాలంపటంలో తగుల్కొకుండా మేలుకొన్నావు. నీకు శుభమౌతుంది. బ్రహ్మచర్యంలో ఆత్మ దీప్తివంతమౌతుంది. స్వేచ్ఛ. ధైర్యం ఏర్పడతాయి. కామానికి లొంగినవాడు నా దృష్టిలో మనిషి కాదనుకో. పశుపక్షుల సమానమైతే మనిషికి ప్రత్యేకమైన విలు వేముంది?''

''లేకపోతే లేకపోయిందికాని తమరు యిక్కడ్ణించి వెంచేస్తే ఒక కాపురం నిలబడుతుంది స్వామిగారూ!'' స్వరంలో కటువ్యంగాలు వ్యక్తపరుస్తూ గదిలో ప్రవే



శించిన అంజనను చూసి తొట్రుపడ్డాడు నీలకాంత్.

''ఎవరమ్మా, నువ్వు?" శాంతంగా ప్రశ్నించాడు సన్యాసి.

"ఆయన భార్యను."

ఏనాటికో ఒకనాటికి తను ప్రేమించిన వాడికి భార్య కాబోతున్న ఆమెనోట ఆ మాట రావడం నీలకాంత్‌కు విస్మయంగానూ, వెగటుగానూ తోచింది. ఆమె హఠాత్తుగా రావడంవల్ల కలిగిన కలవరపాటును అణచు కొంటూ. కంఠంలోకి కటుదనం తెచ్చుకొని, "నీ కిక్కడ పనేముంది అంజనా? వెళ్ళు." అన్నాడు.

సన్యాసి లేచి నిలబడుతూ, ''ఈ చిన్నది

భార్య! ఆమెను విరహంలో దగ్ధంచేసి నువ్వు బ్రహ్మచర్యదీక్ష పుచ్చుకుని కర్మసన్యాసము చేసి పొందబోయేది ఏంలేదు నాయనా! ఇహపరాలు రెండూ నీవికాదు. సంసారంలో కర్మయోగివై మోక్షం సాధించుకో. నీకింతకంటే సులభతరమైంది లేదు!'' అని భిక్షాపాత్రనూ, దండాన్నీ అందుకొని చరచరా వెళ్ళిపోయాడు.

ఎంతోసేపు నిశ్శబ్దంగా గడిచాక వివర్ణమైన ముఖాన్ని పైకెత్తాడు నీలకాంత్. ''నేను ఈవిధంగాకూడా సుఖపడడం చూడలేవా?''

ఒక నిష్ఠురవీక్షణం నీలకాంత్ ముఖం మీదికి విసిరి చూపులు తిప్పుకొంటూ, ''నేనూ, పవనా తప్ప ప్రపంచంలో ఇక ఆడవాళ్ళే లేరా?'' అందామె.

''ప్రపంచంలో విషసర్పాలు కొల్లలు. కాని, ప్రాణం తీయడానికి ఒక్కటి చాలు.'' కటువూ గాంభీర్యం మేళవించి అని, క్రోధావేశాలు పెంచుకొంటూ తిరిగి అన్నాడు: ''నా బాధ నీకు అర్థంకాదు. నువ్వు నా దగ్గరుండడంవల్ల ఆ బాధ రెట్టింపు అవుతుంది. నిన్ను సాగనంపితేగాని నాకు మనశ్శాంతి లేదు.''

ఆవేశంగా తనగదిలోకి వెళ్ళిపోయి, అయిదునిమిషాల్లో తిరిగివచ్చాడు డ్రెస్సులో, చేతిలో సూటుకేస్‌తో.

''ఎక్కడికి?''

''నీపీడ వదిలించుకోడానికి!'' విసురుగా వెళ్ళిపోయాడు.

నిశ్చేష్టురాలై నిలబడిపోయింది అంజన.

నీలకాంత్ స్టేషనులో వదిలిన కారు తీసుకు వచ్చేసిన డ్రైవరును అడిగింది అంజన: ''బాబుగారు ఎక్కడికి వెళ్ళారు జగ్గా?''

''చెప్పలేదమ్మా. తను తిరిగి రావడానికి ఎన్నాళ్ళు పడుతుందో చెప్పలేనని అమ్మగారితో చెప్పమని చెప్పారండీ! వారం కావచ్చు; సంవత్సరం కావచ్చు; సంవత్సరాలు కావచ్చు అని అన్నారండీ!'' యజమానురాలి దిగాలు ముఖం చూసి తిరిగి అన్నాడు జగ్గడు: ''కీచులాడుకొన్నారా అమ్మా? ఓస్! ఎన్నాళ్ళు వెడతారు లెండి బాబుగారు? పెళ్ళాంమీది అలుక ఎన్నాళ్ళుంటుంది మొగుడికి?''

నీలకాంత్ కృష్ణకోసం వెళ్ళి ఉంటాడనడంలో సందేహం లేకపోయింది అంజనకు.

మరునాడు ఇంటికి తాళంపెట్టి పుట్టింటికి వెళ్ళింది అంజన. తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు — అల్లుడు వెంటలేకుండా వంటరిగా వచ్చివేసిన కూతురిన్ని చూసి. ఏదో బొంకి వారిని ఊరుకోబెట్టింది కాని అక్కడి సంగతులు ఒక్కటికూడా బయటపడనీయలేదు అంజన. అక్కడున్న వారంరోజులూ తనగదిలో కిటికీముందు కూర్చొని దీర్ఘాలోచనలో గడిపేది వీధిలోకి చూస్తూ. ఇంటిముందు, పరబ్రహ్మంగారు కొన్న కృష్ణ ఇంటిని పడగొట్టించి తనమేడకు కలుపుకొని మరో మేడ నిర్మింపజేస్తున్నారు. ఒకనాడు తన హృదయంలో కృష్ణకు కట్టిన ప్రేమమందిరం కూలగొట్టి మరో మూర్తికి నూతన మందిర నిర్మాణం గావించింది. అతడు మాత్రం అందు నిలువడానికి ఒప్పుకోక వెర్రిభ్రమలతో పారిపోతున్నాడు!

వారంరోజు లక్కడుందో లేదో తిరిగి ప్రయాణం పెట్టుకొంది అంజన.

''అప్పుడే వెళ్తావా? అల్లుడికి ఉత్తరం వ్రాస్తాముగా - వచ్చి తీసికెళ్తాడు!'' అన్నారు తల్లిదండ్రులు. అయినా నిలువకుండా భర్త ఇంటికి వచ్చివేసింది అంజన. అనుక్షణం భర్త ఆగమనానికై నిరీక్షించసాగింది.

## 14

తిరుపతిదగ్గర ఒక చిన్న గ్రామం. వారపాక వేసివున్న ఓ చిన్న యింటి గుమ్మం ముందు నిలబడ్డాడు నీలకాంత్. గుమ్మంలో ఓ వృద్ధస్త్రీ చేటలో బియ్యం పోసుకొని ఏరుతూంది.

''కృష్ణ అనే అతడు ఇక్కడే ఉంటాడా అవ్వా?''

''పంతులుగారా?''

ముందుగదిలోనే ఏడెనమిదిమంది చిన్న పిల్లలు పలకలు పట్టుకొని కూర్చొని ఉన్నారు. తను పరబ్రహ్మంగారిని కృష్ణ వివరాలు అడుగగా 'తిరుపతి దగ్గర్లో ఓ పల్లెటూళ్ళో వీధిబడి పెట్టుకొని జీవనాధారం చేసుకొన్నాడట' అని చెప్పడం నిజమనిపించింది.

వృద్ధస్త్రీ చేట తీసుకొని లోనికి వెళ్ళి ''ఎవరో వచ్చారు మీ కోసము, చూడు బాబూ!' అని చెప్పింది.

రెండు నిమిషాల తర్వాత చేతులు తుడుచుకొంటూ వచ్చాడు కృష్ణ. ''ఓ! మీరా?'' చటుక్కున లోనికి వెళ్ళిపోయాడు.

ఒకటి రెండునిమిషాల తర్వాత ఆ స్త్రీ ఒక పలక తెచ్చి నీలకాంత్‌కు యిచ్చింది. దానిమీద వ్రాసినదాన్ని చదువుకొని ఒక్క నిట్టూర్పు విడిచాడు నీలకాంత్.

''ఒక్కనాడు ఎవరిసొత్తూ కానప్పుడు మీ సొత్తును ప్రేమించినమాట నిజమే. ఇప్పుడు నాకు దానిమీద ఆశావ్యామోహాలు లేవు. మీ కుండే దురాలోచనలు తొలగించుకోండి! నన్ను వెంటాడి నా ప్రాణం తీయడానికి ప్రయత్నించకండి. నాకు ప్రాణభిక్ష పెట్టి నన్నిలా బ్రతకనీయండి. మిమ్మల్నిదే ప్రార్థిస్తున్నాను.''

"అతడు లోప లున్నాడా?"

''ఇప్పుడే వస్తానంటూ చొక్కా వేసుకొని దొడ్డివైపునుండి వెళ్ళాడండీ! పొయ్యిమీద నీళ్ళు ఎసరు పెట్టాడు. పప్పు వేస్తాడేమో! నీళ్ళు మరీ మరిగిపోతున్నాయి. మరి ఎప్పుడు వస్తాడో ఏమో!"

ఉస్సురుమంటూ ముందుగదిలో ఓ బల్లమీద కూర్చొన్నాడు నీలకాంత్. 'భగవాన్! ఈ పిరికివాడిని అంజన దగ్గరికి తీసుకెళ్ళే ఉపాయ మేమిటి? ఆమె మొదటే 'పిరికివాడు, పిరికివాడు' అని ఈసడిస్తూందే!'

గంటసేపయినా పంతులుగారు రాకపోయేసరికి పిల్లలు పలకలు పుచ్చుకొని వెళ్ళిపోయారు. ముసలావిడ పొయ్యి చల్లార్చి వచ్చి కూర్చుంది.

''కృష్ణఅమ్మ ఉండాలికదా అవ్వా? లేదా?''

''అయ్యో! మీకు తెలియదా బాబూ? మూణ్ణెల్లక్రింద యాత్రలు చేస్తుండగా రామేశ్వరంలో జ్వరంతో తీసుకుని పోయిందట ఆయమ్మ!''

మరురోజు ఉదయంవరకు కృష్ణ రాలేదు. ముఖం తప్పించిన అతడు యిక యిప్పుడప్పుడే ఇంట్లో అడుగు పెడతాడని అనుకోలేదు నీలకాంత్. ఇక ఎన్నాళ్ళని భోజనానికి హోటలయినా లేని ఈ పల్లెటూళ్ళో పడి వుండడం? రాత్రి అలా వెళ్ళి, బస్‌స్టాండ్‌లో వున్న టీ కొట్టులో రెండణాలు పారేసి ఓ కప్పు టీ తీసుకొని ఇంతవరకూ వున్నాడు. నిన్నటినుండి తిండితిప్పలూ లేవు!

వారంరోజుల తర్వాత తిరిగి రావడానికి నిశ్చయించుకొని తిరుపతికొండ ఎక్కాడు నీలకాంత్. మూడురోజులు శ్రీనివాసుని దర్శనం చేస్తూ, కొండమీది తీర్థాలు చూస్తూ గడిపాడు. సాయంత్రం కొండ దిగాలని నిర్ణయించుకొని దైవదర్శనానికి వెళ్ళాడు.

నీలకాంత్ ధ్వజస్తంభందగ్గర నిలబడి వుండగా ధర్మదర్శనం క్యూలో కృష్ణ ముఖం కనిపించింది. 'ఏమైనా ఇక అతణ్ణి తప్పించుకోనీయను!' అనుకొని, అతడి కోసం వేచి నిలబడ్డాడు. గంట తర్వాత దైవదర్శనం చేసుకొని యివతలికి వచ్చిన కృష్ణ నీలకాంత్‌ను చూసి, చూడనట్లు తప్పించుకు వెళ్ళబోతుంటే నీలకాంత్ వెనుక నుండి వెళ్ళి భుజాలు పట్టుకొని, ''కృష్ణా! భయ అపోహలతో ఎందుకిలా నానుండి పారిపోతున్నావయ్యా?'' అన్నాడు.

''హంతకుడి బారినుండి పారిపోక ఏం చెయ్యను? ఏం లేకున్నా నాకు జీవితేచ్ఛ వున్నది!''

''హంతకుడి నని ఏలా అనుకొంటున్నావు?''

''తన భార్య ప్రియునికోసం వెదికే వ్యక్తి ఉద్దేశ్య మేముంటుందో ఆమాత్రం తెలుసుకోలేని మూర్ఖుణ్ణి కాదు.''




''ఖచ్చితంగా నువ్వో పెద్దమూర్ఖుడివి; అందుకే నిన్ను ప్రేమించి అంజన అంత దుఃఖం తెచ్చుకొంది!'' అని ఒక్క నిట్టూర్పు విడిచి, తిరిగి అన్నాడు: ''అంజన కోరిక మీద నిన్ను తీసుకుపోవడానికి వచ్చాను. యిప్పుడు పడిన తిప్పలు చాలు; మళ్ళీ పారిపోయి మరింకా తిప్పలుపెట్టకు నన్ను.''

''ఎందుకు? తీసుకుపోయి మీ ప్రణయ సామ్రాజ్యంలో ముల్లులా వున్న నన్ను తొలగించుకొందామనా?''

''ఎంతచెప్పినా నీ మాట నీదేకదయ్యా?'' మదురు కొట్టుకొన్నాడు నీలకాంత్. ''ఎక్కడి ప్రణయం బాబూ! నా జీవితంలో ప్రళయం సృష్టించి వదిలిం దామె!''

అయోమయంగా ముఖం పెట్టాడు కృష్ణ.

''ప్రపంచంలో ఏశక్తినైనా లొంగదీసుకోవచ్చు; అధికారం పూనవచ్చు. కాని మనిషి మనసు వున్నదే - ముఖ్యంగా స్త్రీ మనసుపై అధికారం పొందడానికి అదృష్టం కావాలి. శోభనంనాటి రాత్రి అంజన చెప్పివేసింది-ఆదివరకే తన మనసు మరొకరికి అంకితమైందని. నన్ను ప్రేమించి నాతో కాపురం చేయడం అసంభవ మనికూడా చెప్పింది. ఆమె వాది కాదని తోచిపోయిన

క్షణంనుండే ఆమె మనసు గెలుచుకో వాడికే ఆమెను అర్పించడానికి సిద్ధప ...పద. ఈ మందిలో ఈ మాట లే ఎక్కడైనా ఏకాంతంగా కూర్చొని స సవిస్తరంగా చెబుతాను...అదేమిటి? రావడానికి సందేహిస్తున్నావా? నా పిస్టల్‌లాంటి హత్యాయుధా లేం లేవు కావలిస్తే చూసుకో!''

పావుగంట తర్వాత ఓ సెలయేటి ధారదగ్గర కొండలమధ్య రాళ్ళమీద కు న్నారిద్దరూ. నీలకాంత్‌నుండి సంగతి విని, అన్నాడు కృష్ణ: ''భార్య వ పురుషుణ్ణి ప్రేమించా నవగానే అ అర్పించివేయడ మంత మంచితనం జీ తంలో సుఖపడనీయదండీ నీలకా బాబూ! అదది - ఒకనాడు బలత్కా లొంగదీసుకొంటే మరునాటినుండీ చ పామూలా పడివుండదూ? మీరు చాలా పాటు చేశారు!''

''కృష్ణా! నువ్వేనా ఈ మాట న్నది?'' విస్మయంగానూ, అను గానూ చూశాడు నీలకాంత్. '' గాయను పండు చేసుకోవాలని నలిపితే బడుతుందికాని దానికి రుచీ, సహజమా

వస్తాయా? మనసులేని మనిషిని బలాత్కారంగా అనుభవించడమంత అమానుషం మరొకటి ఉందా మానవ జీవితంలో? ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమించిన నువ్వే ఈ మాట చెప్పటం ఆశ్చర్యంగా వుంది. ఆమెను నువ్వు స్వీకరించడానికి సిద్ధంగా లేవా?''

"అ దెలా సంభవం నీలకాంతబాబూ? ఒకరి భార్యను మరొకరు ఏలుకోవడం ఎంత అసహజ అనుచితాలో చెప్పండి! మీరు నాకిది చెప్పడమూ బాగాలేదు; నేను ఆశపడి మీతో రావడమూ బాగాలేదు.''

''నీ ప్రేమను అంచనా వేయడంలో అంజన పూర్తిగా పొరపడింది.'' దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు.

''ఒకనాడు ఆమెను నే నెంత గాఢంగా ప్రేమించానో మీకు తెలియదు, నీలకాంత బాబూ!" నా కాళ్ళకు బంధంగా అప్పుడు మా అమ్మ లేకుంటే అంజనను చేజార్చి వెళ్ళేవాణ్ణా? డబ్బు కొల్లలుగా ఉన్నవాణ్ణి కాదు. కంసమామవంటి జగన్నాథరావు బారినుండి ఎంత దూరం పారిపోవలసి వచ్చేదో; ఎక్కడెక్కడ తిరగవలసి వచ్చేదో? అంజనా, నేనూ ఐతే పక్షుల్లాగా ఏ చెట్టుక్రిందనో పడుకుంటాం; ఉన్నపూట తింటాం లేనిపూట లేదు. కాని, ఈ తిప్పలన్నీ ముసలామెను ఎక్కడ పెట్టను? ఒక విధంగా అమ్మకోసం అంజనను వదులుకున్నా; అమ్మకూడా నన్ను విడిచి పోయింది," భారంగా తలవాల్చాడు కృష్ణ.

"గతజలసేతుబంధనం; ఇప్పు డదంతా వద్దు. అంజనను నువ్వు పెళ్ళాడడానికి నిరాకరిస్తే ఆమె బ్రతుకదు. నిన్నిలా విడిచి పెట్టను నేను. ఒకవేళ ఆమె కన్యాత్వం విషయంలో నీకు అపనమ్మకం తోస్తే-నన్నయితే నమ్మకపోవచ్చు, నీ అంజనను విశ్వసించవా? ఆమెను నీకు పరిశుద్ధంగా అప్పగించడానికి నే నెంత నిగ్రహం తెచ్చుకున్నానో, ఎన్ని తిప్పలు పడ్డానో ఎలా చెప్పను? ఉద్దేశపూర్వకంగా ఆమె భుజం మీద చెయివేసే సాహసంకూడా నాకు లేకపోయింది."

నవ్వుతూ ముఖం పైకెత్తాడు కృష్ణ. మీ ముఖం చూస్తేనే సత్యాసత్యాలు తేలిపోతున్నాయి. అంజనను అడగవలసిన అవసరంలేదు. కాని, నా పరిస్థితి మీరు కొంచెం వివేకంతో ఆలోచించండి! వీధిబడి పెట్టుకొని నా పొట్ట పోసుకుంటున్నాను. అంజనను పెళ్ళాడి ఏం సుఖపెట్టగలను?

"కూతురు మరొకరికి యిల్లాలయి హాయిగా కాపురం చేసుకొంటుం దన్నప్పుడే పూర్వపుమచ్చ ఎక్కడ బయటపడుతుందో నన్న భయంతో నన్ను హత్యచేసే ప్రయత్నాలు అంతగట్టిగా చేశా డా జగన్నాథం గాడు! మరిప్పుడు కూతుర్ని, మొగుణ్ణి విడిపించి నేను పెళ్ళాడానంటే నా కింక భూమ్మీద జీవించే అవకాశం ఉంటుం దంటారా? నన్నిలా బ్రతకనీయండి. చంపుకొన్న ఆశలు తిరిగి రెచ్చగొట్టకండి!''

''నా లక్షకు నిన్ను అధికారిని చేస్తాను లేవోయ్! దంపతులు చక్కగా ఫారిన్‌లో కాపరం పెడుదురుగాని!'' జీవరహితమైన నవ్వొకటి నవ్వాడు నీలకాంత్.

"నయం! పరలోకంలో పెట్టమన్నారు కాదు!" ఉల్లాసంలో తేలిపోయాడు కృష్ణ.

## 15

"అంజనా!''

"వచ్చారా?" భర్త కంఠం విని ఆనందంతో ఇటు తిరిగిన అంజన, అతడితో పాటు గదిలో ప్రవేశించిన కృష్ణను చూసి అంతగా ముడుచుకుపోయింది. ఎవరి తలపు వలపుతీపిలో ముంచేదో, ఎవరి సన్నిధి వెన్నలసీమగా తోచేదో అత డిప్పుడు తన నపహరించుకుపోయే ఒక రాక్షసుడులా కనబడుతున్నాడు.

నీలకాంత్ చిలిపిగానూ, ఉత్సాహంగానూ, ''వచ్చాను; నీ కృష్ణను పట్టి తెచ్చాను. ఇహ నీ ఇష్టమొచ్చిన శిక్ష విధించుకో!'' అన్నాడు.

''అంజనా! నన్ను క్షమించు!'' ఎక్కువగా మాట్లాడలేకపోయాడు కృష్ణ.

ఒక్కక్షణం స్థిరంగానూ, గంభీరంగానూ చూసింది కృష్ణను అంజన. ఆ చూపులో ఎన్నో ఆక్షేపణలూ, ఎంతో నిరసనా కనిపించాయి కృష్ణకు. ఆ చూపులో తనను నిలువునా దగ్ధంచేసే అగ్నికూడా ఉందేమో ననిపించింది.

"బాబుగారూ, స్నానానికి నీళ్ల తోడనా?"

నీలకాంత్ అద్దంలో చూసుకున్నాడు



ముఖాన్ని. తైలసంస్కారంలేక పీచులా రేగిపోయింది జుట్టు. గడ్డం బాగా పెరిగి పోయి అసహ్యంగా కనబడుతూంది; చేసు కోవాలని ఉన్నా ఒంట్లో ఓపిక లేదు. ఒళ్ళంతా నొప్పులుగా, నీరసంగా ఉంది. వేళకు నిద్రాహారాలు లేక ఆరోగ్యం చెడి పోయింది. రాత్రి ట్రెయిన్ లో జ్వరంకూడా వచ్చినట్లుంది. గడ్డం రేపు చేసుకుందాం లెమ్మని నీళ్ళు తోడమని చెప్పాడు నౌకరుకు.

స్నానానంతరం నీలకాంత్, కృష్ణా భోజనం చేశారు.

నీలకాంత్ తన పడకగదిలోకి వెళ్ళి పడుకొన్నాడు. సాయంత్రం కృష్ణతో టీ తీసుకోడానికి నౌకరు వచ్చి పిలిచాడు. కాని, నీలకాంత్ జ్వరంతో లేవలేకపోయాడు. ఆ సంగతి తెలిసి కృష్ణే వచ్చి పలుకరించి అక్కడే టీ తీసుకొని, సాయంత్రం అలా తిరిగివస్తానని చెప్పి బయటికి వెళ్ళాడు.

దీపాలు వెలిగించాక నౌకరు అంజన గదిలోకి వచ్చి, "తలనొప్పి మందు ఎక్కడ పెట్టారమ్మా?" అన్నాడు.

"ఎందుకు? ఎవరికి కావాలి?"

"బాబుగారికి తలనొప్పిగా ఉందట."

అంజన లేచి బీరువాలో వున్న మందు తీసుకొని నీలకాంత్ గదిలోకి వెళ్ళింది. "తలనొప్పా? ఎప్పటినుండీ?"


"సాయంకాలం నుండి."

అతడి కణతకు రాద్దామని అంజన మందు చేతికి తీసుకుంటూంటే నీరసంగా, "నువ్వెందుకు? రాఘవుల కివ్వు. రాస్తాడు." అన్నాడు నీలకాంత్.

"నాకు జ్వరం వచ్చినప్పుడు నా నుదుటికి మందురాసి కణతలు ఒత్తిం దెవరో గుర్తుందా? మీరు!" అని నవ్వి, నీలకాంత్ కణతలపై చేయివేసి ఉలిక్కిపడుతూ "అరే! జ్వరంకూడా వుందే! నాతో చెప్పారు కాదేం?" అంది అంజన.

* * *

రాత్రి పన్నెండు గంటల సమయం. అందరూ నిద్రాదేవి ఒడిలో ఒదిగిపోయిన




ఆ నీరవనిరామయపువేళ ఏరసోద్వేగంతో, ఎవరితో పూరింపబడుతున్నదో రివ్వురివ్వున వీచే చల్లని గాలిలో అత్యంతశ్రావ్యంగా తేలివస్తున్న దొక వంశీనాదం. ఆ రాగ సుధకు తన్మయ మొంది కరతాళధ్వనులు చేస్తున్నట్లుగా అప్పుడప్పుడూ చెట్లమీది పక్షులు కిలకిలారావాలు చేస్తున్నాయి.

నీలకాంత్‌కు చెమటపట్టి విడుస్తున్నది జ్వరం. చెమటను పైటచెరుగుతో తుడుస్తూ అతడికి నిద్రాభంగం కలుగకుండా విసన కర్రతో విసురుతూ నీలకాంత్ పక్కమీద కూర్చొన్న అంజన దుఃఖ ఉద్విగ్న హృదయురాలై అతడి వక్షంపై ముఖం పెట్టి వెక్కి వెక్కి ఏడవసాగింది. ఇక కొన్ని గంటలే యితడి సన్నిధి. అతడి ఏర్పాటు ప్రకారం మరునాడు పదిగంటలకు రిజిస్ట్రారు ఆఫీసులో కృష్ణతో తనకు వివాహం జరుగుతుంది! ఇంటికి వచ్చాక స్నేహితులకు పార్టీ. మూడు గంటలకు కృష్ణతో ఫారిన్‌కు ఎగిరిపోతుంది విమానంలో!

మెల్లగా కళ్ళు విప్పాడు నీలకాంత్. విస్మయంగా, విహ్వలంగా అంజనను లేవనెత్తి "ఏమిటిది, అంజనా?" అన్నాడు నీరసకంఠంతో.

పైటమీదపడిన మాంగల్యాలను కన్నుల కద్దుకొని, పైటలోకి వేసుకొని, చాలా సేపు నిశ్శబ్దంగా కూర్చొంది. ఆమె చర్యకు మరింత విస్తుపోయాడు నీలకాంత్. త మీదలేని భక్తి తను కట్టిన మంగళసూత్ర మీద ఎలా ఉన్న దామెకు?

"ఉదయం కృష్ణను పంపేయండి!"

"ఎక్కడికి?"

"ఎక్కడినుండి వచ్చాడో అక్కడికి!"

"నువ్వేమంటున్నావో నాకు అర్థ కావడంలేదు."

"సూటిగానే చెబుతున్నాను. నేన కృష్ణను పెళ్ళిచేసుకోవడంలేదు."

"మరి, యింతా జరిగింది ఎందుకు?"

"మీ పొరపాటే ఎక్కువగా ఉం ఇందులో."

"నాదా?"

"మరి? నా మనఃపరివర్తనను గుర్తిం లేని మూఢు లయ్యారు!"

"నే నెలా మూఢుణ్ణి అయ్యానో నా కొంచెం వివరించి చెప్పు అంజనా! నా అయోమయంగా వుంది."

"నా కన్నుల్లో కృష్ణ వియోగవిరహ తప్ప పతిదేవుల విరహం ఎప్పుడూ చూ లేదు మీరు!"

చాలా సేపు అప్రతిభుడివలె ఉండిపో యాడు నీలకాంత్. "ఆ అసంభవం ఎల సంభవ మైందంటావు?" కొంచెం ఎగ శిగా, కొంచెం కటువుగా అడిగాడు.

"వివాహాత్పూర్వం నేను కృష్ణను మ సారా ప్రేమించాను, కోరాను. అమ్మ

నాన్న కఠినచిత్తులై నన్ను మీకు కట్ట బెట్టారు. వారిని ఏమీచేయలేని అసమర్థత మీ మీద ఈసడింపును కలిగించడానికి పూను కొన్నది. మిమ్మల్ని దుఃఖపెట్టడమే నాకు సంతోష మనుకొన్నాను. కృష్ణ వియోగం దుర్భర మనిపించింది కూడా. అలా జరిగిం దది.

"కాలప్రభావంలో మనుష్యులూ, మనసులూ మారిపోతూనే ఉంటాయి. ఇది అసహజ మేమీ కాదుకదా? మీ ఆత్మ సౌందర్యం నన్ను ముగ్ధురాలిని చేసింది. మీకు నా హృదయంలో స్థానం కల్పించ దంతో కృష్ణమూర్తిది చెదరిపోయింది. తననే నమ్ముకొన్న స్త్రీని ఆమె తండ్రి భయానికి కన్నెత్తి చూడడానికికూడా సాహ సించలేని కృష్ణ పిరికితనం, పలాయనం అతడిమీది మనసును విరిచాయి.

"మనస్ఫూర్తిగా నేను పతిచరణాలకు అంకితం కావడానికి సిద్ధంగా ఉన్నాను. నన్ను ఎవరికీ అప్పగించవలసిన పనిలేదు.''

వెంటనే మాట్లాడలేదు నీలకాంత్. అతడిముఖంలో రకరకాల భావాలు కదిలి పోయాయి. చివరికి మెల్లగా, స్ఫుటంగా అన్నాడు: "నువ్వనుకొన్నంత దుర్బలుణ్ణి కాదు నేను. అంజనా! ఒక చంచలహృద యను స్వీకరించగల సహృదయత నాకు లేదు."

ఊహించని వజ్రాఘాతం తగిలినట్లు బాధను వ్యక్తపరుస్తూ "నేనంటే మీకు యిష్టం లేదా?" అంది క్షీణస్వరాన.

"ప్రపంచంలో మనకు యిష్టమైనవి, అందమైనవి చాలా ఉన్నాయి. కొన్నిటికి శిరోధార్యం కాగల అర్హత ఉండదుమరి!"

స్త్రీ సహజమైన అభిజాత్యాన్నీ, అహం కారాన్నీ వదిలి ఆమె అతడిమ్రోల నిలబ డింది. అతడి నిర్దయాత్మకమైన తిరస్కృతి ఆమెను తీవ్రంగా గాయపరిచింది.

''ఇక ఏమైనా నేను కృష్ణను పెళ్ళాడ దలచుకోలేదు. అతడిని పంపివేయండి."

''ఆ పని నావల్ల కాదు. ఆశపెట్టి తీసుకు వచ్చాను. వట్టిగా పంపించలేను. నీ మనసు మారితే నా మాట మారాలని లేదు. నువ్వు కృష్ణను పెళ్ళి చేసుకొనితీరాలి.''

"హుం!'' తిరస్కారభావంతో హుంకరించింది అంజన. "ప్రపంచంలో ఏ దానమైనా ధర్మంతో కూడివుండవచ్చు కాని, అగ్నిసాక్షిగా పెళ్ళాడిన స్త్రీని ఇచ్చివేసేం దుకు ఏ ధర్మం ఒప్పుతుందో చెప్పండి! మీకున్న ఏ వస్తువునైనా దానం చేసే హక్కు మీ కుండవచ్చు. ఇది మాత్రం లేదు!''

నిరుత్తరు డయ్యాడు నీలకాంత్.

"ఇది నా యిల్లు; నేను మీ యిల్లాలిని. ఈ అర్హతాధికారాలను కాదనడానికి మీ కేం హక్కున్నది?"

చాలా ఉదాసీనంగా మారిపోయాడు నీలకాంత్. "నీ ఇల్లయితే ఉండు. నేను వద్దనను. ఎవరికోసం ఉంటావో అతడు మాత్రం ఉండ డీ యింట్లో."

అంతదుఃఖంలోనూ స్నిగ్ధహాసం చేసింది అంజన — కన్నీటి పొరలనుండి కరుణాజన కంగా అతడివంక చూస్తూ. "నే నెక్క డుంటాను? మీతోడిదే నా గృహసీమ; స్వర్గసీమ," అంది.

''పరిహాసం కాదు. నే నిక్క డుండ దంలేదు. సరిగ్గా ఈ వారంనాడు నే నిక్కడ నుండి వెళ్ళిపోతున్నాను. భారత సేవా సమాజంనుండి పిలుపు వచ్చింది. స్వార్థ పూరితమైన సమస్తబంధాలను త్రెంచుకొని నేను వెళ్ళిపోతున్నాను."

అంజన లేచింది. ''ఇది పయనంకాదు, పలాయనం. ఎందుకు వెడుతున్నారో తెలుసు. ఎక్కడికి పారిపోయినా మీ భగ్న హృదయానికి స్వాంతనం చిక్కదు; ఏ సేవాపథంలోనూ మీరు మనస్ఫూర్తిగా లీనం కాలేరు. ఇది నా శాపం అనుకోండి; మీ జన్మగీత అనుకోండి.''

"స్త్రీనుండి ఏది పొందకపోయినా ఇదైనా పొందాను. ధన్యుణ్ణి!" అని ముఖం తిప్పుకొన్నాడు నీలకాంత్.

## 16

రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళడానికి సిద్ధంగా వున్న కారులో పూలహారాల బుట్టను ఉంచ డానికి వెళ్ళాడు నౌకరు.

వెలుపలి గదిలో పెళ్ళికొడుకు ముస్తా బులో తన అందం చూచుకొంటూ, పట్టు చీర గరగరలతో, గాజుల గలగలలతో, పూవుల ఘుమఘుమలతో దేవకన్యలా నడిచివచ్చే అంజనకోసం ఎదురు చూస్తు న్నాడు కృష్ణ.

పెళ్ళిపెద్ద నీలకాంత్‌కు రాత్రినుండీ జ్వరం వదిలినా, ఒళ్ళంతా బట్ట పిండేసినట్లు నిస్త్రాణగా, బద్ధకంగా ఉన్నా, లేనిఉత్సాహం తెచ్చుకొని పెళ్ళి ఏర్పాట్లలో లీనం కావడా నికి ప్రయత్నిస్తున్నాడు.

అయిదు నిమిషాలపాటు విశ్రాంతికోసం ఈజీచెయిర్‌లో వాలిన నీలకాంత్ టైండగ్గర పడుతూంటే ఆత్రంగా కేకేశాడు. "అంజనా! టైం అవుతూంది. త్వరగా రా!"

సమాధానం రాలేదు. మరో అయిదు నిమిషాలు వేచి అంజన గదిలోకి దారితీశాడు నీలకాంత్. అంజన కిటికీఊచలు పట్టుకొని బయటికి చూస్తూంది. బట్టలు మార్చలేదు. అలంకరణేదీ చేసుకోలేదు. బయట ఎంత సందడిగా, హడావిడిగా ఉందో గదిలో అంత నిశ్శబ్దంగా, శ్మశాన ప్రశాంతత అలుముకొనిఉంది.

"ఇంకెప్పుడు అంజనా? టైం అవుతూంది"

అంజన ముఖ మిటు తిప్పింది. ఏదో ఆయాసంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు ముఖం బిర్రుగా బిగుసుకుపోయింది.

ఆమె చేతిలో సీసా చూచి గావుకేక పెట్టాడు నీలకాంత్. "ఏంపని చేశావు అంజనా? ఒక్క అంగలో వెళ్ళి ఆమెను చేతుల్లోకి తీసుకొన్నాడు.



విషాదహాసం చేసింది అంజన. "ఇంతకంటే గత్యంతరం లేకపోయింది." మెల్లగా అతడి చేతులనుండి పాదాలమీదికి జారింది. భర్తముఖంలోకి వాలిపోతున్న కళ్ళను విచ్చిచూస్తూ, క్రమక్రమంగా క్షీణించిపోతున్న గొంతుతో అన్నది. "భర్తకంటే మిన్న అయినదీ, వాంఛించతగినదీ ఈ ప్రపంచంలో మరేదీ లేదని తెలుసుకొన్న స్త్రీ దౌర్భాగ్యవశంచేత పరిత్యక్త అయితే, ఆమె జీవితం ఎంత దుర్భరమో, స్త్రీకి నిర్వచనం తెలిసినవారికే అవగాహన.

"సౌరభ రహితమూ, సౌందర్య విహీనమూ అయిన పువ్వునుకూడా దేవుని శిరసున పెట్టగలిగితే ఆ పువ్వు పవిత్రతకు మరేపువ్వూ సరితూగలేదు. దాని విలువ ఎంతో అపారం. గతంలో నేనెంత పాపమైనా చేసివుండవచ్చు. దుష్టమతినే కావచ్చు. భాగ్యవశంచేత నాకు జ్ఞానోదయమైంది. నిండు భక్తిప్రపత్తులతో నా పతి చరణాలకు నా హృదయం అర్పించుకొన్నాను. ఒకనాటి నా కళంకచరిత్ర ఈ నివేదనతో పరిశుద్ధమూ, నిష్కళంకమూ అయినదనే అనుకొంటున్నాను. ఇక ఏ పాపమూ నావెంట రాదన్న సంతృప్తితో కన్ను మూస్తున్నాను."

ఎంతకూ గదినుండి రాని అంజనా నీలకాంతలను పిలువడానికి, టైం దగ్గర పడుతున్నకొద్దీ ఆత్రం పట్టలేక గదిగుమ్మం లోకి వచ్చిన కృష్ణ, గదిలో కనిపించిన దృశ్యం చూచి కొయ్యబారిపోయాడు. తన కలల రూపు, తన ప్రేమదేవత — ఆమె తనభర్త బాహువల్లరిలో నిర్జీవంగా వాలిపోయి వుంది ఉన్మత్తుడివలె ఆమెను హృదయానికి హత్తుకొంటూ వెర్రిగా రోదిస్తున్నాడు నీలకాంత్ "చివరి కిలా చేసిపోయావేం అంజనా?" అంటూ.